
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 09
**ఫిబ్రవరి 2014**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

## మనమందరం ఆయన పుత్రులమే!

ఈ విశ్వము సంగీతమయమైనది. శబ్దమునుండి ఉత్పన్నమైన ఈ చరాచరసృష్టి యొక్క విరాట్ విశ్వ సంగీతములో సూర్య-చంద్రులు, నక్షత్రములు, జీవ-జంతువులు, వనస్పతులు ఎల్లవేళలా తమదైన ఒక విశేష స్వరమును ఆలపిస్తూ ఉంటాయి. వీణలో ఒక తీగ మధ్యమ స్వరము పలకటానికి, ఒక తీగ పంచమస్వరము పలకటానికి బిగించబడి ఉంటాయి. అలా బిగించినప్పుడు అవి తమ నుండి విభిన్న స్వరాలను పలుకుతాయి. అదేవిధముగా మనము ఈశ్వరునితోపాటు విశేషమైన సంబంధమును ఏర్పరచుకొనవలసి ఉంటుంది. మానవ జీవితముకూడా సంగీతయుక్తముగా ప్రవహించే రీతిలో ప్రతి ఒక్కరు ఒకానొక విశిష్ట స్వరమును జాగృతపరచుకొనవలసి ఉంటుంది.

ఎవరి జీవితములో ఇప్పటివరకు వీణ తీగలు సప్తస్వరాలను పలికేవిధముగా ముడివేయబడలేదో, అతను ఒక అసంపూర్ణుడైన వ్యక్తి. అతని జీవితమునకు మూలమైన తీగలు తుచ్ఛత కారణముగా త్రెగిపోయాయి. ఏదో ఒకరకముగా వానిని క్రమబద్ధీకరించుకుని, ఒక శాశ్వత స్వరమును (రాగమును) స్థిరపరచుకోవాలి. అందులోనే ఆ మానవుని యొక్క మేలు దాగి ఉన్నది.

తీగను ఎలా కట్టాలి? ఈశ్వరుని వాణిలో దీనిని కట్టటానికి అనేకమైన స్థానములు ఉన్నాయి. వాటిలోనుండి ఏదో ఒకదానిని ఎన్నుకొనవలసి ఉంటుంది.

మంత్రము అటువంటి ఒకానొక బంధనము. మంత్రము ద్వారా మనస్సులోని విషయములను సమిష్టిగత మనస్సుతో జోడించవచ్చును. వీణకు ఉన్న గట్టిదైన చిన్న గుంజవంటిదానికి తీగలన్నీ ముడివేయబడి ఉంటాయి. అయినాకూడా తీగలన్నీ వాయించేందుకు వీలుగా వీణకు ఈ చివరినుండి ఆ చివరివరకు విస్తరించుకుని ఉంటాయి. మనిషికూడా ఈశ్వరునితో అలానే జోడించబడాలి. భగవంతునితో మనిషికి గ్రంథి బంధనమును ఏర్పరచుటకు మంత్రమే సహాయపడుతుంది. 'పితానోఽసి' - 'నేను ఆయన పుత్రుడను!' అనేది అటువంటి ఒకానొక మంత్రము. జీవితమును ఈ తీగతో బంధించినప్పుడు మన సమస్త ఆలోచనలు, పనులలో ఒక విశేషమైన రాగము పలుకబడుతుంది. ఈ మంత్రమే సంగీతరూపములో మూర్తీభవించి శరీరములోని ప్రతి ఒక్క తీగలోను ప్రతిధ్వనిస్తుంది.

**చిరునవ్వు ఆయుష్షును పెంచుతుంది**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** మనమందరం ఆయన పుత్రులమే! | 1 |
| 2. | **విషయసూచిక-సద్గురు వాణి :** సమస్యలకు మూలకారణం | 2 |
| 3. | **వేదమంత్రం :** బ్రాహ్మణ ధర్మం | 3 |
| 4. | **గాయత్రీ విద్య - 41 :** నాద సాధన | 4 |
| 5. | **గాయత్రీ చిత్రావళి - 20 :** సంతృప్తికరమైన దాంపత్య జీవనం | 7 |
| 6. | **బోధ కథ :** తోటివారితో ప్రేమగా ఉండాలి | 8 |
| 7. | **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 20 :** హిమాలయాల యాత్ర-1 | 9 |
| 8. | **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 13 | 12 |
| 9. | **కుండలినీ మహావిజ్ఞానం-6 :** కుండలినీ యొక్క పంచ ముఖములు - పంచశక్తి ప్రవాహములు | 14 |
| 10. | **మహా శివరాత్రి ప్రత్యేకం :** శివ సంకల్పానికి శుభ ముహూర్తం మహాశివరాత్రి | 18 |
| 11. | **వ్యక్తి వికాసం-3 :** ఆరోగ్యమే మహాభాగ్యం | 21 |
| 12. | **వసంత పంచమి ప్రత్యేకం :** మనస్సులో బ్రాహ్మణత్వం - పనిలో ఋషిత్వం | 23 |
| 13. | **ఇచ్ఛాశక్తి :** గుప్త మనస్సులో దాగిన అనంతశక్తి | 29 |
| 14. | **వసంత పంచమి ప్రత్యేకం :** పరమపూజ్య గురుదేవుల స్మృతులు | 31 |
| 15. | **సమాజ నిర్మాణం :** వివాహములలో దుబారా ఆపండి | 33 |
| 16. | **రంగుల విజ్ఞానం :** మనస్సును ఆహ్లాదపరిచే రంగుల ప్రపంచం | 35 |
| 17. | **కలర్ ఇంజనీరింగ్ - 3 :** ఆలోచనలశక్తి | 38 |
| 18. | **పూజ్య గురుదేవుల అమృతవాణి:** యుగ పరివర్తనలో మన బాధ్యత-4 | 41 |
| 19. | **నా వారితో నా మాట :** ఇప్పుడు జరగాలి - లేకపోతే మరి ఎప్పటికీ జరగదు | 44 |
| 20. | **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు | 47 |




## సద్గురు వాణి

### సమస్యలకు మూలకారణం

అనేక కష్టాలకు, విపత్తులకు, సంకటాలకు మూలకారణం బలం లేకపోవడమే. నిర్బలులపై రోగం, హాని, అవమానాలు ఆక్రమణ చేస్తాయి. నిర్బలత్వం అనేది ఒక ఆకర్షణ శక్తి వంటిది. ఇది విపత్తులను ఆకర్షించుకుంటుంది. బలవంతుల జోలికి ఎవరు పోరు. ఎవరు వారిని కన్నెత్తి చూడరు. దయ, మంచితనం ఉండవలసిందే. కానీ మన మంచితనాన్ని బలహీనంగా భావించే పరిస్థితి రానీయకూడదు. అందువలన మనం మానసికంగా, శారీరకంగా బలవంతులము అయ్యేందుకు ప్రయత్నించాలి, సాధించాలి.


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: **ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ**

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| విడి ప్రతి రూ॥ 12/- | 3 సం॥ చందా రూ॥ 350/- |
| సం॥ చందా రూ॥ 120/- | 10 సం॥ చందా రూ॥ 1116/- |


**మన పనులు మనం చేసుకోవడానికి ఆడ, మగ అనే తేడా అనవసరం**

వేద మంత్రం

# బ్రాహ్మణ ధర్మం

**ఉత్ తిష్ఠ బ్రాహ్మణస్పతే దేవాన్ యజ్ఞేన బోధయ ।**
**ఆయుః ప్రాణం ప్రజాం పశూన్ కీర్తిం**
**యజమానంచ వర్ధయ ॥ (అథర్వవేదం 19/63/1)**

**భావార్థం:** బ్రాహ్మణులు కోరుకొనదగినది, స్వయంగా సావధానులగుట, యజమానులను దుష్కర్మల నుండి నిరోధించ గలుగుట, అందరికి ఆయుష్షు, ప్రాణము, ధన-ధాన్యములు, కీర్తి సుఖశాంతుల వృద్ధి.

**సందేశం:** సమాజంలో పౌరులు అందరు జ్ఞానవంతులు, శీలవంతులు, సంస్కారవంతులు కావాలి. వారు నిరంతరం ఇంద్రియ సంయమనం, అర్థసంయమము, సమయ సంయమము, వాక్‌సంయమము అభ్యసించాలి. అంతటా సత్కర్మలు, సదాలోచనలు, సుఖశాంతులు అభివృద్ధి కావాలి. ఇటువంటి ఆదర్శవంతమైన సమాజము తయారుచేసే బాధ్యతను ఋషులు బ్రాహ్మణులపై ఉంచారు.

బ్రాహ్మణుల, విద్వాంసుల మొదటి కర్తవ్యం తాము జాగరూకతతో సావధానముగా ఉండాలి. జ్ఞాన విజ్ఞానముల గూఢతత్వాన్ని అర్థం చేసుకొని, నీతి-అవినీతుల మధ్య తేడా తెలుసుకొని, సత్యమును గ్రహించాలి. స్వయంగా సరియైన దారి తెలుసుకోకపోతే ఇతరులకు మార్గదర్శనం ఎలా సంభవమవుతుంది? ప్రపంచములో రెండు జీవన మార్గాలు ఉన్నాయి. కఠోపనిషత్ వాటినే 'శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్య మే తస్తతా' అని చెప్పబడింది. ఏది కళ్యాణకరమో అది శ్రేయోమార్గం; బాగా అనిపించేది, ఇంద్రియాలకు సుఖాన్ని ఇచ్చేది ప్రేయోమార్గం. మన మనస్సు ఈ ప్రేయోమార్గం వైపు ఎక్కువ పరుగెడుతుంది. స్వాదేంద్రియం రకరకాల రుచికరమైన భోజనాన్ని కోరుతుంది. ఇదేవిధంగా అన్య ఇంద్రియాలు బాహ్య సుఖసాధనలలో ఇరుక్కొని ఆత్మ-పరమాత్మను మరచి మనుష్యుడు అనేకానేక దుష్ప్రవృత్తులలో చిక్కుకుపోతుంటాడు. దోష దుర్గుణాలలో చిక్కిన మనిషి మత్తులో మునిగి వాటి నుండి బయట పడలేకపోతున్నాడు. అతని ఆత్మ అతన్ని ధిక్కరించినా అతడు చూపు మరల్చుకొని దుర్వ్యసనాలతో, తేనెలో పడిన ఈగవలె ఇరుక్కుపోతున్నాడు. క్రమక్రమంగా మనోబలం దెబ్బతిని, అసహాయుడు అవుతున్నాడు. తన జీవితం నాశనం చేసుకోవటమే కాక, ఇతర వ్యక్తులకు నరకం తయారు చేస్తున్నాడు.

ప్రాపంచిక విషయాలను పూర్తిగా వదలి మనుష్యులందరు వైరాగ్యులు, సన్యాసులు కావాలని కాదు. ప్రాపంచికవాదం, అధ్యాత్మికవాదం రెండూ మహత్వపూర్ణమైనవే. జీవన సాఫల్యానికి ఈ రెండింటి మధ్య తగు సమన్వయం ఉండాలి. అప్పుడే ప్రజల శారీరిక, మానసిక, ఆత్మిక ఉన్నతి సంభవమవుతుంది. అప్పుడే దేశంలో స్వర్గీయ వాతావరణం ఏర్పడుతుంది, ప్రజలు ఆరోగ్యవంతులు, దీర్ఘాయువు కలవారు, ప్రాణవంతులు, శీలవంతులు, సమర్థులు అవుతారు. దేశకీర్తి పతాకం అంతటా ఎగురుతుంది.

తపస్సు, త్యాగం, సంయమనం, జ్ఞానం, ఉదారత, లోకహితంవంటి ప్రవృత్తులను తనలో నింపుకొని, మంచి పునాది మీద నిలబడ్డవారు బ్రాహ్మణులు. అట్టివారు జనమానస ప్రవాహ దిశను మళ్ళించగల వజ్రశిలలాగా గట్టిగా నిలబడతారు. వారు ఏ రంగాన్ని ఎన్నుకొన్నా తమ శ్రేష్ఠ వ్యక్తిత్వము, ఉన్నత ఆదర్శము, ప్రచండ పురుషార్థము ద్వారా లక్షల-కోట్ల మనుష్యులలో అసురత్వం, స్వార్థపరత్వాన్ని తగ్గించి, దేవత్వాన్ని పెంచుటలో సఫలురవుతారు.

తనను జాగరూకతతో ఉంచుకొనుట, ఇతరులను జాగృతం చేసే సామర్థ్యం కలిగి ఉండుటయే బ్రాహ్మణధర్మం.

★★★

## పండుగలు

**ఫిబ్రవరి 2014**

| | |
|---|---|
| 04-02-2014 | వసంత పంచమి (శ్రీ పంచమి) |
| 06-02-2014 | రథ సప్తమి |
| 27-02-2014 | మహా శివరాత్రి |

**మార్చి 2014**

| | |
|---|---|
| 03-03-2014 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |
| 16-03-2014 | హోలి |
| 31-03-2014 | ఉగాది |

కలసి పనిచేస్తే పనులు త్వరగా పూర్తవుతాయి



## గాయత్రీ విద్య-41

# నాద సాధన

శబ్దమును బ్రహ్మ అన్నారు ఎందుకంటే ఈశ్వరుని, జీవిని ఒక శృంఖలలో కట్టివేయడమనే పని శబ్దం ద్వారానే జరుగుతుంది. సృష్టి యొక్క ఉత్పత్తి కూడా శబ్దంతోనే ప్రారంభమయింది. పంచ తత్వములలో మొట్టమొదట ఆకాశం తయారయింది. ఆకాశం యొక్క తన్మాత్ర శబ్దం. అన్య సమస్త పదార్థములవలె శబ్దం కూడా రెండు ప్రకారములుగా ఉంటుంది. సూక్ష్మము, స్థూలము. సూక్ష్మశబ్దాలను ఆలోచనలని అంటారు, స్థూల శబ్దాన్ని నాదమని అంటారు.

బ్రహ్మలోకము నుండి మన కొరకు ఈశ్వరీయ శబ్ద ప్రవాహం నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ఈశ్వరుడు మనతో మాట్లాడాలని కోరుకుంటాడు కానీ మనలో చాలా కొద్దిమంది మాత్రమే దానిని వినాలని కోరుకుంటారు. ఈశ్వరీయ శబ్దములు మనకు కళ్యాణకారకమగు ఆలోచనలను అందిస్తుంటాయి. వాటిని వినగలిగి, అర్థం చేసుకోగలిగి, తదనుసారం నడుచుకోగలిగితే, నిస్సందేహంగా జీవనోద్దేశ్యం వైపు వేగంగా వెళ్ళగలుగుతాము.

మన అంతఃకరణ ఒక రేడియో, మనం దానివైపు అభిముఖమై మనోవృత్తులను అంతర్ముఖం చేసుకుని ఆత్మలో ప్రస్ఫుటమయ్యే దివ్య ఆలోచనా తరంగాలను వినగలిగితే, ఈశ్వరీయ వాణిని ప్రత్యక్షంగా వినవచ్చు. దీనినే ఆకాశవాణి అని అంటారు. మనము ఏమి చెయ్యాలి? ఏమి చెయ్యకూడదు? ఏది ఉచితం, ఏది అనుచితం? అనే దానికి ప్రత్యక్ష సందేశం ఈశ్వరుని నుండి ప్రాప్తిస్తుంది. ఈ ఆలోచనా ధారలను అంతః కరణ పిలుపని, ఆత్మ యొక్క సందేశమని, ఈశ్వరుని సందేశమని, ఆకాశవాణి అని, తత్వజ్ఞానం అని అంటారు. ఈ దివ్య సందేశములను వినగలిగిన వారిని ఆత్మదర్శి అని, ఈశ్వర పరాయణుడని అంటారు.

ఈశ్వరుని మాటలను వినేవాడు, ఈశ్వరునితో తన మాటలు చెప్పగలిగేవాడు ఈశ్వరునికి చాలా దగ్గరవుతాడు. ఈ దివ్యమైన కలయిక కొరకు ఈ శరీరం యొక్క కన్నులతో, చెవులతో పని లేదు. ఆత్మకు దగ్గరగా ఉన్న అంతఃకరణ తన దివ్య ఇంద్రియముల సహాయంతో ఈ పనిని తేలికగా చెయ్యగలుగు తుంది. ఆత్మ, కషాయ కల్మషములతో మసకబారితే ఈ అత్యంత సూక్ష్మశబ్దములు, దివ్యమైన ఆలోచనలు మసక మసకగానే ఉంటాయి. ఆంతరిక పవిత్రత ఎక్కువయిన కొద్దీ ఈ దివ్య సందేశములు స్పష్టముగా తెలుసుకోగలుగుతారు. ప్రారంభములో తన కొరకు కర్తవ్యబోధ చెయ్యబడుతుంది, పాపపుణ్యముల సంకేతమియ్యబడుతుంది. చెడుపని చేసేటప్పుడు లోపల భయం అసహ్యం, సిగ్గు, సంకోచం మొదలైనవి కలుగుతాయి. మంచి పనులు చేసేటప్పుడు ఆత్మ సంతోషం, ప్రసన్నత, ఉత్సాహం కలుగుతాయి.

ఇంకా ముందు ముందు భూత, భవిష్యత్తు, వర్తమాన సంఘటనలు తెలుస్తాయి. ఎవరి భవిష్యత్తు ఎలా తయారవు తున్నది? భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నాయో తెలుస్తాయి. ఇంకా ఉచ్ఛస్థితికి వెళ్ళినప్పుడు సృష్టి యొక్క అన్ని రహస్యములు విదితమవుతాయి. అతని దగ్గర ఏ విషయం దాగదు. అతనికి ఇంత గొప్ప జ్ఞానం లభించినప్పుడు, ఆ జ్ఞానమును ఉపయోగించుటలో చాలా జాగ్రత్తగా ఉంటాడు. ఈ దివ్య జ్ఞానం బాలబుద్ధిగల వారి చేతులలో పడితే దానిని గారడి లాగా తీసుకుని పాడు చేస్తారు. కానీ బుద్ధిమంతులు తమ ఈ శక్తిని గురించి ఇతరులకు తెలియనివ్వరు, దానిని ప్రాపంచిక విషయములలో ఉపయోగించక ఇతరుల ఆత్మోన్నతికి వినియోగిస్తారు.

శబ్దబ్రహ్మ యొక్క రెండవ రూపం ఆలోచనల కన్నా సూక్ష్మమైనది. ప్రకృతి యొక్క అంతరాళములలో ఒక ధ్వని, ప్రతిక్షణం ఉత్పత్తి అవుతూ ఉంటుంది. దీని ప్రేరణతోనే, అఘాతములతో (దెబ్బల) పరమాణువుల గతి (కదలిక) ఉత్పన్న మవుతుంది. దీనితోనే సృష్టి యొక్క సమస్త క్రియా కలాపములు జరుగుతాయి. ఈ ప్రారంభిక శబ్దం ఓం (ఓం). ఈ ఓం (ఓం) ధ్వనిని అన్ని తత్వముల క్షేత్రములలో ప్రవేశించినప్పుడు ఆ ధ్వనులలో తేడా ఉంటుంది. మురళి యొక్క రంధ్రాలలో

**కలసి ఉంటే కలదు సుఖం**

గాలి ఊదితే దానిలో ఒక ధ్వని ఉత్పన్నమవుతుంది. కానీ ఒక్కొక్క రంధ్రములో ఎంత గాలి వెళ్తుందో దానికి తగినట్టు భిన్న భిన్న స్వరముల ధ్వని ఉత్పత్తి అవుతుంది. ఇదే విధంగా ఓంకార ధ్వని విభిన్న తత్వముల సంపర్కములో రకరకాల స్వరలహరులుగా పరిణితి చెందుతుంది. ఈ స్వరలహరులను వినడమే నాదయోగము.

పంచతత్వములలో ప్రతిధ్వనించిన ఓంకారం యొక్క స్వరలహరులను వినే నాదయోగ సాధన అనేక విధములుగా అతి మహత్వపూర్ణమైనది. ఇట్టి దివ్యమైన సంగీతం వినుట వలన కలిగిన ఆనందం ఎంతటి మధుర వాద్యసంగీతము వినినను కలుగదు. ఇంకా ఈ నాదం వినడం వలన మానసిక తంతువులు వికసిస్తాయి. సర్పం నాదస్వరం విన్నప్పుడు దాని నాడులలో ఒక విద్యుత్తు ప్రవాహం ఎగసిపడుతుంది. మధుర సంగీతం విన్నప్పుడు జింకకు విలక్షణమైన మైమరుపు కలుగుతుంది. ఐరోపాలో ఆవుల పాలు పితికేటప్పుడు మధుర సంగీతాన్ని వినిపిస్తే గోవుల నాడీమండలం ఉత్తేజితమయి ఎక్కువ పాలు ఇస్తున్నాయి. నాదం యొక్క దివ్య సంగీతమును విన్నప్పుడు మానవ మస్తిష్కంలో కూడా అలాంటి స్ఫురణ కలుగుతుంది. దీనివలన అనేక గుప్త మానసిక శక్తులు వికసిస్తాయి. ఈ విధంగా భౌతిక, ఆధ్యాత్మిక దిశలలో ప్రగతి కనిపిస్తుంది.

ఇంకో లాభము ఏకాగ్రత. ఒక వస్తువుపైన గాని, నాదంపైన గాని ధ్యానం ఏకాగ్రమయినప్పుడు మనస్సు యొక్క చిందరవందరగా పడి ఉన్న శక్తులు ఏకత్రితమవుతాయి. ఈ విధంగా మనస్సును వశంలోనికి తెచ్చుకోవచ్చు. చేయదలచుకున్న పని మీద మనస్సును పూర్తిగా లగ్నం చేసినప్పుడు సాధన సఫలమవుతుంది. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి ఈ సఫలతలు ఎంత గొప్పగా ఉంటాయో బాగా తెలుసు. భూతద్దం ద్వారా రెండు అంగుళముల పరిధిలో ఉన్న సూర్యకిరణాలను ఒక బిందువుపై కేంద్రీకరిస్తే అగ్ని ఉత్పత్తి అవుతుంది. మానవుని శరీరంలో, చిందరవందరగా పడి ఉన్న అనంతమైన దివ్య శక్తులను ఏకీకరణ చేస్తే ఒక మహాశక్తి ఉత్పన్నమవుతుంది. దీనితో ప్రపంచాన్ని కదిలించ వచ్చు. తన కొరకు ఆకాశంలో మార్గం తయారు చేసుకోవచ్చు.

నాదం యొక్క స్వరలహరులను పట్టుకుని సాధకుడు, ఉద్గమ బ్రహ్మస్థానమును చేరగలడు. ఆత్మకు అభీష్ఠ స్థానం ఇదే. బ్రహ్మలోక ప్రాప్తి ముక్తి, నిర్వాణం, పరమపదం మొదలైన పేర్లతో కూడా పిలువబడుతుంది. నాదం యొక్క ఆధారం మీద మనోలయం చేసుకుని సాధకుడు యోగం యొక్క చివరి మెట్టు కొరకు వెళ్ళగలడు. అభీష్ట లక్ష్యాన్ని ప్రాప్తించుకొనగలడు.

నాదసాధన అభ్యాసం కొరకు ఏకాంతమైన, ఎక్కువగా శబ్దములు వినపడని స్థానాన్ని ఎన్నుకోవాలి. ఎక్కువ వెలుతురు ఈ అభ్యాసానికి పనికిరాదు. కొంచెం చీకటిగా ఉన్న గదిని చూసుకోవాలి. ఈ అభ్యాసం కొరకు రాత్రి ఒక ప్రొద్దు గడిచిన తర్వాత నుండి సూర్యోదయం వరకు మంచిది. ఈ సమయం వీలుకాకపోతే ఉదయం 7 గంటల వరకు, సాయంత్రం సూర్యాస్తమయం తరువాత ఏదో ఒక సమయంలో చేసుకొనవచ్చు. ప్రతిరోజు ఒకే సమయంలో సాధన చేసుకోవాలి. మీరు ఎన్నుకున్న గదిలో పడక కుర్చీ కాని, గోడకు ఆనుకుని కాని మెత్తగా సుఖంగా కూర్చునే వీలు చూసుకోవచ్చు. గదిలో ఒక మూల కూడా సుఖంగా కూర్చోవచ్చు. శరీరాన్ని పూర్తిగా సడలించి (relax) ఉంచుకోవాలి.

శరీరాన్ని ఒక దూది పింజవలె ఉన్నదని భావించాలి. శరీరాన్ని పూర్తిగా సడలించాలి. శరీరం బరువుగా అనిపించి అటు ఇటు కదలటం మొదలవుతుంది. పడకకుర్చీ లేక గోడకు ఆనుకుని కూర్చుంటే శరీరం అలాగే కదలకుండా ఉంటుంది. శుభ్రమైన దూదిని ఉండలుగా చేసి చెవులలో పెట్టుకోవాలి. ఇలా చేయడం వలన బయటి శబ్దములు లోపలికి ప్రవేశించ లేవు. చెవులను వేళ్ళతో మూసి కూడా పని చేసుకోవచ్చు. ఇప్పుడు బయటి శబ్దములు వినపడవు, ఒకవేళ వినపడ నప్పటికి అటువైపు ధ్యానం ఉంచక మూర్ధా స్థానము (తల) మీదకు ధ్యానం తీసుకెళ్ళాలి. అక్కడ నుండి వస్తున్న శబ్దములను ధ్యానపూర్వకంగా వినే ప్రయత్నం చేయాలి.

ప్రారంభంలో ఎటువంటి శబ్దములు వినపడకపోయినా 3-4 రోజుల ప్రయత్నం తరువాత సూక్ష్మ కర్ణేంద్రియములు నిర్మలమవుతూనే శబ్దములు స్పష్టంగా వినిపిస్తాయి. మొదట్లో శరీరంలో జరిగే రక్తప్రవాహం, రైలుబండి నడిచినట్లుగా చుక్-చుక్, చుక్-చుక్ అని వినిపిస్తుంది. వాయువు రాక

**ప్రగాఢ విశ్వాసానికి, నిరంతర ఆకాంక్షకు ప్రతీక శ్రద్ధ**

పోకల శబ్దం మేఘ గర్జనలవలె, శరీరం యొక్క క్రియల ద్వారా ఉత్పన్నమవుతాయి. ఇదేవిధంగా మానసిక క్రియల ద్వారా రెండు రకాల శబ్దములు ఉత్పన్నమవుతాయి. మనస్సు యొక్క చంచలత యొక్క తరంగములు మానస తంతువులకు తగిలి రేకులపై వర్షం కురిసినట్లు శబ్దములను ఉత్పన్నం చేస్తాయి. మస్తిష్కం బాహ్య జ్ఞానమును గ్రహించి తనలో ధారణ చేసుకుంటుంటే ఏదో ప్రాణి శ్వాస తీసుకున్నట్లు ఉంటుంది. రెండు మూడు వారాల అభ్యాసంతో ఈ శబ్దములు స్పష్టంగా వినిపిస్తాయి. ఈ శబ్దములు వినడం వలన సూక్ష్మ ఇంద్రియములు నిర్మలమవుతాయి, గుప్తశక్తులను గ్రహించేందుకు వాటి యోగ్యత మొదలవుతుంది.

నాద శ్రవణమునకు కావలసిన పెంపొందినప్పుడు వేణుగానం, ఈలపాట కలసిన అనేక రకముల శబ్దావళి వినిపిస్తాయి. ఇవి సూక్ష్మలోకంలో జరిగే క్రియలను పరిచయం చేస్తాయి. తప్పిపోయి ఎన్నో రోజుల తర్వాత దొరికిన తనయుడు తల్లి ఒడిలో పొందే ఆనందాన్ని, ఆ శబ్దాలను విన్న సాధకుడు పొందుతాడు.

నెమ్మదినెమ్మదిగా శబ్దములు ఇంకా ఎక్కువ స్పష్టంగా వినిపిస్తాయి. అభ్యాసం చేసేవాడు అద్భుతమైన ఆనందాన్ని పొందుతాడు. అప్పుడప్పుడు ఆ శబ్దములలో మునిగిపోయి ఆనందంతో విహ్వలమయి శరీరాన్ని మనస్సుకు మరచి పోతాడు. అంతిమ శబ్దము ॐ (ఓం). ఇది చాలా సూక్ష్మ మైనది. దీని ధ్వని గంట కొట్టినట్లుంటుంది. గడియారంలో గంటలు కొట్టినట్లుగా ఓంకారం వినిపిస్తుంది.

ఓంకార ధ్వని (ॐ) ధ్వని వినిపించడం మొదలయినప్పుడు నిద్ర-తంద్రా లేక స్పృహ కోల్పోయేటువంటి దశ ఉత్పన్నమవుతుంది. సాధకునికి శరీరం-మనస్సు స్పృహ కోల్పోతుంది. సమాధి సుఖం-తురీయ స్థితి యొక్క ఆనందం లభిస్తుంది. ఆ స్థితికంటే ఇంకా పైకి వెళ్ళగలిగి ఆత్మ పరమాత్మలో ప్రవేశిస్తుంది, చివరిగా పరమాత్మ స్థితి ప్రాప్తిస్తుంది.

ప్రణవనాదం యొక్క ప్రారంభరూపం అనాహత నాదం. రెండు వస్తువుల ఘర్షణ వలన ఉత్పన్నమయ్యే శబ్దాన్ని ఆహత నాదం అంటారు. వాణి ఆకాశతత్వంతో కొట్టుకోవడం వలన లేదా రెండు వస్తువులు కొట్టుకోవడం వలన అయ్యే శబ్దాన్ని "ఆహత" నాదమని అంటారు.

ఎటువంటి కొట్టుకోవడం (ఘర్షణ) లేకుండా దివ్య ప్రకృతి అంతరాళము నుండి ఉత్పన్నమయ్యే ధ్వనులను అనాహత నాదమని అంటారు. ఈ అనాహత నాదం పది రకములుగా ఉంటుంది. వాటి పేర్లు 1) సంహారక 2) పాలక 3) సృజక 4) సహస్రదళ 5) ఆనందమండల 6) చిదానంద 7) సచ్చిదానంద 8) అఖండ 9) ఆగరు 10) అలఖ. వీటి ధ్వనులు అందెల రవళివలె, సముద్ర అలలవలె, మృదంగంవలె, శంఖరావంవలె, ట్రంపెట్‌వలె (तुरही), మురళివలె, వీణానాదంవలె, సింహగర్జనవలె, క్లారినెట్ (clarinet) వలె బుల్ బుల్ పిట్ట (పికిలి పిట్ట) వలె ఉంటాయి.

రేడియో స్టేషన్ల నుండి ఒకే సమయమందు అనేక ప్రోగ్రాములు ఎలా ప్రసారం అవుతాయో, అదేవిధంగా అనేక రకములైన అనాహత శబ్దములు కూడా ప్రస్ఫుటిస్తాయి. వాటి కారణం, ఉపయోగం, రహస్యం అనేక రకాలుగా ఉంటాయి. 64 రకాల అనాహత నాదములు ఇప్పటి వరకు లెక్కించ బడ్డాయి. వీటన్నింటిని వినడం అందరికి సంభవం కాదు. ఎవరి ఆత్మిక శక్తి ఎంత ఎత్తుకు ఎదుగుతుందో వారు అంతవరకే సూక్ష్మశబ్దములను వినగలరు. కాని పైన చెప్పిన పది శబ్దములు సామాన్య ఆత్మబలం కలవారు కూడా తేలికగా వినగలరు.

ఇవి సూక్ష్మలోకముల దివ్య భావనలు. సూక్ష్మజగత్తులో ఏ స్థానంలో ఏమి జరుగుతున్నది, ఏ ప్రయోజనం కొరకు ఏమి చేయబడుతున్నది అనే గుప్త రహస్యములు ఈ శబ్దముల ద్వారా తెలుసుకోగలరు. ఏ సాధకుడు ఏ శబ్దాన్ని స్పష్టంగా వినగలడనేది సాధకుని మనోభూమిపై ఆధారపడి ఉంటుంది.

★★★


యుగశక్తి గాయత్రి
మాస పత్రిక చదవండి !
చదివించండి !!


శ్రద్ధతో అనితర సాధ్యమైన విజయం తథ్యం

గాయత్రీ చిత్రావళి - 20

# సంతృప్తికరమైన దాంపత్య జీవనం




ప్రాపంచిక జీవితంలో శరీరరక్షణ కొరకు అన్నము, వస్త్రము మొదలైన అవసరాలు తీరిన తర్వాత అన్నింటికంటే ముఖ్యమైనది సంతృప్తికరమైన దాంపత్య జీవితం. ఈ రంగములో కొరత, వికృతి, అసంతోషము ఉంటే అన్ని రకముల భౌతిక సుఖసాధనాలు ఉన్నప్పటికీ సంతృప్తి ఉండదు.

సంత్, మహాత్ములు, త్యాగులు, యోగులు, బ్రహ్మచారులు అనేకమంది స్త్రీలకు దూరంగా ఉండి, స్త్రీని ద్వేషించే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ ఉంటారు. ఈ ప్రతిపాదన క్రిందిస్థాయి మాదక, ఉత్తేజక, విషయవాసనలకు విరుద్ధంగా చెప్పబడింది. దానిని మినహాయిస్తే ఇతర అన్ని రూపాలలో స్త్రీలు ఆదరణీయము, శ్రద్ధాస్పదము, పూజనీయము. వారిలో స్వభావతః పురుషుల కంటే దైవీతత్త్వము అధికంగా ఉంటుంది. తల్లి, సోదరి, కుమార్తె, ధర్మపత్ని రూపంలో వారి మహిమను భారతీయ ఋషులు ఎంతగా గానం చేశారో, ఎంతగా గౌరవించారో అంతగా మరెవ్వరు చేయలేదు. నారి అర్ధాంగి, ఆమె లేకుండా పురుషుడు అసంపూర్ణం. మన దేవుళ్ళందరు పత్నీ సమేతులే. అధికాంశ ఋషులు తమ భార్యలతో కలిసే తపస్సు చేసుకుంటూ ఉండేవారు. స్త్రీ ద్వారా ఉపయోగకరమైన సేవ, సహాయము పురుషునికి అవసరము. అలాగే స్త్రీకి పురుషుని అవసరము ఉన్నది. మాత యొక్క కృపకు విరాగి ఎంత అర్హుడో, సాఫల్యానికి ఎంత అధికారియో గృహస్థుడు కూడా అంతే అర్హుడు, అధికారి.

గాయత్రీమాత యొక్క నీడ ప్రాప్తించిన సాధకుల దాంపత్య జీవనం ఎంతో మధురంగా ఉంటుంది. అవివాహితులు ఉపాసన చేస్తే ఉత్తమ సేవాభావియైన వధువు, వరుడు, కోరుకొన్న విధంగా లభిస్తారు. దంపతుల మధ్య పరస్పర వైషమ్యము, ప్రతికూలత, కలహకారణాలు ఉంటే మాత కృపతో అవి పరిష్కారమవుతాయి. కలహానికి అనేక కారణాలు ఉంటాయి. శరీరము, మనస్సు, స్వభావము, కార్యములు, అభిప్రాయములలో తేడాల కారణంగా ఇరువురిలో ఐకమత్యం, సరసత్వం, స్నేహం ఉత్పన్నము కావు. ఈ అసంతృప్తి జీవితాలలో, మాత యొక్క కృపావర్షముతో పరివర్తన కలుగుతుంది. ప్రతికూలతలన్నీ అనుకూలతలుగా మారిపోతాయి. సద్బుద్ధి పెరుగుట వలన కలహబీజాలు తమంతట తామే నశించిపోతాయి.

*– అనువాదం : డా॥ తుమ్మూరి*

**అడుగు ముందుకు వేస్తే అభ్యుదయం నీ వెంటే**

బోధ కథ

# తోటివారితో ప్రేమగా ఉండాలి

జాతక కథలలో మంచి జ్ఞానాన్ని అందించే ఒక కథ ప్రచారంలో ఉన్నది. పూర్వకాలంలో బోధిసత్వుడు ఒక కోలంకి పిట్ట (బుఖ్ఖుపిట్ట) గర్భంలో జన్మించాడు. బుఖ్ఖుపిట్ట రూపంలో ఉన్న బోధిసత్వుడి యొక్క ఆకారం చాలా చిన్నదిగా ఉన్నా దాని శరీరం చాలా దృఢంగా ఉండేది. గడ్డిపరకలు తింటూ జీవిస్తూ ఉండేది. ఆ పిట్ట ఒక చెట్టుని తన నివాసంగా చేసుకుని కిలకిలారావాలు చేసుకుంటూ, ఆడుకుంటూ చాలా ప్రశాంతంగా జీవితాన్ని గడిపేది.

ఆ ప్రక్కనున్న చెట్టు మీద ఒక కాకి నివసిస్తూ ఉండేది. అది స్మశాన భూమిలో ప్రతి రోజు ఎవరో ఒకరు పెట్టే కాకబలి కడుపునిండా తింటూ ఉండేది. ఇంకా చనిపోయినటువంటి ఏనుగులు, ఒంటెలు, గేదెలు మొదలైన వాటి మాంసం కూడా వెతుక్కుని తింటుండేది. అందుచేత దాని పొట్ట ఎప్పుడూ ఖాళీగా ఉండేది కాదు. అయినా సరే ఆ కాకి యొక్క మనస్సు ఎప్పుడూ చింతాక్రాంతంగా ఉండేది. ఎప్పుడు చూసినా అది అన్ని వైపులా కంగారుగా చూస్తూ, ఒక్క క్షణం కూడా నేల మీద ఒక చోట నిలవక అన్ని వైపులకు పరుగుతీస్తూ ఉండేది. సహజంగా దాని శరీరం నలుపు, ఇలా నిరంతరం చింతించటం వలన దాని శరీరం రంగు పాలిపోయినట్లుగా ఉండేది.

ఒక రోజు బాగా వర్షం కురుస్తున్నది. అందుచేత చెట్లమీద ఉన్నటువంటి పక్షులు తమ గూళ్ళు వదలి బయటకు రావటానికి వీలు కాలేదు. కాకికి బుఖ్ఖుపిట్ట రూపంలో ఉన్న బోధిసత్వునితో మాట్లాడాలని చాలా కాలంగా కోరిక ఉన్నది. అది ఇప్పుడు ఈ వర్షపు కారణంగా అనుకోకుండా తన కోరిక తీరుతుందని చాలా సంతోషించింది. కాకి గూడులో నుంచి తన ముక్కును బయటకు పెట్టి బుఖ్ఖుపిట్టకు అభివాదం చేసి, ఇలా అన్నది. "మీ నుంచి ఒక విషయం తెలుసుకోవాలని చాలాకాలంగా నాకు తపనగా ఉన్నది. దయచేసి మీరు నా యొక్క సందేహాన్ని తీర్చాలి అని అడిగింది.

బుఖ్ఖు పిట్ట చాలా సౌమ్యంగా కాకితో ఇలా అన్నది "మీరు చాలా గొప్పవారు. మీలాంటి గొప్పవారితో పాటు నేను కలిసి ఉండటం నాకు చాలా సంతోషాన్ని కలిగిస్తున్నది. నేను మీతో ఇలా మాట్లాడటం చాలా అదృష్టంగా భావిస్తున్నాను, మీరు నన్ను ఏదైనా అడగాలని ఉంటే, నిస్సంకోచంగా అడగవచ్చు."

కాకి – "మీ శరీరం ఆకారంలో చాలా చిన్నది. మీరేమో లేతగడ్డిపరకలు తింటుంటారు చాలా దృఢంగా ఉండి, ప్రశాంతంగా జీవిస్తున్నారు. మరి నేనేమో నిరంతరం దొరికినది దొరికినట్లు తింటూ ఉన్నా కూడా చాలా బలహీనంగా ఉన్నాను, మరియు ఎల్లప్పుడు చింతతో పీడింపబడుతున్నాను.

స్మశాన భూమిలో నాకు శ్రాద్ధబలి రూపంలో సమృద్ధిగా ఆహారం దొరుకుతుంది. కానీ నాతో ఉన్నవారు దానిలో భాగం కొరకు నన్ను నా రెక్కలు లాగి నన్ను బాధిస్తారు. కొట్టి బయటకు నెట్టి వేస్తారు. మరణించిన ఏనుగులు, ఒంటెలు, గేదెలు యొక్క మాంసాన్ని చూస్తాను. నాకంటే ముందుగానే అక్కడికి నక్కలు, కుక్కలు మొదలైనవి నాకు పోటిగా వచ్చి, నన్ను తిననీయవు, అక్కడి నుంచి నెట్టి పారేస్తాయి. పక్షుల యొక్క గ్రుడ్లను దొంగిలించి తింటాను. ఇది గ్రహించి ఆ పక్షులన్నీ నా మీద ఆక్రమణ చేస్తే నేను ఏం చెయ్యాలి? అనే దిగులుతో నా జీవితం గడిచిపోతుంది. ఇన్ని కారణాల వల్ల నాకు క్షణం కూడా విశ్రాంతి లేదు, నిద్రపట్టదు. అందుచేత నేను బలహీనమవుతున్నాను."

బుఖ్ఖుపిట్ట రూపంలో ఉన్న బోధిసత్వుడు: "ఓ భాగ్యశాలి! నీలోని గొప్పతనాన్ని నీవు గ్రహించు! నీవు భగవంతుని యొక్క ప్రేమ మీద విశ్వాసాన్ని ఉంచు, నీ తోటి వారితో ప్రేమగా ఉండు. నీకు దొరికిన ఆహారాన్ని మొట్టమొదటగా నీ ప్రక్కవారికి పెట్టి, తరువాత ఆహారాన్ని నీకు భగవంతుడు ప్రసాదించినదిగా, ఔషధంగా భావించి, స్వీకరించు. ఈ విధంగా నీవు చేస్తే, నీకు చాలా ప్రశాంతతను పొందుతావు. అకాల మృత్యువు, అకాల వార్ధక్యము కూడా నీ దరిదాపులకు రావు."

కాకి: "మీరు మాట్లాడినటువంటి అమృతతుల్యమైనటువంటి మాటలు నాకు చాలా జ్ఞానాన్ని, ప్రేమను అందించినవి. కాని నేను ఏం చెయ్యను! జన్మంతా నేను కూడబెట్టుకున్న నా కుసంస్కారాలు ఉన్నాయే అవి అంత తేలికగా నాకు దూరం కావు కదా!

బుఖ్ఖుపిట్ట: "ధైర్యాన్ని కోల్పోవద్దు. ప్రశాంతంగా ఉండు, వీలైనంత వరకు నీ యొక్క స్వభావాన్ని మార్చుకో, అలా చేయటం వలన నీకు ప్రశాంతత, దృఢత్వము కలుగుతుంది. అందరూ నిన్ను గౌరవిస్తారు. "ఈ మాటలను ప్రక్క గూళ్ళలో ఉన్న పక్షులన్నీ కూడా విన్నాయి. బుఖ్ఖుపిట్ట రూపంలో ఉన్న బోధిసత్వుడు మాట్లాడిన ప్రతి మాటను తమ ఆచరణలలో పెట్టాలనే వ్రతదీక్షను ఆ పక్షులు తీసుకున్నాయి.

*– అఖండజ్యోతి, జనవరి 1985*


*అనువాదం: శ్రీమతి కె. సరోజినిదేవి*

**సకల సంపదలు, విజయాలు శ్రద్ధ వలన లభిస్తాయి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-20

# హిమాలయాల యాత్ర-1

1927 చైత్ర మాసం వసంత నవరాత్రుల సందర్భమున గ్రామంలో శక్తిపూజ, పారాయణ మొదలయ్యాయి. శ్రీరామ్ సాధన యథావిధిగా నడుస్తున్నది. చైత్ర నవరాత్రులలో ప్రత్యేకంగా ఏమి చేయలేదు. చేస్తున్న సాధన అద్భుతమైనది, అలౌకికమైనది. ఈ తొమ్మిది రోజులు నిరాహారిగా ఉండేందుకు వ్రతం తీసుకుని, జలం, పాల మీదనే పూర్తిగా ఆధారపడ్డాడు. ఆ రోజు పంచమి. ఉదయం మూడున్నర గంటలకు నిద్రలేచాక నిత్య అనుష్ఠానం మొదలయ్యింది. వస్తుతః పూర్వ సంధ్య నుంచే మనస్సులో సంకల్ప-వికల్పాలు వస్తున్నాయి. క్రొత్తది ఏదో మొదలు కానున్నది. కానీ అది ఏమిటో తెలియడం లేదు. ఎక్కడికో, సాహసవంతమైన పని కొరకు వెళ్ళవలసి వస్తుందని మాత్రం అనిపిస్తున్నది.



మహా పురశ్చరణ కొరకు నియమిత జపం, ధ్యానం పూర్తిచేసి, సవితా దేవతకు జపాన్ని సమర్పించిన తరువాత ప్రదక్షిణ చేసేందుకు లేస్తుండగా వెనుక నుండి పిలుపు వినిపించింది. అది గురుదేవుల కంఠంవలె అనిపించింది. ఆ రోజున పూజాగృహంలో గురుదేవులు సాక్షాత్కరించినప్పుడు వెలువడిన సుగంధం ఈనాడు కూడా వెలువడి అప్పుడు కలిగిన ఉల్లాసం ఈనాడు కూడా కలిగింది. కానీ ఆ సత్తా ప్రకటీకరణ కాలేదు. వారి వాణి కూడా ఇతరులకు వినపడేటట్లు లేదు. అది ఆంతరిక క్షేత్రంలోనే ప్రతిధ్వనిస్తున్నది. "ప్రత్యక్ష సాన్నిధ్యం కొరకు రావలసిన సమయం ఆసన్నమైనది. క్రొత్త సంవత్సరంలో హిమాలయాల వైపు ప్రయాణం కావాలి. అక్కడే మన కలయిక జరుగుతుంది".

ఇప్పుడు ఉత్తరాఖండ్ రోడ్లు మంచుతో కప్పబడి ఉంటాయి. బద్రినాథ్, కేదార్‌నాథ్‌ల తలుపులు మూసివేయబడి ఉంటాయి. మరల ఒక నెలలోపు అవి తెరువబడతాయి. యాత్రకు తయారవ్వడానికి, అక్కడి వరకు వెళ్ళడానికి అంత సమయం పట్టవచ్చు. అక్కడి నుంచి ఇంకా ముందుకు వెళ్ళాలి. నిర్దేశాలు బయట నుండి రావడం లేదు, తన లోపలి నుంచే వస్తున్నాయి. తన లోపల ఎవరో ఉండి చెప్తున్నట్లుగా ఉన్నది. ఆ ప్రేరణ, నిర్దేశంలో ఎటువంటి సందేహం లేదు. స్ఫురణే సంకల్పంగా చేసుకుని వెళ్ళడానికి సిద్ధం కావాలి. సంధ్యా జపం పూర్తికాగానే తాఈజీకి గురుదేవుల ఆదేశం చెప్పాను.

"ఏంటి ఆ ఆదేశం?"

తాఈజీ అడిగారు. శ్రీరామ్ ఇలా అన్నాడు.

"గురుదేవుల సాన్నిధ్యంలో కొన్ని రోజులు ఉండాలి"

తాఈజీకి తన చిరంజీవి హిమాలయాలకో లేక ఇంకా ఇక్కడికో వెళ్ళి తిరిగి రాడనే సందేహం లేదు. అమె అడిగింది

"ఎన్ని రోజులు?"

శ్రీరామ్ ఇలా అన్నాడు - "అది తెలియదు, కానీ మూడు నాలుగు రోజులు ఆయన దగ్గర ఉండవలసి రావచ్చు. రానుపోను 10-12 రోజులు పట్టవచ్చు." తాఈజీ ముఖంలో సరే వెళ్ళు అనే భావన కనిపించింది.

"సరే రెండు వారాలు పడుతుంది. అన్ని రోజులకు కావలసిన వస్తువులతో వెళ్ళు". కొంచెంసేపు ఆగి మరల అన్నది.

ఇక్కడ వాతావరణం మారుతున్నది కానీ నీవు వెళ్ళేచోట ఎప్పుడు చలిగానే ఉంటుంది. చలికాలం వేసుకునే బట్టలు తీసుకెళ్ళు" అన్నది. ఆమె ఇంకా ఇలా అన్నది.

"నీకు కావలసిన బట్టలు నేనే సర్ది పెడతాను. పండితులను కూడా అడుగు. వారు మాటిమాటికి హరిద్వార్, ఋషికేశ్ వెళ్తుంటారు. వారు గంగోత్రి వరకు కూడా వెళ్ళారు. వారికి దారి కూడా బాగా తెలుస్తుంది, సరియైన సలహా ఇస్తారు."

శ్రీరామ్ తన హిమాలయాల గురువు గురించి, భావి నిర్దేశాల గురించి ఎక్కువగా చర్చించలేదు. 4-5 సార్లు కొద్దిగా చెప్పడం జరిగింది. ఆయన హిమాలయాలలో ఎక్కడో ఉంటారని, ఆయన ఎక్కడికియినా వెళ్ళగలరని, అంతర్ధానం

**మనిషి పరిసరాలకు, పరిస్థితులకు బానిస కాకూడదు**

అయిపోగలరని, ప్రత్యక్షం కాగలరని మొదలైన విధంగా చెప్పడం జరిగింది. శ్రీరామ్ గురుదేవులు పిలుస్తున్నారని చెప్పగానే తాఈజీకి ఆ సిద్ధగురువు పిలుస్తున్నారని అర్థం కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. శ్రీరామ్ తనకు దూరం కాడని, బాబా-జోగిగా తయారవడని ఆమెకు అచంచలమైన విశ్వాసం. ఆ విశ్వాసానికి స్పష్టమైన కారణం లేదు. దానిని గురించి ఆలోచించడం కూడా ఆమెకు ఇష్టం లేదు. ఆమె తన చిరంజీవిని హిమాలయాలకు పంపుతుంటే బంధువులు ఇలా అన్నారు.

"ఒంటరిగా ఎక్కడికి పంపిస్తున్నావు? అక్కడి సాధు-సన్యాసులు ఇతని బుర్రలోకి వైరాగ్యం ఎక్కిస్తారు."

తాఈజీ ఈ మాటలు విని నవ్వింది. శ్రీరామ్ ఎలా వెళతాడో అలాగే తిరిగి వస్తాడని ఆమె నమ్మకం. శ్రీరామ్‌ను ఒంటరిగా పంపవద్దని, హిమాలయాలకు వెళ్ళనివ్వద్దనే వారి మాటలను పట్టించుకోలేదు.

తాఈజీకి వైశాఖలో కూడా బద్రీనాథ్, కేదార్‌నాథ్ చుట్టుప్రక్కల కొంకర్లు పోయే చలి ఉంటుందని అనిపించింది. ఇక్కడ పుష్యం-మాఘంలో ఎంత చలిగా ఉంటుందో అక్కడి వైశాఖ- జ్యేష్ఠంలో కూడా చలిగా ఉంటుంది. ఆమె ఎప్పుడు అక్కడికి వెళ్ళలేదు కానీ సాధువులు-సంతులు, బద్రీనాథ్, కేదార్‌నాథ్ యాత్రలకు వెళ్ళిన వారి మాటలు విన్నది. అందువలన శ్రీరామ్‌ను చలికాలంలో కావలసిన ఆహారాన్ని ఇచ్చి పంపింది. ఆ ఆహారం పెద్ద విశేషమైనది ఏమీ కాదు. తేనె, అల్లం, నువ్వులు మొదలైన వేడిని ఇచ్చే పదార్థాలు.

తాఈజీకి హిమాలయయాత్ర అంటే బద్రీనాథ్, కేదార్‌నాథ్ వరకే అని భావన. మహాఅయితే గంగోత్రి, యమునోత్రి వరకు వెళ్ళవచ్చు. కానీ అది చాలా కష్టం. శ్రీరామ్ హిమాలయాలకు వెళ్ళాలని అన్నప్పుడు కేదార్‌నాథ్ వరకు అని అనుకున్నది. అంతకన్నా అడగాలనే అవసరం లేదని భావించింది. శ్రీరామ్ కూడా చెప్పలేదు. శ్రీరామ్‌కు కూడా ఏ క్షేత్రము వరకు వెళ్ళాలో తెలియదు.

ప్రయాణానికి ఉన్ని వస్త్రములు, మేజోళ్ళు, లావుగా ఉన్న రబ్బరు జోళ్ళు, కంబళి, లాఠి, టార్చి మొదలైనవి రెండు పెద్ద గుడ్డ సంచులలో సర్దిపెట్టింది. ఎవరో అన్నారు ట్రంకు పెట్టెలో పెడ్తే బాగుంటుందని, వర్షం వస్తే గుడ్డ సంచులు తడిసి పోతాయని. కానీ తాఈజీకి ట్రంకు పెట్టె చాలా బరువని, దానిని పిల్లవాడు మోయలేడని అనిపించింది. ఎక్కడయినా వర్షం పడితే ఎక్కడోక్కడ తలదాచుకోవాలి. అక్కడే ఈ సంచులు సురక్షితంగా ఉంచుకోవచ్చని చెప్పింది. బయలుదేరే ముందు ఆవిడకు గొడుగు గుర్తుకు వచ్చింది. దానిని కూడా వెతికి తీసుకుని వచ్చి సంచీలో పెట్టింది.

### వీలయినంత తక్కువ సామాను

తాఈజీ ప్రేమతో, అభిమానంతో కట్టి ఇచ్చిన వస్తువులు పెద్ద బరువేమి కాదు. అవి పది కిలోలు కూడా ఉండవు. కానీ ఋషికేశ్ వెళ్ళేటప్పటికి అదే బరువనిపించింది. ఋషికేశ్‌లో గంగాతీరాన కూర్చుని ధ్యానం చేసుకుంటున్నాడు. సాయంకాలం అయింది. ఏప్రిల్ నెల చివరి వరకు వాతావరణం బాగుంటుంది. చలి అసలు ఉండదు. వేడి ఇంకా మొదలు కాదు. యాత్రికులు రాకపోకలు మొదలవుతాయి. ఈ రోజులలో అన్ని ఋతువులలో యాత్రికుల సందడి ఉంటుంది. చలి నుండి వేడి నుండి రక్షించుకునేందుకు సాధనాలు తేలికగా దొరుకుతాయి. 1927-28 రోజులలో అలా ఉండేది కాదు. ఎండలో కూర్చోవడమో, చలి మంటలు వేసుకోవడమో చేసేవారు. లేకపోతే 3-4 బట్టలు ఒకదాని మీద ఒకటి వేసుకునే వారు.

గంగా తీరమున కూర్చున్న శ్రీరామ్ చూపు కొందరి సన్యాసులపై పడింది. వారు గంగా స్నానం చేస్తున్నారు. నదిలో నుంచి బయటకు వచ్చి మెట్ల మీద కూర్చున్నారు. శరీరాన్ని తుడుచుకుని, సంచిలో నుంచి విభూతి తీసి రాసుకున్నారు. విభూతి రాసుకునే అనేకమంది సన్యాసులను ఇంతకు ముందు కూడా చూశాడు. అప్పుడు తెలియలేదు. ఇప్పుడు అది చలి నుంచి తప్పించుకునే ఒక ఉపాయం కూడా కావచ్చునని అనిపించింది. సాధువులు నిత్యకర్మలు ముగించుకుని వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీరామ్ కూడా ఆసనం మీద నుంచి లేచాడు.

ఆ సాధువులలో అందరి కన్నా వృద్ధుడైన సన్యాసి వద్దకు వెళ్ళి, ఆయనకు ప్రణామం చేశాడు. ఆయన ఆశీర్వాదం ఇస్తున్నట్లు చెయ్యి ఎత్తాడు. శ్రీరామ్ అడిగాడు "మీరు ఎక్కడికి యాత్ర చేస్తున్నారు?". బద్రినాథ్ వెళ్తున్నట్లు ఆ సన్యాసి చెప్పాడు "నీకు కూడా రావాలని ఉంటే రావచ్చు. ఒంటరిగా

**మానవుడు మహనీయుని స్థాయికి చేరుకునే అతీతమైన శక్తి శ్రద్ధతోనే లభిస్తుంది**

వెళ్తున్నట్లున్నావు, కలసి వెళ్తే యాత్ర కూడా బాగా సాగుతుంది. అనేక విషయాలు మాట్లాడుకోవచ్చు."

అతను ఎక్కువగా మాట్లాడేవాడని శ్రీరామ్‌కు అనిపించింది. వారితో వెళ్ళేందుకు అనుమతి అడగలేదు. తన యాత్రకు ఉపయోగించేది ఏమయినా చెప్తారేమోనని ఆ ప్రశ్న అడిగింది. శ్రీరామ్ అన్నాడు "బద్రీనాథ్ దాకా వెళ్ళడం లేదు". "మరి ఇంక ఎక్కడికి వెళ్ళాలి?" అన్నాడు వెళ్తున్న వ్యక్తి ఆగి. "ఇంటి నుంచి పారిపోయి వచ్చావా? వైరాగ్యం కావాలా? ఇక్కడ ఏం చేస్తున్నావు? ఎక్కడి నుంచి వచ్చావు?" మండలేశ్వరునివలె ఆ సాధువు ప్రశ్నల వర్షం కురిపించాడు. శ్రీరామ్‌కు ఆ ప్రశ్నలు వేయడానికి కారణం తెలియలేదు. అక్కడి నుంచి వెళ్తే మంచిదని అనిపించింది.

శ్రీరామ్ అన్నాడు "క్షమించండి. నా వల్ల పొరపాటు జరిగింది. మీ సమయాన్ని వ్యర్థం చేశాను."

"అనవసరంగా పశ్చాత్తాపపడకు. నువ్వు ఏమి అడగదలచు కున్నావో నాకు తెలుసు."

శ్రీరామ్ జవాబు చెప్పలేదు. ఆ మహాత్ముని వైపు చూస్తున్నాడు. ఆయన ఇలా అన్నాడు.

"ఎవరి పిలుపు విని ఇక్కడికి వచ్చావో, ఆయనపై విశ్వాసం ఉంచు. ఆయన నిన్ను ఎక్కడికి తీసుకెళ్ళదలచుకున్నాడో అక్కడికి తీసుకెళ్తాడు. ఎవరితోనైనా కలసి వెళ్ళడం కన్నా ఒంటరిగా వెళ్ళడం శ్రేయస్కరం."

సన్యాసి ఎలా ఈ మాటలు చెప్పాడో శ్రీరామ్‌కు అర్థం కాలేదు, అర్థం చేసుకునేందుకు పెద్దగా ప్రయత్నించలేదు. ఆ సంభాషణలో అర్థం అయింది ఏమంటే మార్గం గురించిన చింత, చలి నుండి ఎలా కాపాడుకోవాలి, కష్టాల నుంచి ఎలా తప్పించుకోవాలి అనేది ఆలోచించడం వ్యర్థం అని. ఏ మార్గదర్శక సత్తా హిమాలయాలకు పిలిచిందో, అదే కావలసిన ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఆలోచనతో కొంచెం బరువనిపించిన సామాను ఋషికేశ్‌లో శ్రీరామ్ వదలివేశాడు. వదలివేసిన వాటిలో గొడుగు, కొన్ని బట్టలు, ఒక కంబళి ఉన్నాయి. సంచిలో ఇంకో కంబళి ఉన్నది. అప్పుడు మార్గదర్శక సత్తా దిగంబర రూపం గుర్తుకు వచ్చింది. తెల్లని మంచుతో నిండిన వాతావరణంలో బట్టలు లేకుండా ఉండగలిగినప్పుడు, చలి గురించి ఇంతగా ఆలోచించడంలో ఔచిత్యమేముంది?

ఆ సంతుల సమూహం బద్రీనాథ్ వెళ్తున్నది. వారికి కొంచెం వెనుకగా శ్రీరామ్ వెళ్తున్నాడు. కానీ బద్రీనాథ్ వెళ్ళాలని నిర్ధారించుకోలేదు. ఎక్కడికి వెళ్ళాలో కూడా తెలియదు. ఆంతరిక స్ఫురణను బట్టి వెళ్తున్నాడు. రుద్ర ప్రయాగ, దేవ ప్రయాగ, కర్ణ ప్రయాగ, నంద ప్రయాగ, విష్ణు ప్రయాగ దాటి బద్రీనాథ్‌కు వెళ్ళాలి. ఆ రోజులలో కూడా బళ్ళు వెళ్ళే మార్గం, కాలి మార్గం ఉండేవి. కాని ఈ సంతులు వేరే మార్గం నుండి వెళ్తున్నారు. మామూలుగా తెలిసిన మార్గం ఋషికేశ్ నుండి బద్రీనాథ్‌కు సుమారు 300 కి.మీ. దూరం. ఈ సాధు సమూహం ఎన్నుకున్న మార్గం 7 కి.మీ. కూడా ఉండదు. కాని మార్గం చాలా కష్టతరమైనది. ఆ అజ్ఞాత మార్గంలో వెళ్తూ వారు మరునాటి సాయంకాలానికి జోషీ మఠంకు చేరారు.

నృసింహ మందిరానికి ఎదురుగా విశ్రాంతి తీసుకున్నాడు. ప్రాతఃకాలం సంధ్యావందనం తరువాత శ్రీరామ్ నృసింహ మందిరానికి వెళ్ళాడు. సాలగ్రామం శిలపై చెక్కిన మూర్తి అద్భుతంగా ఉన్నది. ప్రతిమ యొక్క ఒక భుజం సన్నగా ఉన్నది. మొదట్లో చూచినప్పుడు చిన్న దెబ్బ వేస్తే విరిగి పోతుందేమోనని అనిపించింది. కానీ ఆ భయం నిరాధార మైనది. శతాబ్దాల నుండి విగ్రహం ఈ స్థితిలోనే ఉన్నది. ఏ రోజున ఈ భుజం వేరయిపోతుందో, ఆ రోజు నర-నారాయణ పర్వతాలు కలసిపోతాయని అక్కడి ప్రజల నమ్మకం. ఆ రెండు పర్వతాలు జోషీ మఠం నుడి కొంచెం దూరంలోనే ఉన్నాయి. వాటి మధ్య ఒక మార్గం ఉన్నది. నరనారాయణ పర్వతాలు కలసిపోతే బద్రీనాథ్ వెళ్ళడం అసాధ్యమనుకునేవారు. ఇలా కలియుగాంతమున జరుగుతుందని వారి విశ్వాసం. దేవాలయ పరిసరాలలో ఇలాంటి చర్చలు వినిపించాయి, కానీ వాటిని శ్రీరామ్ పట్టించుకోలేదు. నృసింహ స్వామి దర్శనం చేసుకుని జోషీ మఠం వెళ్ళాడు. ఈ జోశీ మఠం ఆదిశంకరాచార్యుల వారు స్థాపించారు. ఇక్కడే ఆయన త్రోటకాచార్యుల వారిని తమ ప్రతినిధిగా నియమించారు.

హిమాలయాల కనుమల నుంచి వచ్చిన విదేశీయులు బద్రీనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశారని ప్రమాణాలు లభిస్తాయి. అక్కడి ప్రతిమను కూడా విరగ్గొట్టి పడేశారు. బద్రీనాథ్‌లో పునఃప్రతిష్ఠ ఆదిశంకరచార్యుల వారు చేశారు.

*(సశేషం)*

**పూర్వీకులు ఏమీ ఇవ్వలేదనుకునేవాడు పేదవాడిగా మిగిలిపోతాడు**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 13

## ప్రపంచంలో సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారము కొరకు మా సమయము, శ్రమ, పలుకుబడి సాధ్యమైనంతగా వెచ్చిస్తాము

మానవుడు పరమార్థ పరాయణతో జీవితాన్ని గడపాలి. అలా జీవితాన్ని గడపడమంటే ఆ పేరు పెట్టుకొని ఏదో విధంగా గడిపేయడం కాదు. పరమార్థము అనే పేరుమీద మనం చేసే కార్యక్రమాల యందు మన శక్తినంతటిని వినియోగించి ఆ పనికి సంపూర్ణమైన సార్థకతను చేకూర్చాలి. అందుకొరకు సత్ప్రవృత్తులను మనం ఆచరించడమే కాక సమాజము నందు కూడా పెంపొందింపచేయాలి, వాటిని మనమే పోషించాలి కూడా. పారమార్థికపరంగా ఇది చాలా ఉపయోగకరమైనది. ప్రపంచంలో ఎన్ని సత్కార్యాలైతే జరిగాయో వాటన్నింటి మూలంలో సత్ప్రవృత్తులే పనిచేశాయి. విత్తనాలు అనేవి ఉంటేనే కదా కళకళ్ళాడే పచ్చని పొలము ఉంటుంది. విత్తనమే లేకుండా మొక్కలెలా పెరుగుతాయి? అదేవిధంగా మంచి, చెడు పనులనేవి వాటంతటవే జరుగవు, ఎప్పటినుండో వాటి మూలములయందు సదాలోచనలు, దురాలోచనలనేవి పోగుపడి ఉంటాయి. సమయం వచ్చినప్పుడు అవి మొలకెత్తి పుష్పించి ఫలిస్తాయి. ఆ ప్రకారంగా మొలకెత్తే సత్ప్రవృత్తులు ఎన్నో రకాలైన పుణ్యకార్యాల ద్వారా, పారిమార్థిక కార్యముల ద్వారా పరిరక్షింపబడుతూ ఉంటాయి. సద్భావనలకు, సదాలోచనలకు ఎలాంటి స్థానము ఇవ్వలేని ఎడారివంటి హృదయమున్నవారి ద్వారా జీవితంలో శ్రేష్ఠమైన కార్యక్రమాలను చేయగలగడమనేది దాదాపు అసంభవమనే చెప్పాలి. పశుప్రవృత్తులపై నియంత్రణ సాధించేందుకు సదాలోచనలు ఎంతో ఉపయోగపడతాయి. ముందుగా ఈ లాభము ఎవరైతే పొందగలుగుతారో వారే సత్కర్మలు చేయగలుగుతారు. వారు పాటించే ఆదర్శములు అందరికి అనుసరణీయాలుగా మారతాయి. చెడుపనులు చేసేవారు, దుర్బుద్ధితో పీడింపబడే వారు తామున్న నీచస్థితికి తామే బాధ్యత వహించాలి. అటువంటివారు మంచి ఆలోచనల యొక్క అవసరమును, ఉపయోగమును అర్థం చేసుకోరు. తద్వారా జీవితంలో అందివచ్చే సర్వోత్తమమైన లాభమును ఎందుకూ పనికి రానిదిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు, తప్పుకుని తిరుగుతుంటారు. అందువల్లనే వారికి అటువంటి నీచ పరిస్థితి ఏర్పడుతుంది, అంతేకాక అనేక బాధలకు కూడా లోనవుతారు. నిజానికి మనిషి అందవికారమైన, మాలిన్యములతో నిండిన లోహపు ముద్దవంటివాడు. సదాలోచనలు అనే పరసువేదిని తాకిన వెంటనే అతను బంగారంగా మారిపోతాడు. లెక్కకు కూడా పనికిరాని తుచ్ఛమైన ప్రాణికి మానవత్వము యొక్క మహత్తరమైన గౌరవమును అందించగలిగే సామర్థ్యము కేవలము సదాలోచనలకే ఉంది. ఈ సౌభాగ్యం పొందలేని వారికి జీవితలక్ష్యము అర్థం కాదు. అటువంటప్పుడు వారు ఏ ప్రయత్నమును చేపట్టగలుగుతారు?

ఈ ప్రపంచంలో ఉపకారము, పరమార్థము కలిసి ఉండే పనులు చాలా ఉన్నాయి. అవి పైకి మనకు కనిపించే ఆవరణలు మాత్రమే. లోపల ఆత్మయందు సద్భావనలే నిండి ఉంటాయి. సద్భావనలతో కూడిన సత్కర్మలనేవి ఈనాడు కేవలం పైపై ఆడంబరాలుగానే చెప్పబడుతున్నాయి. ఈనాడు అనేక సంస్థలు పరమార్థము పేరుతో అపహాస్యం పాలవుతున్నాయి. ఇలా నవ్వులపాలు కావడం మినహా వాటి వల్ల ఏ పనీ జరగదు. వారు చేస్తున్న ప్రయత్నాలు కూడా అందరికీ అనుమానాలు కల్పించే విధంగా కనపడుతున్నాయి. ప్రాణంలేని శరీరం ఎంత అందమైన వస్త్రాలను ధరించినా దానినెవరు ఇష్టపడరు. దానివల్ల ఎవరికీ లాభం చేకూరదు. అదేవిధంగా సద్భావనలకు చోటులేని ప్రజాసేవ, లోకకళ్యాణము అనే ప్రయత్నాలు మేలు చేకూర్చకపోగా నష్టాన్ని కలుగచేస్తాయి. ప్రపంచంలో ఈనాడు చెడును పెంపొందించి, వ్యాపింపచేసేందుకు చక్కటి ప్రచారకులు ఉన్నారు. వారు సంపూర్ణంగా తమ మనస్సు, వాక్కు, కర్మల ద్వారా చెడుపు వ్యాపింపచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వారికి చేయూతనిచ్చే ప్రజానీకం కూడా అధిక సంఖ్యలో సిద్ధంగా

**తానేమి చెయ్యాలో తెలుసుకున్నవాడు ఎదుగుతాడు**

ఉంది. వారు తప్ప ఈనాడు నిష్ఠతో పనిచేసే వారు లేనేలేరు. వ్యర్థ ప్రసంగాలు చేసేవారు ఎక్కువగా కనపడుతున్నారు. అందుచేతనే చెడువలె మంచి వ్యాప్తి చెందలేక పోతున్నది. మనుష్యులు చిలకపలుకులవలె పురాణ కథలను చెప్తున్నారు, వింటున్నారు తప్ప ఆచరించే ప్రయత్నం చేయడం లేదు. అవి విన్నమాత్రం చేతనే పుణ్యమనే లాభం వస్తుందని కొంతమంది నమ్మకం.

**సత్ప్రవృత్తులను మనిషి యొక్క హృదయంలోకి దింపే ప్రయత్నం చేయడం కంటే గొప్పదైన సేవాకార్యక్రమం మరొకటి ఈ ప్రపంచంలో లేదు.** వస్తుసాయమైనా కూడా అవసరమైన సమయంలో అందిస్తేనే తప్ప ఉపయోగపడదు. ఆ తరువాత వాటికెలాంటి విలువ ఉండదు. ఆర్థికంగా సంపన్నులైనవారు తప్ప మామూలువారు ఇటువంటి సేవను చెయ్యలేరు. ప్రతి మనిషి తమ సమస్యలను వివేకంతో సరిగ్గా అర్థం చేసుకొని పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తే అన్ని సమస్యలకు సమాధానం దొరుకుతుంది. ఇతరుల సహాయంపై ఆధారపడడమనేది మానవత్వము యొక్క గౌరవానికి తగని పని. వారివల్ల సరైన పరిష్కారమార్గం కూడా లభించదు. ఈనాడు వ్యక్తిగత, సామాజిక జీవితంలో వచ్చే అన్ని కఠిన పరిస్థితులకు కారణం దుర్బుద్ధే. మనిషి తన అలవాట్లను సరిదిద్దుకొని ఆలోచనలు మరియు ఆచరణ మధ్య ఖచ్చితమైన సామ్యమును చూపించ గలగాలి. అప్పుడు బైట నుండి ఎదురయ్యేవిగా కనిపించే క్లిష్టమైన సమస్యలెన్నింటికో మాటలతోనే పరిష్కారం లభిస్తుంది. సత్ప్రవృత్తులను అత్యధికంగా పెంపొందింపచేస్తేనే వ్యక్తులకు, సమాజానికి శుభం చేకూరుతుంది. సత్ప్రవృత్తులను పెంపొందింపచేసే మహత్వపూర్ణ కార్యములు చేసే వ్యక్తులకు కూడా గౌరవం లభిస్తుంది.

దానాలన్నింటిలోకి బ్రహ్మదానం సర్వోత్తమమైనదిగా చెప్పబడుతుంది. బ్రహ్మదానమంటే జ్ఞానదానం. జ్ఞానమంటే మనిషిని నైతికంగా సంసిద్ధం చేసే నిష్ఠ, భావన. యుగనిర్మాణ సత్సంకల్పాలయందు అందిస్తున్న సత్ప్రవృత్తుల పుణ్యప్రచార ప్రేరణలనేవి ఈ బ్రహ్మదానాలే. ఈ అమృతజలంతో తడిస్తే మోడైపోయిన మానసములన్నీ పచ్చని పూదోటలవలె పరిపూర్ణంగా వికసిస్తాయి. ఇటువంటి మహత్తర కార్యము పరమార్థము అని చెప్పబడుతుంది. దీనిని నిర్వహించేందుకే పరమాత్మ మనిషికి విశేషమైన శక్తిసామర్థ్యాలను ప్రసాదించాడు. సమయము, ప్రభావము, జ్ఞానము, పురుషార్థము మరియు ధనములనే ఈ విభూతులను మనిషి ఎక్కువ భాగం పరమార్థ ప్రయోజనముల యందే వినియోగించాలి. ఈ దివ్య విభూతులను పూర్తిగా వ్యక్తిగత జీవితావసరములను తీర్చుకునేందుకై వినియోగించి నాశనం చెయ్యకూడదు. వాటిలో కొంత భాగమునైనా తీసి సత్ప్రవృత్తుల పుణ్యప్రచారానికై దాచి ఉంచాలి. దైనిక జీవితానికి అవసరమైన పనులన్నింటిని నిర్ధారిత పద్ధతిలో ఎలాగైతే చేస్తామో అదే ప్రకారంగా ఈ పరమార్థ కార్యక్రమాలను కూడా చేయడం అత్యంత ఆవశ్యకం. వాటిని ఏదో విధంగా పూర్తిచెయ్యాలి. అప్పుడవి ఇహలోకము, పరలోకములకు శ్రేయస్సును చేకూర్చే మహత్వపూర్ణమైన కార్యములుగా చెప్పబడతాయి. ఏ పనిని మనం మహత్వ పూర్ణమైనదిగా భావిస్తామో అందుకొరకు మన సమయములో, జ్ఞానములో, ధనములో కొంతభాగమును, పుణ్యప్రచారము కొరకు వినియోగించడం వలన ఎలాంటి భారము కలుగదు. అంతేకాదు ఆ మార్గంలో చేసే ప్రయత్నాల వల్ల జీవితం ధన్యమవుతుంది. ఆ పని జీవితంలో మనం చేసే సర్వోత్తమమైన కార్యముగా గుర్తింపును పొందుతుంది.

సత్ప్రవృత్తుల సంవర్ధన కొరకు యుగనిర్మాణ ఉద్యమంలో భాగంగా ఒక కార్యక్రమాన్ని సూచించాము. అదే సంచీ గ్రంథాలయము. అది అందరికీ సులభమైన పనే. డబ్బులున్న వారంతా తమ ధనాన్ని ఆ పనిలో వినియోగించడం అలవాటు చేసుకోవాలి. సమయము, శ్రమ అనేవి ప్రతి వ్యక్తి ఇవ్వగలడు. అందువల్ల ప్రతి ఒక్కరు వీటిలో కొంత భాగాన్ని ఇవ్వాలనే నియమం పెట్టుకోవాలి. ఇందుకొరకు అందరినీ ప్రభావితం చేయగలిగేందుకు సమర్థులైనవారు బహిరంగంగానే ముందుకు రావాలి. ప్రజలపై కొంత ఒత్తిడి పెడితే ఈ పని కొంచెం ముందుకు సాగుతుంది. జ్ఞానవంతులైనవారు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉన్నవారు, మార్గదర్శనము వహించడం నుండి ప్రేరణనివ్వగలగడం వరకు అన్ని పనులను చేయగలుగుతారు. ధనవంతులైనవారు అందుకు అవసరమైన సాధనా సంపత్తిని ఇవ్వగలరు. ప్రతివ్యక్తి ప్రతిరోజు ఒక గంట సమయమును లేదా వారానికొకరోజును సత్ప్రవృత్తుల సంవర్ధన అనే బృహత్తర కార్యక్రమము కొరకు వినియోగించగలిగితే వారి పేర్లు చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖించబడతాయి.

– అనువాదం: *శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


**మన సంపద మనకు, ఇతరులకు కూడా ఉపయోగపడాలి**

కుండలినీ మహావిజ్ఞానం-6

# కుండలినీ యొక్క పంచ ముఖములు - పంచశక్తి ప్రవాహములు

వ్యావహారిక భాషలో జీవించి ఉన్న ప్రాణులను జీవధారులుగా పిలుస్తారు. వాటికి ప్రాణం ఉన్నది కనుక ప్రాణులని కూడా అంటారు. కానీ ఇది మామూలు విషయం కాదు. పదార్థ విజ్ఞానులు జీవి అనే దానిని గుర్తించరు. పంచతత్వముల, రసాయనక ద్రవ్యముల కలయికే జీవిగా భావిస్తారు. ఈ సంయోగం కనుక వియోగమయితే జీవి అంతమవుతుందని అంటారు. వారి దృష్టిలో ఆత్మ అనే వస్తువు లేదు. ఒక మనిషి తిరుగుతూ, మాట్లాడగలిగే చెట్టు వంటి వాడని ఈ వైజ్ఞానికుల అభిప్రాయం.

ఈ పరిభాష తత్వజ్ఞానమనే గీటురాయి మీద నిలవదు. వారు ఆత్మను పరమాత్మ యొక్క చిన్న ఘటకముగా (కణువు)గా భావిస్తారు. ప్రాణం దీనికి భిన్నమైనది. ప్రాణమనేది సాహసంతో కూడుకున్నది. ఆంతరిక సాహసము, బహిరంగ పరాక్రమము ఉన్నవారే ప్రాణవంతులు. ప్రాణవంతుడవటంలోనే జీవధారి యొక్క గౌరవం, జీవన మహత్వం ఉన్నది. ఇక్కడ ఏ ప్రాణం గురించి చర్చించబడుతున్నదో దానిని సామాన్య భాషలో సాహసం అని పిలువ బడుతుంది. సాహసం అంటే "ప్రతిభ". ప్రతిభ అంటే తెలివి, నమ్మకం, బాధ్యత, ధైర్యముల సమన్వయము. ఆధ్యాత్మిక భాషలో ఈ విభూతులను ప్రాణాగ్ని అని చెప్పబడింది. ధైర్యం, బలం ఉన్నవాడు దుష్టుడు, బందిపోటు కూడా అవవచ్చు. అతడు శౌర్యవంతునిగా, పురుషార్థిగా చెప్పబడడు. ఇంకా అతనిని దైత్యునిగా, దుష్టునిగా చెప్పవచ్చు.



ప్రాణవంతుడు కావటం అనేది మనుష్య జీవనంలో చాలా గొప్ప విషయం. ఎవరి వద్ద ఈ వర్చస్సు ఉంటుందో వారే అనుకరణీయ, అభినందనీయమైన కార్యములు నిర్వహిస్తుంటారు. అతనినే మహాపురుషుడని పిలువబడతాడు. తన వ్యక్తిత్వంతో తాను ఉన్నతుడవుతాడు, ఇతరులను కూడా ఉన్నతులుగా చేయగలుగుతాడు. తాను తరిస్తాడు, అసంఖ్యాకమైన ఎందరినో తన నావలో ఒడ్డుకు చేరుస్తాడు.

ప్రాణం ఒక చైతన్యవంతమైన శక్తి. దీనిని జీవించి ఉన్న విద్యుత్తు అని కూడా చెప్పవచ్చు. విద్యుచ్ఛక్తితో పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు నడుస్తుంటాయి. విద్యుచ్ఛక్తితోనే నగరములు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. ఆ శక్తితోనే అనేక సుఖ సాధనములు పనిచేస్తుంటాయి. ప్రాణవిద్యుత్తు కూడా శరీరము యొక్క సహాయంతో అనేక అసంభవమైన కార్యములను చేసి చూపగలదు.


ప్రపంచంలోని జీవించే ప్రాణుల సంఖ్యను లెక్కించడం కష్టమైన పని. నీటిలో ఉండే జంతువులను, ఆకాశములో ఎగిరే జంతువులను (పక్షులు) ఎవరూ లెక్కించలేరు. భూమిలోపల సూక్ష్మజీవులు ఉంటాయి. ఒక్క నీటి చుక్కలో వేలాది కంటికి కనిపించని సూక్ష్మజీవులు ఉంటాయి. వీటిని ఎవరు లెక్కించగలరు? వీటి సంఖ్య ఊహకు కూడా అందదు. వీటన్నింటిని ప్రాణులనే అంటాము. ఎవరి నాడులలో, కండరాలలో, కల్పనలలో, ఆలోచనలలో ఉన్నతస్థాయి విద్యుచ్ఛక్తి ఉన్నవాడు మాత్రమే ఎక్కువ ఎత్తుకు ఎదుగగలిగే ధైర్యం చేయగలుగుతాడు. అసాధారణంగా ఆలోచించి, తన పరాక్రమంలో అద్భుతమైన ప్రణాళికలు వెయ్యగలడు, అసాధారణ ఫలితాలను సాధించగలడు. అటువంటి వారే తమను తాము కృతకృత్యులుగా భావిస్తారు. ఇతరులు వారిని ధన్యులంటారు.

జీవధారులలో ప్రాణవంతులకు మాత్రమే విశిష్టత, గొప్పదనం కలుగుతాయి. వారు ఎక్కడయినా అప్పుడప్పుడు కనిపించి జీవనజ్యోతులుగా కనిపిస్తారు, ఎందరికో మార్గదర్శనం చేస్తారు, అనేకమందిని అనుయాయులుగా (followers) చేసుకుంటారు. వారి మార్గంలో నడిచేవారి సంఖ్య తక్కువగా

**"నేను కూడా పది మందికి ఉపయోగపడతాను" అనే సంకల్పం చేసుకోవాలి**

ఉండదు. వారు చక్కని బాట వేసుకుని సాగుతుంటారు. ఆ బాటలో నడిచి దారి తప్పినవారు కూడా గమ్యాన్ని చేరుకో గలరు. అటువంటి వారికి ఆత్మ గౌరవం అనుభవంలోనికి వస్తుంది. ఇతరులకు వారు దివ్యవిభూతులు కలవారిగా గోచరిస్తారు. ఇతిహాసాలలో ఇటువంటి వారిని గురించిన వర్ణనలు కనిపిస్తాయి. అటువంటి వారిని మహామానవులుగా లెక్కిస్తారు.

శరీరాన్ని, మస్తిష్కాన్ని, పరివారాన్ని, వైభవాన్ని త్రాసులోని ఒక శిబ్బిలో ఉంచి, ప్రాణ ప్రతిభను రెండవ శిబ్బిలో ఉంచితే, రెండోదే ఎక్కువ బరువుగా ఉంటుంది. ఇటువంటి ప్రతిభను కలవారినే నవరత్నాలని అంటారు. ఆదర్శాలను ఆలంబనగా తీసుకుని, వాటి కొరకు త్యాగ, బలిదానాలను చేసేవారిని నరనారాయణులని అంటారు. వారి కథలు ఎందరికో మార్గదర్శనం చేస్తాయి. హరిశ్చంద్రుని నాటకం చూసి బాలుడైన గాంధీ హరిశ్చంద్రుని అంతటి గొప్పవాడు కావాలని అనుకున్నాడు. తన సంకల్పాన్ని నెరవేర్చుకున్నాడు. న్యాయం, అహింస పాటించి గాంధీగారు నిజంగానే రెండవ హరిశ్చంద్రుడు అయ్యారు.




అలాంటి జీవనం స్వాధ్యాయం, సత్సంగం, మననం, చింతనంతో కూడిన ఆత్మ నిర్మాణంతో ప్రాప్తించుకొనవచ్చు. మానసిక స్థితి పరిస్థితిని తయారు చేస్తుంది. కానీ అలాంటి ప్రతిభ ప్రాప్తించుటకు ఆధ్యాత్మిక పద్ధతులలో ప్రాణాయామం - ప్రాణాకర్షణ ప్రాణాయామం వంటి పద్ధతులు కూడా ఉన్నాయి. ఇటువంటి పద్ధతులలో అన్నింటికన్నా గొప్పది కుండలినీ జాగరణ. దీనిని సూర్యోపాసన ద్వారా కూడా సాధించవచ్చు. సూర్యుడు భౌతిక శక్తుల కేంద్రం అని భావించడం సరికాదు. ఆత్మిక దృష్టిలో సూర్యుడు పరబ్రహ్మ యొక్క కనుపించే రూపంగా కూడా భావిస్తారు. సూర్యుడిని వేడిని, వెలుతురుని ఇచ్చే గోళంగా భావించక అంతఃకరణలో సాహసం కలిగించే అభినవ సంచారకర్తగా కూడా భావిస్తారు. సవిత యొక్క తేజస్వితను సాధనతో, తపశ్చర్యతో, శ్రద్ధతో ప్రబల ఇచ్ఛాశక్తితో ధారణ చేసినట్లయితే సాధకుడు నిరాశకు లోనుగాడు.

ప్రాణం యొక్క చైతన్య విద్యుత్తు బ్రహ్మాండంలో సర్వత్రా నిండి ఉన్నది. దానిని మనుష్యుడు తన సంకల్ప శక్తితో ఎంతైనా గ్రహించవచ్చు. కానీ అది సాధకుని పాత్రతపై ఆధారపడి ఉంటుంది. జలాశయంలో ఎంతో నీరు ఉంటుంది. అందులో నుంచి మనం ఎంతైనా తీసుకోవచ్చు. కానీ ఆ తీసుకు వెళ్ళగలిగేది మనం తీసుకుపోయిన పాత్ర పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది.

గ్రహ నక్షత్రములలో ఎక్కువ ప్రకాశం గలిగిన సూర్యుడు విద్యుచ్ఛక్తితో వెలిగే బల్బు వంటివాడు కాదు. తన శక్తి, కాంతితో ఎందరినో జ్యోతిర్మయులుగా చేయగలడు. చంద్రుడు కూడా ఆ శక్తితోనే వెలుగుతుంటాడు. సౌరమండలం లోని అన్య సదస్యులు కూడా ఆ ప్రకాశం వలనే మనకు దృష్టిగోచరమవుతారు. వృక్ష వనస్పతులకు ఆయనే జీవనాన్ని ప్రసాదిస్తున్నాడు. ఆయన వలనే మొగ్గలు పుష్పములుగా వికసిస్తున్నాయి. కఠోపనిషత్తులో నచికేతునికి ఈ ప్రాణం యొక్క మహిమ చెప్పబడింది, దానికి సంబంధించిన ఐదు రకముల ప్రాణాగ్ని విద్య నేర్పబడింది.

ఈ విధముగా గాయత్రీ మహాశక్తి యొక్క ప్రాణపక్షం-శక్తిపక్షము కుండలియే. రెండూ స్వతహాగా ఒక్కటే. విద్యుత్తు తత్వం ఒక్కటే. ఋణ, ధన విద్యుత్తులు దానిలో రెండు విభాగాలు మాత్రమే. జీవసత్తా ఒక్కటే, శరీరం, ప్రాణం దానిలో రెండు భాగములు. గాయత్రి, కుండలినీ వేరు వేరు కాదు. వాటిని రెండు పరస్పర పూరకమైన రెండు ధారలుగా అర్థం చేసుకోవాలి.

**కుండలిన్యాం సముద్భూతా గాయత్రీ ప్రాణధారిణి ।**
**ప్రాణవిద్యా మహావిద్యా యస్తాం వేత్తి స వేదవిత్ ॥**

**- యోగ చూడామణి ఉపనిషత్తు**

కుండలినియే ప్రాణశక్తిమయి గాయత్రి యొక్క ఉత్పత్తి స్థానము. ఈ గాయత్రియే ప్రాణవిద్యా స్వరూపమైన మహావిద్య. ఎవరు ఈ విద్యను తెలుసుకుంటారో వారే వేదవిదులు.

జీవసత్తాతో ఐదు శక్తివంతమైన దేవతా శక్తులు ఉన్నాయి.

**ప్రశ్నించనిదే సమాధానం దొరకదు**

కానీ అవి నిద్రాణమై ఉన్నందున మృతతుల్యంగా పడి ఉంటాయి, వాటివలన ఎటువంటి ఉపయోగం ఉండదు. అందువలన జీవి దీనుడుగా, దుర్బలుడిగా తయారవుతాడు. కానీ ఈ శక్తులను జాగృతం చేయగలిగితే, వాటిని ఉపయోగించుకోగలిగితే మనిషి అసామాన్యుడిగా తయారవుతాడు. దుర్దశ నుండి పైకి లేచి గౌరవప్రదమైన జీవనాన్ని జీవించే అవకాశం లభిస్తుంది. శరీరంలోని పంచతత్వముల వివరణ కపిల తంత్రంలో ఐదు దేవతల రూపంలో ఇవ్వబడింది.

**ఆకాశస్యాధిపో విష్ణురగ్నేశ్చైవ మహేశ్వరీ ।**
**వాయోః సూర్యః క్షితేరీశో జీవనస్య గణాధిపః ॥**

ఆకాశతత్వానికి అధిపతి విష్ణువు. అగ్నితత్వానికి అధిపతి మహేశ్వరి. వాయుతత్వానికి అధిపతి సూర్యుడు. పృథ్వి తత్వానికి స్వామి శివుడు. జలతత్వానికి అధిపతి గణేశుడు. ఈ విధముగా పంచదేవతలు శరీరం యొక్క పంచ తత్వాలకు అధిపతులు.

పంచ ప్రాణాలు కూడా పంచదేవతలుగా చెప్పబడ్డాయి. తంత్రార్ణవంలో ఈ విధంగా చెప్పబడింది.

**పంచ దేవమయం జీవ పంచ ప్రాణమయం శివ ।**
**కుండలినీ శక్తి సంయుక్తం శుభ్ర విద్యుల్లోతోపయం ॥**

అంటే జీవుడు పంచదేవతల సహితంగా ఉన్నాడు. ప్రాణవంతుడైనప్పుడు అతడు శివుడు. ఈ పరికరములు కుండలినీ శక్తియుక్తములు. వీని ఆకారం మెరుస్తున్న విద్యుత్తుతో సమానం.

మనుష్యుని సూక్ష్మ శరీరంలో పంచ ప్రాణములు ఉన్నాయి. అవి 1) ప్రాణం 2) అపానం 3) ఉదానం 4) వ్యానం 5)సమానం. వీటికి సహాయం చేసేవి ఐదు ఉన్నాయి. అవి 1) దేవదత్తం 2) కృకలం 3) కూర్మం 4) నాగం 5) ధనంజయం. ఇవి చేతనత్వం యొక్క ఐదు పొరలు. వీటి కలయికతో వ్యక్తిత్వం ఏర్పడుతుంది. వాటిస్థాయి, ఎక్కువ తక్కువలను బట్టి వ్యక్తియొక్క పరిష్కృత (గొప్పదనం), విశిష్ఠత వెలుగొందుతాయి.

ఆధునిక గెస్టాల్ట్ సైకాలజి అనుసరించి వ్యక్తిత్వాన్ని ఐదు భాగములుగా విభజింపబడింది. మానసిక చికిత్సకుడు డా॥ ఫ్రెడెరిక్ ఎ. పల్సర్స్ ఈ ఐదు భాగములు ప్రతిపాదిస్తూ వ్యక్తిత్వాన్ని నిర్మించే ఐదు పొరలను ఉపయోగించుకోగలిగితే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవచ్చునని అంటాడు. ఈ ఐదు పొరలు ఈ ప్రకారంగా ఉంటాయి. 1) క్లీస్ లేయర్ 2) సింథటెక్ లేయర్ 3) ఇంపల్స్ లేయర్ 4) ఇంప్లోసివ్ లేయర్ లేక డెత్ లేయర్ 5) ఎక్స్‌ప్లోసివ్ లేయర్ లేక లైఫ్ లేయర్. గెస్టాల్డ్ పేర్కొన్న ఈ పొరలనే సూక్ష్మ శరీరంలో ఉన్న పంచకోశములుగా అర్థం చేసుకొనవచ్చు.

బ్రహ్మాండములోని పదార్థములు పంచతత్వములతో తయారయినట్లుగానే, సర్వత్రా వ్యాపించి ఉన్న చేతనత్వం ప్రాణంతో తయారయ్యింది. ఈ బ్రహ్మాండం పంచ చేతనత్వ సత్తాలతో నిండి ఉన్నది. మానవ పిండం (దేహం) దాని యొక్క చిన్న సంస్కరణే. బ్రహ్మాండములో ఉన్నదే పిండాండంలో ఉన్నది. బ్రహ్మాండములో ఉన్న పంచ ప్రాణములు ఈ దేహంలో కూడా ఉన్నాయి. అవి బీజరూపంలో సుషుప్త స్థితిలో వెలుగొందుతుంటాయి. బీజంలో వృక్షమంతా ఉంటుంది కానీ దాని రూపం స్పష్టంగా చూడటానికి వీలుండదు. స్త్రీ, పురుషుల డింబాణువు (ovum) శుక్రాణువు (sperm) కలసి బాలకుడు తయారవుతాడు. కానీ వాటి కణములను సూక్ష్మదర్శి యంత్రంతో (microscope) చూచినప్పటికి వాటిలో శిశువు యొక్క ఆకారం కొంచెం కూడా కనిపించదు.

ఇదే విధముగా సావిత్రి శక్తి యొక్క ఐదు రకాల ప్రవృత్తుల విషయంలో కూడా చెప్పుకోవాలి. ఈ శక్తి శరీరంలో అవతరించినప్పుడు దాని యొక్క స్వరూపం, పరిణామం అవగతమవుతుంది, దాని శక్తి సామర్థ్యములు అర్థమవుతాయి.

బలం, ధనం, జ్ఞానం, విజ్ఞానం, కౌశలం పంచ వైభవములుగా చెప్పబడ్డాయి. ఈ విధంగా అనేక పంచకములు చెప్పబడ్డాయి. మహాభారతములో ప్రముఖ యోధులు పంచ పాండవులు. శ్రీరాముని సేనలో కూడా హనుమంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు అనే ఐదుగురు ప్రముఖ సేనాపతులు ఉన్నారు. పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, ఇంకా పంచరత్నములు, పంచామృతములు, పంచ గవ్యములు, పంచాంగం, పంచాగ్నులు, ఇంకా అనేక పంచకములు ఉన్నాయి. వేదాంతములో పంచీకరణ ప్రసిద్ధి పొందిన సాధన విధివిధానము. కుండలినీ జాగరణలో ఉపయోగించే పంచకోశములు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు.

**ప్రయత్నించనిదే కోరుకున్నది దొరకదు**

మహాయోగ విజ్ఞానంలో కుండలినీ జాగరణ పరిచయం పంచకోశముల జాగృతి రూపంలో ఇవ్వబడింది.

**కుండలినీ శక్తిరాగవిర్భయతి సాధకే ।**
**తదా స పంచకోశే మత్తేజోऽనుభవతి ధృవమ్ ॥**

అర్థం: కుండలిని జాగృతమయినప్పుడు సాధకుని పంచ కోశములు జ్యోతిర్మయమవుతాయి.

పంచతత్వములతో తయారయిన శరీరం యొక్క సత్వగుణ చేతనత్వం ఐదు రకములుగా దృష్టిగోచరమవుతుంది. 1) మనస్సు 2) బుద్ధి 3) ఇచ్ఛ 4) చిత్తం 5) అహంకారం.

పంచతత్వముల రాజసతత్వం నుంచి పంచప్రాణములు ఉత్పన్నమవుతాయి. దీనిని వైటల్ ఫోర్స్ (vital force) అని కూడా చెప్పవచ్చు. పంచ జ్ఞానేంద్రియములు ఈ ఆధారంపైనే తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తుంటాయి. తత్వముల తామస తత్వం నుంచి కాయకళేబర నిర్మాణం జరుగుతుంది. 1) రసం 2) రక్తం 3) మాంసం 4) అస్థి 5) మజ్జ రూపములో వాటిని శరీరంలో చూడవచ్చు. మస్తిష్కము, హృదయము, అమాశయము, ఊపిరితిత్తులు, గుద (మలద్వారం) విశిష్ఠ అవయవములు. పంచ కర్మేంద్రియాలు ఈ క్షేత్రముల నుండి ఉత్పత్తి అయాయ్యని చెప్పవచ్చు.

విజ్ఞానం యొక్క పరిభాషలో పంచ ప్రాణములు, పంచ కోశముల వివేచన చేసినట్లయితే వీటి ప్రతినిధి గణం వ్యష్టిలో, సమిష్టిలో వ్యాపించినట్లు చూడవచ్చు.

భౌతిక విజ్ఞానంలో కూడా ఐదు శక్తులను ముఖ్యమైనవిగా భావిస్తారు. 1) మహాసత్వం (महासत्व) 2) అల్పసత్వం (अल्पसत्व) 3) గురుత్వాకర్షణ (Gravitational Force) 4) విద్యుత్ అయస్కాంత బలం (Electro Magnetic Force) 5) యాంటి మాటర్ (Anti Matter) బ్రహ్మాండీయ కణములో కూడా ఐదు ముఖ్యమైనవి. 1) న్యూట్రినో 2) క్వార్క్స్ 3) పల్సర్స్ 4) ఫొటాన్స్ 5) లెప్టాన్స్. క్వాంటం వేవ్ థియరీ (Quantum Wave Theory) అనుసరించి శక్తి తరంగముల రూపంలోనే పనిచేస్తుంది. బ్రహ్మాండీయ కిరణములు కూడా ఐదు మాత్రమే. అల్ట్రా వయొలెట్, ఇన్‌ఫ్రారెడ్, కాస్మిక్, రేడియో తరంగములు లేక మైక్రోవేవ్స్ & ఇన్‌ట్రాస్టెల్లార్ వేవ్స్. ధ్వని తరంగములు కూడా అయిదే. సోనిక్, అల్ట్రాసోనిక్, ఇన్‌ఫ్రాసోనిక్, హైపర్‌సోనిక్, సూపర్ సోనిక్. పృథ్విని కప్పిన కవచాలు ఐదే ఉన్నాయి. లోథో స్పియర్ 2) హైడ్రో స్పియర్ 3) బయోస్పియర్ 4) పీడో స్పియర్ 5) అట్మాస్పియర్. వీటిపైన అయనోస్పియర్. ఇది 2600 కి.మీ. ఎత్తువరకు ఉంటుంది. దీనిలో కూడా ఐదు పొరలు ఉన్నాయి. ఎండోస్పియర్, ట్రోఫోస్పియర్, స్ట్రాటో స్పియర్, అయనోస్పియర్, ఎక్సోస్పియర్.

పంచ శక్తులు జీవ భౌతిక క్షేత్రములో క్రియాశీలంగా పనిచేస్తాయి. అవి 1) బయో ఎలక్ట్రిసిటి (జీవ విద్యుత్తు) 2) బయోమాగ్నటిజం (bio magnetism) 3) రేడియేషన్ (radiation) 4) క్రియేషన్-రీ ప్రొడక్షన్ 5) ఇమ్యూనిటి (immunity) వైజ్ఞానిక దృష్టితో జీవ విద్యుత్తులో ఐదు రకాలున్నాయి. అవి 1) ప్లెక్సస్ ఎలక్ట్రిసిటి 2) న్యూరోనల్ ఎలక్ట్రిసిటి 3) సెల్యులార్ ఎలక్ట్రిసిటి 4) కండక్షన్ ఎలక్ట్రిసిటి 5) ఫేసియో ఆక్యులర్ ఎలక్ట్రిసిటి వీటినే ఆధ్యాత్మిక భాషలో ఓజస్సు, తేజస్సు, వర్చస్సు, బ్రహ్మవర్చస్సు, మనస్సుగా చెప్తారు.

మస్తిష్కం యొక్క నరాలను సంచాలనం చేసే ఐదు ప్రముఖమైన భాగాలున్నాయి. అవి కార్టికల్ న్యూక్లియై థెలామస్, హైపోథెలామస్, మెడుల్లా, స్పైనల్ కార్డ్. మస్తిష్కాన్ని సక్రియంగా ఉంచే ముఖ్యమైన రసస్రావములు కూడా అయిదే. వాటిని న్యూరో హ్యూమరల్ సెక్రిషన్ అంటారు. డొపామిన్, ఎండార్ఫిన్, సిరోటోనిన్, ఎన్కేఫెలిన్ మరియు గాబా. వాటి హెచ్చు తగ్గుల వలన మానసిక క్రియాలాపములు గడబిడ అవుతాయి. ఐదు హార్మోన్ గ్రంథులు పంచకోశాలకు సంబంధించినవిగా చెప్పవచ్చు. అవి పీనియల్, పిట్యూటరి, థైరాయిడ్, ఎడ్రినాల్, గొనాడ్స్. షట్‌చక్రాల చర్చ వచ్చినప్పుడు థైమస్ గ్రంథి కూడా కలుపుకోవాలి.

ఈ ప్రకారంగా బ్రహ్మాండ వ్యాప్తంగా, శరీరగతంగా అనేక రకాల విభజనలు ఉన్నాయి. వీటి క్రియాకలాపములు సూక్ష్మంగా ఉంటాయి. ఈ ఐదు ప్రముఖ శక్తి సమూహాలను సావిత్రి యొక్క పంచముఖములుగా, కుండలినీ శక్తి యొక్క పంచకోశములు, అంగ ప్రత్యంగములుగా భావించ వచ్చు. వీటిలో కొన్నింటినైనా నియంత్రించి, ఉపయోగించుకో గలిగితే పంచలోకములలో దేవతల ద్వారా సాధకునిపై దివ్యశక్తులతో నిండిన పుష్పవర్షం కురుస్తుంది. కుండలినీ జాగరణ యొక్క ఫలశృతిలో ఇలాంటి విశిష్ఠతలు ఉన్నాయి.

*- అఖండజ్యోతి, జనవరి 1987*

**దేవుడంటే ఆలకించేవాడు, కరుణించేవాడు**

మహా శివరాత్రి ప్రత్యేకం

# శివ సంకల్పానికి శుభ ముహూర్తం మహాశివరాత్రి

**హర హర మహదేవ! జయ శివ శంభో! బమ్ బమ్ భోలే!** అనే పవిత్ర ధ్వానాలు నేడు మహాశివరాత్రి అని చెప్తున్నాయి. భారత ప్రజలందరికీ ప్రేరణ ఇచ్చే మహాపర్వం శివరాత్రి.

పర్వాలు మన సాంస్కృతిక చైతన్యపు జ్యోతి కిరణాలు. పర్వాలు జీవితంలో, జగత్తులో ఉల్లాసాన్ని, ప్రసన్నతను, గతిని, ఏకతను, నవ ప్రేరణ వెలుగును వ్యాప్తింపచేస్తాయి. తద్వారా మన జీవన చేతనత్వము మేలుకొంటుంది.

మహాశివరాత్రి ఉద్దేశ్యం కూడా మన జీవన చేతనత్వమును మేలు కొల్పడమే. దేవాధిదేవుడైన మహాదేవుని ఉపాసన ద్వారా, వ్రతం ద్వారా, సంకల్పం ద్వారా మనం ఈ రోజున ఆత్మబోధను పొందవలసి ఉన్నది. ఈ పండుగలో ఇమిడి ఉన్న ప్రేరణలకు అన్ని మత విశ్వాసాల వారు ఏదో ఒక రూపంలో ప్రాముఖ్యత ఇస్తారు. వారి విధానాలు, పద్ధతులు స్పష్టంగా ఉండవచ్చు. అస్పష్టంగా ఉండవచ్చు, వాస్తవం ఏమంటే జీవనబోధ జరగనిదే జీవితంలోని చీకటి తొలగిపోదు.




మహాశివరాత్రి బోధ ఉత్సవం. ఆత్మ చింతనకు, ఆత్మ పరీక్షకు సదవకాశం. జీవితంలో శ్రేష్ఠము, శుభకరము అయిన వ్రతాలను, సంకల్పాలను, ఆలోచనలను చేపట్టడానికి ప్రేరణ ఇచ్చే పర్వం మహాశివరాత్రి. నేటి భౌతికవాదపు భోగవాదపు హడావిడులలో మన ఆత్మచేతనత్వం మరణిస్తోంది. అలాంటి జీవితాలలో చైతన్యాన్ని నింపడానికి, దానిలో ఇమిడి ఉన్న సత్యాన్ని బోధించడానికి ప్రతి సంవత్సరం మహాశివరాత్రి వస్తుంది. భారతీయ జీవన ప్రవాహంలో ఆత్మబోధ ఎప్పుడూ ఉంటుంది. 'ఆత్మానం విద్ధిః' – అని బోధించాయి ఉపనిషత్తులు. అనగా ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడంతోపాటు ఆత్మను కూడా తెలుసుకో. ఆత్మజ్ఞానం లేనిదే మనిషి జీవితం సార్థకం కాదు.

ఆది శంకరులు తమ కఠోర తపస్సు, తీక్షణమైన ఆత్మ సాధనల సారాన్ని ఒకే సూత్రంలో ప్రతిపాదించారు – **'న ఋతే జ్ఞానేన ముక్తిః'** అనగా – ఆత్మజ్ఞానం, సత్యజ్ఞానం లేనిదే మనిషి బంధనాల నుండి విముక్తి పొందలేడు. బంధనమే జీవితంలో దుఃఖానికి కారణం. ఈ బంధనాలన్నీ అజ్ఞానం నుండి జనిస్తాయి. కళ్యాణకారకం అయిన శివతత్వం వైపు మళ్ళనంత వరకు, జీవితం దుఃఖం నుండి, చింత నుండి, పీడ నుండి, అశాంతి నుండి విముక్తి పొందదు. 'నాన్యః పంథా విద్యతే అయనాయ' – అని వేదం ఈ భావాన్ని బలపరుస్తూ చెప్పింది. అనగా మరో మార్గం లేదు. మార్గం ఒక్కటే. మనను మనం తెలుసుకుని, పరమేశ్వర సాన్నిధ్యాన్ని పొందడం. ఆయన శరణు పొందడం. ఆయన ఆజ్ఞను పాలించడం. ఆయన సత్తాను కణకణంలో, అణువు అణువులో అనుభూతి పొందడం. జీవితాన్ని అధర్మం నుండి, పాపం నుండి, అసత్యం నుండి దూరం చేసి, దానిని సన్మార్గంలో పెట్టడం, జీవితంలోనికి వచ్చిన దుర్గుణాలకు, దుర్వ్యసనాలకు, దుఃఖాలకు మూల కారణాలను గుర్తించడం. వాటిని తొలగిస్తానని సంకల్పం చేయడం. నిద్రపోతున్న ఆత్మను మేలుకొలిపే వ్రతాన్ని స్వీకరించడం. నేడు మహాశివరాత్రి చెప్తున్నది ఇదే.

లే! మేలుకో! నీ జీవితాన్ని, జగత్తును చక్కదిద్దుకో. ఈ జీవితం ఎంతో అమూల్యమైనది. దీని విలువను తగ్గించవద్దు. ప్రకృతి పరమేశ్వరుల, శరీరం ఆత్మల, భౌతిక ఆధ్యాత్మికతల, భోగ యోగముల సమన్వయాన్ని సాధించి పురోగమించు.

**అవధులు దాటితే ఓర్పే పిరికితనం అనిపించుకుంటుంది**

ఫలితంగా జీవితంలో, జగత్తులో సామరస్యం, ఏకగ్రీవత ఏర్పడతాయి. భారతీయ జీవన విధానానికి ఆధారం ఇదే. 'అతి సర్వత్ర వర్జయేత్' అనే సూత్రం కూడా ఇదే చెపుతోంది. నేడు జాతిలోను, విశ్వంలోను భౌతికవాదం హద్దు మీరి పోయింది. మనిషి భౌతికవాదిగా, భోగవాదిగా, దేహవాదిగా, తయారైనాడు. ఫలితంగా అంతటా అశాంతి, కలహం, హింస, పాపం, అధర్మం, దుఃఖ దైన్యాలు విలయతాండవం చేస్తున్నాయి.

మానవత్వం ఖండితమై, గాయపడి, ఆర్తనాదం చేస్తోంది. మనిషి ఆకారంలో మాత్రమే మనిషిగా మిగిలిపోయాడు. అతడి ప్రవృత్తి రాక్షస ప్రవృత్తి అయిపోయింది. నలువైపులా అవినీతి, రోగం, అరాచకత్వం, క్రమశిక్షణారాహిత్యం విజృంభిస్తున్నాయి. వ్యక్తి, కుటుంబం, సమాజం, జాతి, ప్రతిచోట చీలికలే చీలికలు. అంతటా విచ్ఛిన్నత, విఘటన, విడిపోవడం. మానవతా దృక్పథం, జీవన విలువలు కాగడా పెట్టి వెదికినా కానరావడం లేదు. ఈ దుష్పరిణామాలన్నింటికీ మూలకారణం ఆత్మపక్షాన్ని మరచిపోవడం. శారీరిక సుఖ సాధనాలు, భౌతిక ఉన్నతి మాత్రమే జీవితానికి పరమలక్ష్యములుగా మనం పరిగణిస్తున్నాం. మదంతో, స్వార్థంతో గ్రుడ్డిగా పరుగులు పెడుతున్నాం. ఎక్కడికో వెళ్ళాలో, దేన్ని చేరుకోవాలో ఎవరికీ తెలియడం లేదు.

అంతటా మూర్ఛావస్థ. అంతటా మత్తు. ఆత్మ ఏనాడో ఆకలితో స్పృహ తప్పి పడిపోయింది. నిజమే, అది ఆకలితో ఉన్నది. అది భోజనం కావాలని అడుగుతోంది. అది తన మూలస్థానం అయిన శివుని వద్దకు వెళ్ళాలని కోరుతోంది. పిల్లవాడు తన తల్లిదండ్రుల ఒడిని చేరి నిర్భయతను, శాంతిని పొందుతాడు. అలాగే, ఆత్మ పరమశివుని ఒడికి చేరి, భయం నుండి తాపం నుండి విముక్తి పొందాలని కోరుతోంది. మనిషి బయటి ప్రపంచంలో ఎంతగా ఉరుకుతూ పరుగులు పెడతాడో అంతగా ఆత్మానందానికి దూరం అవుతుంటాడు. డబ్బుతో కొనగలిగేవి దేహానికి, ఇంద్రియాలకు కావలసిన సుఖ సాధనాలు మాత్రమే. కనుకనే నేటి ప్రపంచం మేడిపండులా తయారయింది. బోలుగా తయారయింది. ఈ వెలితిని పూడ్చడానికై మద్యం, జూదం, సినిమాలు, క్లబ్బులు, పార్టీలు – వీటివైపు పరుగుల వేగం పెరిగిపోతోంది.

కానీ, వాసనల వెంట, వాంఛల వెంట అంతం లేకుండా పరుగు తీస్తున్న కొద్దీ భోగదాహం మరింతగా రెచ్చిపోతుంది. మరింతగా పెరిగిపోతుంది. జీవితం ఎండమావిగా మిగిలి పోతుంది. జీవితం గురించిన అవగాహన చేస్తే పరుగంతా వృథాయే అని జీవితాంతంతో మనిషి తెలిసివస్తుంది. 'ఎంతో కోల్పోయావు. ఎంతకాలమో నిద్రపోయావు. ఇక కోల్పోవద్దు. ఇక నిద్రించవద్దు. నీ జీవితాన్ని పవిత్రంగా మలచుకుంటానని, దానిని ఉన్నతోన్నతం చేస్తానని నేడు సంకల్పం చెయ్యి. ఆత్మజ్ఞానాన్ని మేలుకొల్పుతానని, ఆచరణను, ఆలోచనను సంస్కరించుకుంటానని నేడే ఇప్పుడే సంకల్పం చెయ్యి. ఈ శరీరంలోని సత్యం, అమూల్యతత్వం ఆత్మ. దానిని తెలుసు కుంటానని సంకల్పం చెయ్యి' – అని మనందరికీ బోధించడానికి వచ్చింది మహాశివరాత్రి.

శివుని సనాతన తత్వమైన ఆ ఆత్మ వెలికిరాగానే శరీరం శవంగా మిగిలిపోతుంది. ఆత్మ శరీరంలోపల ఉన్నంత వరకే, శరీరానికి సౌందర్యం, ఆకర్షణ ఉంటాయి. సంబంధాలలో మాధుర్యం ఉంటుంది. ఆ చేతనత్వమే ఆత్మ తన ఆరాధ్యుడు, తన సర్వస్వము అయిన శివుడిని కలుసుకోవాలి. శివుని రూపంలో ఉన్న పరమేశ్వరుని నుండి అది విడిపోయి ఎన్ని యుగాలు గడచిపోయాయో. ఎంత విచిత్రమైన పరిస్థితి. యుగ యుగాలుగా ఒకే ఇంటిలో కలసి నివసిస్తున్నా వారి మధ్య సంభాషణ జరగలేదు, వారి కలయిక జరగలేదు. శరీరమనే ఈ ఇంటిలో ఆత్మ, పరమాత్మ రెండూ ఉంటున్నాయి. ఈ శరీరంలో ఇద్దరు ఉన్నారు. కలసి ఉంటున్నప్పటికీ, ఆత్మ తన ప్రియుడైన శివునితో మాట్లాడలేకపోయింది. శివుడిని కలవలేకపోయింది. ఎందుకంటే, కలుసుకోవాలనే కోరిక లేదు. కలుసుకోవాలనే ఆతురత లేదు. కలుసుకోవాలనే తపన లేదు. విడిగా ఉన్నాననే బాధ, అశాంతి లేవు. ఎలా ఉంటాయి? అజ్ఞానం, జడత్వం అనే అంధకారంలో ఆత్మ తన స్వరూపాన్ని మరచిపోయింది. ఇప్పుడు దానికి నాటకాలపై, బూటకాలపై, విషయ భోగాలపై చర్చ జరపడం, ఆలోచన చేయడం ఇష్టంగా ఉన్నది. ఈ ఆత్మ తన శివునికి పెడమోము అయింది. ఇప్పుడు దానికి శివునిపట్ల ప్రేమ లేదు, శివుని అవసరం లేదు. అది శివుడిని జీవితం నుండి తొలగించి వేసింది.

మహాశివరాత్రి శివుడిని కలిసే రాత్రి. మహాశివరాత్రి రోజున ఆత్మ మంగళకరుడైన శివునితో కలుస్తుంది. లోతైన

**కాలంతోపాటు మనిషిలో మార్పు తప్పనిసరే**

ఈ కలయికలో పరస్పర సంభాషణ జరుగుతుంది. విడిపోయిన వారు ఏకమవుతారు. ఇక నిద్ర ఎలా వస్తుంది? మొదట ఆత్మ తనకు పరమప్రియుడైన శివుడిని కలుసుకోడానికి సన్నాహాలు చేస్తుంది. శుభ్రంగా, స్వచ్ఛంగా, నిర్మలంగా తయారవుతుంది. ఈ కలయిక కోసం వేచి చూడడంలో రోజంతా గడిచిపోతుంది. నామ సంకీర్తనలో, పూజలో, స్తోత్ర పఠనంలో రోజంతా గడిచిపోతుంది. ఆత్మ ప్రాయశ్చిత్తంతో తన పాపాలను క్షాళన చేస్తుంది. ఏడుస్తుంది. ఆ తర్వాతనే రాత్రి పూట శివునితో కలయిక జరుగుతుంది.

ఈ భావనయే మహాశివరాత్రిలోని సాంస్కృతిక, ధార్మిక, ఆధ్యాత్మిక చైతన్యం. ఈ భావనతోనే జీవితంలో చైతన్యం వెల్లివిరుస్తుంది. కానీ, నేడీ భావన ఎక్కడా కానరావడం లేదు. శివరాత్రి పర్వం వెనుక ఉన్న మౌలిక దృష్టి. సిద్ధాంతం, ఆలోచనలను మనం కోల్పోయాం, కోల్పోతున్నాం. మహా శివరాత్రిలో ఇమిడి ఉన్న ఆత్మనిర్మాణం, ఆత్మసంస్కరణ, ఆత్మోద్ధరణ అనే చైతన్యం నేటి కోలాహలంలో, ఉరుకులు పరుగులలో, ఆత్మోద్ధరణ అనే చైతన్యం నేటి కోలాహలంలో, ఉరుకులు పరుగులలో, తిరణాల సందడిలో ఎక్కడా కానరావడం లేదు. ఇది శివభక్తికికాక, శివుని నుండి విభక్తికి, వేర్పాటుకు చిహ్నం. తన ఆంతరిక చేతనలో నేడు శివసంకల్పాన్ని, శుభ సంకల్పాన్ని నింపుకున్న వ్యక్తియే నిజమైన శివభక్తుడు. నేడు శివునితో కలయికకై తన ఆత్మసంస్కరణలో ఒక కొత్త అడుగు ముందుకు వేసినవాడే నిజమైన శివభక్తుడు. పాపాన్ని, అధర్మాన్ని, చెడును పూర్తిగా వదులుకోవాలనే తపన, ఆరాటం, తహతహ, ఉద్వేగం ఎవరిలో తీవ్రం, తీవ్రతరం, తీవ్రతమం అవుతున్నవో అతడే నిజమైన శివభక్తుడు.

నేడు మహాశివరాత్రి పావన పర్వం రోజున పరమశివుని స్మరించి, మనం మన శివభక్తిని పరీక్షించుకుందాం. మహేశ్వరుడు మనకు వరం ఇవ్వడానికి ఉవ్విళ్ళూరేటట్లు ఏదైనా ఒక పని చేసి చూపుదాం.

★★★

## సద్గురు లీలామృతం

*ఒక్కో మాటకు అసలు విలువ ఉండదు. ఒక్కో మాటకు మహత్తర ప్రభావం ఉంటుంది. మాటకు ప్రభావాన్ని ఇచ్చేది వాక్య నిర్మాణం కాదు, వ్యాకరణ పాండిత్యం కాదు – ఆ మాట చెప్పే వ్యక్తి యొక్క వ్యక్తిత్వంలో ఉన్న ప్రాణశక్తి. ఆ ప్రాణశక్తి లోపిస్తే ఆ మాటకు ప్రభావం ఏమీ ఉండదు. గురుదేవుల వాణిలో ప్రాణశక్తి నిండుగా ఉన్నది.*

*ఆ రోజులలో కాంగ్రెస్ ఉద్యమం మందగించింది. ఆ స్థితిలో కాంగ్రెస్ కార్యకర్తలలో పలువురు ఉద్యమాన్ని వదలిపెట్టి, తమ తమ వృత్తి వ్యాపారులలో మునిగిపోసాగారు. వరిష్ఠ నాయకులుగా పిలువబడేవారు సైతం ఈ ధోరణిని అవలంబించసాగారు. రాష్ట్రశాఖ మాజీ కార్యదర్శి జగన్ ప్రసాద్‌జీ రావత్ కూడా తమ పుస్తకాలు, దస్తావేజులు దులిపారు. ఆఫీసు ఏర్పాటు చేసుకున్నారు. తమ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.*

*ఒకరోజున ఆయన కచ్చేరీకి (కోర్టు) టాంగాలో వెడుతున్నారు. త్రోవలో నవయువకుడు శ్రీరామ్ ఒక్క క్షణం టాంగా ఆపించారు. రావత్‌జీతో ఇలా అన్నారు – "రావత్‌జీ! ఈ పరిస్థితిలో మీరు కూడా న్యాయవాద వృత్తి ప్రారంభిస్తే స్వచ్ఛంద సేవకులము మేము ఏమి కావాలి? కాంగ్రెస్ సంస్థ ఏమవుతుంది?"*

*శ్రీరామ్ ప్రాణాలలో దేశంపట్ల ఉన్న వ్యాకులత, నిబద్ధత ఆ మాట విన్న రావత్‌జీ అంతఃకరణను కదిపివేశాయి, ఆ మాటలు ఆయన నిర్ణయాన్ని మార్చివేశాయి. ఆయన తిరిగి జాతి సేవలోనికి దూకారు. అనంతర కాలంలో ప్రభుత్వంలో మంత్రి అయ్యారు.*

*ఇదీ గురుదేవుల మాటల యొక్క అద్భుత ప్రభావం, ఆ ప్రభావం ఒకరిద్దరి జీవితాలను మాత్రమే కాక లక్షలాది వ్యక్తుల జీవితాలను మార్చివేసింది.*

**పడితే లేవడం తెలిసినవాడు, ఎన్నిసార్లు పడినా ఫరవాలేదు**

వ్యక్తి వికాసం-3

# ఆరోగ్యమే మహాభాగ్యం

శరీరం మానవుని ముఖ్య సేవకుడు. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే మనకు కావలసిన పనులు చేయగలదు. ప్రకృతి, శరీర అవసరాన్ని బట్టి ఆహార విధానం, జీవనసరళి నిర్దేశించ బడింది. వీటిని పాటిస్తే ఆరోగ్యంతోపాటు దీర్ఘాయువు పొందగలడు. శరీరం రోగగ్రస్తం అయితే కార్యక్షమత తగ్గుతుంది. అందుచేత ఆహారం, జీవనసరళి కట్టుబాట్ల ముఖ్య సూత్రాలను పాటించి ఆరోగ్యం, సఫలతలను ప్రాప్తించుకొనగలడు.

శరీర ఆరోగ్యంలో ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. శారీరిక ఆరోగ్యం, మానసిక స్థితి తీసుకుంటున్న ఆహారం మీద ఆధారపడి ఉంటాయి. కొన్ని పదార్థాలు శరీరానికి చంచలత, ఉద్విగ్నత కలిగిస్తాయి. శరీరానికి పోషణ ఇచ్చే ఆహార పదార్థాలనే స్వీకరించాలి. ఆహారానికి రుచి ఒక్కటే ముఖ్యం కాదు. తీసుకునే పదార్థాలు శరీరానికి హాని కలిగించేవి కావని నిర్ధారించుకోవాలి.

భారతీయ సంస్కృతి, విజ్ఞానం ఆహారం మనస్సును ప్రభావితం చేస్తుందని, మనస్సును తయారుచేస్తుందని చెప్తాయి. **నిజాయితీగా ఆర్జించిన డబ్బుతో లభించిన ఆహారం ఆరోగ్య ప్రదమని భారతీయ విజ్ఞానం చెప్తుంది. మోసంతో, అన్యాయంగా అనుచితమైన ఆర్జనతో కూడిన ఆహారంతో బుద్ధి చెడుతుంది.** భోజనం చేసే ముందు కాళ్ళు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కోవాలి. భగవంతుని ప్రసాదంగా భావించి ఆనందంగా, నెమ్మదినెమ్మదిగా ఆహారాన్ని తీసుకోవాలి. ఇలా చేయడం వలన మన శరీరం పుష్టిగా ఉంటుంది. ప్రాకృతిక ఆహారం అధిక లాభదాయకమైనది, ఉపయోగకరమైనది.

ఆహారం యొక్క ముఖ్య ఉద్దేశ్యం శరీరానికి శక్తి ఇవ్వడం, శరీరంలో నిరంతరం నశిస్తున్న కణాలను తిరిగి నిర్మించడం. ఆహారంతో శరీరంలో ఉత్పన్నమయ్యే వేడియే జీవనశక్తిగా మారుతుంది. ఈ వేడియే మనం తినే ఆహార పదార్థాలను జీర్ణం చేయడానికి తోడ్పడుతుంది. ఆహార పదార్థాలు ఐదు రకాలుగా విభజింపబడ్డాయి. 1) కార్బోహైడ్రేట్లు (పిండి పదార్థాలు) 2) ప్రొటీనులు (మాంస కృత్తులు) 3) కొవ్వు పదార్థములు 4) క్షారములు, లవణ పదార్థములు 5)విటమినులు. మన ఆహారంలో ఈ తత్వాలు అన్నీ నిర్ధారిత అంశాలుగా తప్పకుండా తగినంత మోతాదులో ఉండాలి. 25 సంవత్సరాల వరకు ప్రొటీన్లు, క్రొవ్వు పదార్థములు అధికంగా అవసరమవుతాయి. ప్రతిరోజు వీలయినంతవరకు ఒకే సమయమందు భోజనం చేయాలి. తాజా, ఎక్కువ వేడి చేయని ఆహారం ఆరోగ్యకరం.

మనిషి జిహ్వా (నాలుక)ను మనను చాలా వరకు నియంత్రిస్తుంది. అది కారం, మసాలలు ఉన్న భోజనం కావాలంటుంది. కానీ ఆరోగ్యరీత్యా అది సరియైనది కాదని అంటారు. సాదా, పుష్టికరమైన ఆహారాన్ని సాత్విక ఆహారం అంటారు. ఈ ఆహారం వలన మనిషి చిత్తం శాంతంగా, పవిత్రంగా ఉంటుంది. మాంసాహారం తామస ఆహారం అవుతుంది. అందువలన దీని నుండి దూరంగా ఉండటం మంచిది.

నిత్య జీవితంలో ఆహారంతోపాటు విహారానికి కూడా ప్రముఖ స్థానం ఉన్నది. విహారం అంటే జీవన సరళి. విహారం అంటే విహారాలు చెయ్యడం కాదు. ఆహారంతోపాటు జీవన సరళి సూత్రాలు కూడా పాటించితే రోగరహిత జీవితం పొందగలము. నియమిత దినచర్య, ఇల్లు, చుట్టుప్రక్కల పరిశుభ్ర వాతావరణం ఉంచుకోవాలి.

## సూర్యోదయానికి ముందు నిద్ర లేవడం

శారీరిక, మానసిక ఆరోగ్యానికి, దినమంతా చురుకుగా ఉండటానికి సూర్యోదయానికి ముందు నిద్ర లేవడం లాభదాయకం. పెందలాడే నిద్రలేచే అలవాటు శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది. ప్రాతఃకాలం లేవగానే ఆత్మబోధ చేసుకోవాలి. ఈ రోజు మంచి పనులు చేస్తాను అని అనుకుంటు ఆనాటి దినచర్యను ఒక్కొక్కటిగా గుర్తుచేసుకోవాలి.

మానవ జీవితంలో స్వచ్ఛత ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇంటిని, వంటిని, వస్తువులను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇలా ఉంచుకొనే వారు అనుకున్న పనులను బాగా చేయగలుగుతారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోని వారి పనులు ఆలస్యం అవుతుంటాయి. శుభ్రంగా ఉండటం లక్ష్మీప్రదం. మన బట్టలు, ఉపయోగించే వస్తువులు అన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**కాపురం అన్నాక కలతలు వస్తాయి**

బాహ్య శుభ్రతతోపాటు ఆంతరిక శుభ్రత కూడా పాటించాలి. అవి వైరభావం లేకుండా ఉండటం, ఇతరుల అవసరాల గురించి ఆలోచించడం, క్షమాగుణం, దయాగుణం ఈశ్వరునిపై విశ్వాసం.

**వ్యాయామం:** వ్యాయామాన్ని జీవన సంజీవని అన్నారు. వ్యాయామం వలన ఆరోగ్యం లభిస్తుంది. శరీరం తేలికగా ఉండి పనిచేయడానికి ఉత్సాహం, ఆసక్తి కలుగుతాయి. ఆకలి పెంపొందుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఊపిరి తిత్తులు బలంగా తయారై, రక్తశుద్ధి బాగా జరుగుతుంది. ఇంకా మస్తిష్కం యొక్క ధారణశక్తి పెరుగుతుంది. ముఖం కాంతివంతమవుతుంది.

మామూలు వ్యాయామంతోపాటు ఆసనాలు, ప్రాణాయామం ముద్రలు మొదలైనవి ఉపయోగకరం. సూర్య నమస్కారాలు ఎంతో ఉపయోగకరం.

**ఆహారం:** ఆహారం రసాలు, ధాతువులుగా మారి శరీర అవయవాలకు శక్తిని ప్రసాదిస్తుంది, పోషణ ఇస్తుంది, శరీరాన్ని రక్షిస్తుంది.

ప్రాణులకు అన్నం అమృతతుల్యం. ఏమి తినాలి, ఎంత తినాలి? ఎప్పుడు తినాలి? ఎందుకు తినాలి? ఎలా తినాలి అనే దానిని గురించి బాగుగా అధ్యయనం చేయాలి.

**మనోరంజనం:** మనోరంజనం ద్వారా వ్యక్తి శక్తిని పొందుతాడు. వీటిలో సంగీతం వినడం, ఆటలు ఆడటం, టి.వి. చూడటం. పుస్తకాలు చదవడం, స్నేహితులను కలుసుకోవడం, సినిమాలు చూడటం మొదలైనవి ఉన్నాయి. మనోరంజన ఆరోగ్యకరంగా ఉండాలి. శరీర, మనస్సుల అలసట తీరేదిగా మాత్రమేగాక క్రొత్త విషయాలు తెలుసుకునేవిగా కూడా ఉండవచ్చు.

**విశ్రాంతి:** జీవితంలో పరిశ్రమ ఎంత ముఖ్యమో విశ్రాంతి కూడా అంత ముఖ్యమే. నిద్రలో మంచి విశ్రాంతి లభిస్తుంది. ఆయుర్వేదం పగటి నిద్రను నిషేధిస్తుంది. పగటి నిద్ర ఆరోగ్యానికి మంచిది కాదు. పగటి వేళ విశ్రాంతి అవసర మయితే విశ్రాంతి తీసుకోవలసినదే. ఇది నిద్రపోవడమే కానక్కర లేదు.

రాత్రి కావలసినంతగా నిద్రపోవాలి. తద్వారా పగలు పనిచేయగలుగుతారు. మంచి నిద్ర కొరకు తక్కువ ఆహారం తీసుకోవాలి. బట్టలు వదులుగా ఉంచుకోవాలి.

ఈనాడు అనేకమందికి స్ఫూర్తిదాయకమైన నిద్రపోవడం సమస్యగా అయింది. నిద్రకొరకు మందులు కూడా వాడుతున్నారు. బాగా శ్రమించేవారికి సామాన్యంగా నిద్ర బాగానే పడుతుంది. కానీ జీవితంలో అనేక సమస్యలు వస్తుంటాయి. సమస్యల గురించి ఆలోచిస్తుంటే ఇంక నిద్ర ఏమి పడుతుంది? **పడుకునేటప్పుడు సమస్యలను గురించి ఆలోచించకుండా, సమస్యలకు పరిష్కారం ఆలోచిస్తూ పడుకుంటే ఉదయం నిద్రలేచినప్పుడు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనేక పండితుల అభిప్రాయం.** దానిని వారు "Sleep over the Problem" అంటారు. ఇంకొక పద్ధతి – మన సమస్యలను మనం విశ్వసించిన గురువుకో, దేవతకో చెప్పుకుని హాయిగా నిశ్చింతగా నిద్రపోవడం.

**దుస్తులు:** ఆరోగ్యం కొరకు ఆహారంవలెనే దుస్తులకు కూడా ప్రాముఖ్యత ఉన్నది. దుస్తులు శరీరానికి అంటుకోకుండా కొంచెం వదులుగా ఉండాలి. శరీరానికి గాలి తగులుతుండటం మంచిది. ఇరుకు బట్టలు, హైహీల్స్ జోళ్ళు, ఇతర శృంగార సామాగ్రితో శారీరిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. భారతీయ వాతావరణం ఇరుకు బట్టలకు సరైనది కాదు. ఇచ్చట వేడి వాతావరణం వలన శరీరం నుండి చమట కారుతుంది. ఇలాంటప్పుడు ఇరుకు బట్టలు ఇబ్బంది కలిగిస్తాయి. అందువలన దుస్తులు ధరించేటప్పుడు అవి మనకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలి. అందమైన బట్టలు కట్టుకోవాలనుకోవడంలో తప్పులేదు. కానీ అవి మనకు ఇబ్బందికరంగా మారకూడదు.

*(సశేషం)*

## ఆత్మసాక్షి

*ఒకసారి ఒక శిష్యుడు స్వామి దయానంద వద్దకు వచ్చాడు "స్వామీజీ అనేకమంది అనేకరకాలుగా మిమ్మల్ని నిందిస్తున్నారు. ఆపటానికి మార్గం లేదా?" అని ప్రశ్నించారు. "నిందలు పడే విషయంలో భగవంతుడు కూడా తప్పించుకోలేకపోయాడు. మనమెంతటి వాళ్ళం! మానవుడు తన ఆత్మసాక్షిగా తప్పులు చేయకుండా ఉంటే చాలు. ప్రపంచంలో ఎవ్వరికీ భయపడవలసిన పనిలేదు" అన్నారు దృఢంగా.*


*– అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**అమ్మ పాలు ముమ్మాటికి మేలు**

వసంత పంచమి ప్రత్యేకం

# మనసులో బ్రాహ్మణత్వం - పనిలో ఋషిత్వం

**(పూజ్య గురుదేవుల "ఆత్మకథ" నుండి)**



ఒక వ్యక్తి యొక్క అంతరాత్మలో బ్రాహ్మణత్వం మేలుకొనిన వెంటనే అతని పనుల్లో ఋషిత్వం అతిసహజంగా వ్యక్తమవుతుంది. ప్రలోభాల్ని జయించే నైతిక బలము కలిగిన వ్యక్తి బ్రాహ్మణుడు, అతడు తృష్ణను ప్రతిఘటిస్తాడు. సగటు పౌరునివలె జీవించడంలో ఆనందాన్ని, సంతృప్తిని పొందుతాడు. బ్రాహ్మణత్వాన్ని ఏవిధంగా అలవరచుకోవాలో చిన్నతనంలోనే నా గురుదేవుల నుండి మార్గదర్శనం పొందాను. ఆ సూచనలను పాటించి నేను బ్రాహ్మణునిగా తిరిగి జన్మించాను. బ్రాహ్మణ వంశంలో జన్మించడంలో విశేషం లేదు. పూర్వజన్మలలో ఆత్మ పశుతుల్యమైన కలిగిన అనేక మానవ శరీరాలను ధరించి, విడచి ఉండవచ్చు. ఈ అనంత యాత్రలో – పాప భారము, ఫలితంగా వచ్చే దుఃఖభారంతో ఎన్ని పశుతుల్య జన్మలు పొందానో నాకు జ్ఞాపకం లేదు. బ్రాహ్మణునిగా నిజంగా పిలువదగిన ఈ జన్మలో సాధించిన సాఫల్యములకు నేను పరమానందాన్ని పొందుతున్నాను. జంతు శరీరంలో దేవ మానవునిగా నన్ను నేను పరివర్తన చేసుకొను అపూర్వ అవకాశము, ఆనందము నాకు లభించినది. బ్రాహ్మణుడు తన శక్తిలో కొద్ది భాగమును మాత్రమే తన వ్యక్తిగత అవసరములకు, కుటుంబ అవసరములకు వినియోగిస్తాడు. కనుక అతని వద్ద అపారమగు శక్తి మిగిలి ఉంటుంది. ఏనుగులు, ఒంటెలు, గేదెలు, పెద్ద పెద్ద కడుపులు కలిగి ఉంటాయి. అవి తమ కడుపులు నింపుకొనుటకు అంత ఎక్కువ సమయమును ఎందుకు వినియోగిస్తాయో దానిని బట్టి అర్థమవుతుంది. మనిషికి కౌశల్యము, నైపుణ్యము కలిగిన రెండు చేతులు ఉన్నాయి. అవసరమగు వనరులను, కుటుంబము నుండి మిత్రుల నుండి సహకారమును సంపాదించుటకు వేయి మార్గములను కనుగొనగలిగిన సామర్థ్యము కలిగిన మనస్సు ఉన్నది. కనుక అతడు సులభముగా బ్రతుకుతెరువును సంపాదించుకొనగలడు. మనిషి యొక్క కడుపు చిన్నది. నెమళ్ళు, పావురములు సైతము తమ అవసరములను తీర్చుకొంటాయి. కనుక, మనిషికి బ్రతుకు తెరువు ఒక సమస్య కాదు. ఆ పనిని కొద్ది గంటలలో చేయవచ్చును. ఆ విధముగా ప్రజాసేవకు అనేక గంటల సమయము మిగులుతుంది. ఋషిత్వమును అలవరచుకొన్న వ్యక్తులు తమ మిగులు సమయమును, శ్రమను, వనరులను, శక్తియుక్తులను ఎక్కడ సద్వినియోగపరచవలెనని మాత్రమే ఆలోచిస్తారు.

ఈ ప్రశ్నకు సమాధానము కనుగొనుటకు ఎక్కువ సమయము అవసరము లేదు. మహాత్ముల జీవితములలో సమాధానం దొరుకుతుంది. వారిలో ఎవరినైనను ఆదర్శముగా స్వీకరించవచ్చును. రాక్షసులకు మాత్రము విశృంఖలములు, తీరనివి అయిన తృష్ణలు ఉంటాయి. అపరిమితమగు సంపదను, వనరులను కూడబెట్టి, వానిని విశృంఖలముగా అనుభవించుటకు వారు పథకములను వేస్తారు. కానీ, హిరణ్యాక్షుని నుండి అలెగ్జాండరు వరకు ఏ ఒక్కరును ఆ కోర్కెను తీర్చుకొనలేక పోయారు.

ఆత్మకు, భగవానునికి మధ్యగల బిందువు వద్ద దేవ మానవుడు ఆవిర్భవిస్తాడు. అతనిని మహాత్ముడు, సాధువు, సంస్కర్త, అమరవీరుడు అని కూడా పిలుస్తారు. ప్రాచీన కాలములో అట్టి వ్యక్తులను ఋషులని అనేవారు, ఆ ఋషుల అవసరములు కనీస స్థాయిలో ఉండేవి. వారు తమ వనరులను, శక్తియుక్తులను యుగధర్మము యొక్క అవసరములను తీర్చు మహాకార్యములకు వినియోగించేవారు, ధార్మిక ప్రవృత్తులను పెంపొందించుటకు దోహదపడేవారు, వినాశనకారుల దుర్మార్గములకు వారు అడ్డుకట్ట వేసేవారు. నిర్మాణాత్మక కార్యములలో ఒక్కొక్క అడుగు పురోగమిస్తూ, దివ్య గుణములను ఒక్కొక్కటిగా సమీకరించుకుంటూ వారు మహత్తర కృషి జరిపారు.

నైతిక సంయమనము కొరవడిన భావావేశముతో కూడిన భక్తిని నేను ఆమోదించలేను. ఋషుల జీవన విధానం

**ధనవంతుడవటానికి ఏ చదువు అవసరం లేదు**

అనుసరించదగినదని నేను భావించాను. ఆ ఋషి సంప్రదాయముల పునరుద్ధరణకై నా సమయమును, నా వనరులను అన్నింటిని సమీకరించుటకు ప్రయత్నించాను. నిరంతరము, ఏకాగ్రం అయిన కృషి జరుపు వ్యక్తులు చిన్న మొత్తముల ద్వారా కాలక్రమములో అపారమైన సంపదను కూడబెట్టగలుగుతారు. పక్షి ఒక్కొక్క గడ్డి పరకను ప్రోగు చేసి, చక్కని గూడును నిర్మిస్తుంది. ఋషి సంప్రదాయములను పునరుద్ధరించు అవకాశము లభించుట నా మహాభాగ్యము.

ఋషులు ఆ కాలములో సమయానుసారంగా వేరు వేరు పనులు తీసికొని పూర్తి చేసేవారు. కానీ ఇప్పుడు ఉన్నది అత్యవసర పరిస్థితి. ప్రస్తుత పరిస్థితులలో అనేక కార్యాలను ఒకేసారి త్వరితగతిని పూర్తి చేయవలసి ఉన్నది. ఇంటికి నిప్పు అంటుకొన్నప్పుడు దానిని ఆర్పే ప్రయత్నంలో పెద్దవారి నుండి చిన్నవారి వరకు అందరు వారికి చేతనైన సహాయము చేస్తారు. నివారించే ప్రయత్నం, రక్షించే ప్రయత్నం ఏక సమయంలో జరుగుతాయి. ఋషుల ద్వారా నాకు ఇవ్వబడిన పనులన్నీ వారు తమ కాలంలో ఒక్కొక్కరు విడిగా చేసారు. కానీ ఒకే కాలంలో నేను బహుముఖ జీవితం గడపవలసి వచ్చింది. దీనికి అవసరమైన ప్రేరణ, సహాయం, మార్గ దర్శకత్వం నాకు నా గురుదేవుల నుంచి లభించింది. ఈ శరీరంతో నేను చేయగలిగేదంతా పూర్తి తత్పరత, తన్మయత్వముతో చేశాను. పరిపూర్ణ విశ్వాసంతో చేశాను. అందువల్ల అవన్నీ ఎవరో ముందే చేసి పెట్టారా అన్నట్లు సులభంగా నెరవేర్చబడ్డాయి. "కృష్ణుని సారథ్యం, అర్జునుని గాండీవము" అను ప్రాచీనమైన మాట నా విషయములో అక్షరాలా నిజమైంది.

యుగపరివర్తన లాంటి పెద్ద సంఘటన పరమాత్మ ఉద్దేశ్యం వల్ల జరిగినా దాని పూర్తి మహాత్మ్యం ఋషులకి ఇవ్వబడుతుంది. ఇదే వారి సాధన, పాత్రతలకు సర్వోత్తమ బహుమతి. నాకు కూడా ఆ బహుమతి ఇవ్వబడింది. నా జీవితము ధన్యమైనది. చరితార్థమైనది. నాకు సుదూర భవిష్యత్తులో జరిగేది స్పష్టంగా కనిపిస్తుంది. కనుక ఇలా వ్రాయడానికి ఏ మాత్రం సంకోచించడము లేదు.

పూర్వకాలపు ఋషుల స్థూల శరీరాలు ఇప్పుడు లేవు. కాని వారి చైతన్యము సూక్ష్మ శరీరాలతో నిర్ధారిత స్థలాలలో ఇప్పటికీ ఉన్నది. వారందరిని నాకు పరిచయం చేసి వారి అడుగుజాడల్లో నడవాలి అని ఆదేశించారు గురుదేవులు. వారందరి కార్యపద్ధతిని అవలంభించడానికి దేవాత్మ హిమాలయాలకు ప్రతీకగా హరిద్వార్‌లో ఒక ఆశ్రమం "శాంతికుంజ్" స్థాపించి యుగపరివర్తన చక్రానికి సువ్యవస్థితమైన గతిని (వేగం) ఇవ్వమన్నారు.

తపః పునీతులైన మహామానవులు ఋషులు హిమాలయాల్లో ఉండి చేసిన విభిన్న కార్యాలను నా మూడవ హిమాలయ యాత్రలో చాలాసార్లు గుర్తుచేశారు. వీరు భగీరథుడు (గంగోత్రి), పరశురాముడు (యమునోత్రి), చరకుడు (కేదార్ నాథ్), వ్యాసుడు (బదరీనాథ్), యాజ్ఞవల్క్యుడు (త్రియుగి నారాయణ్), ఆదిశంకరాచార్యులు (జ్యోతిర్మఠం), జమదగ్ని (ఉత్తరకాశి), పతంజలి (రుద్రప్రయాగ), వశిష్ఠుడు (దేవప్రయాగ), పిప్పలాదుడు, సూత, శౌనక, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు (ఋషికేశ్), దక్ష ప్రజాపతి, కణాదుడు, విశ్వామిత్రుడు, సప్త ఋషులు. చైతన్య మహాప్రభు, సంత్ జ్ఞానేశ్వర్, తులసీదాస్‌ల కర్తృత్వాలను చూపించారు. బుద్ధ భగవానుని పరివ్రాజక ధర్మ చక్రాన్ని ఈనాటి పరిస్థితులకు అనుగుణంగా సంగీతం, సంకీర్తన ప్రజ్ఞాపురాణ కథల ద్వారా దేశవిదేశాలలో విస్తరింపజేసి ప్రజ్ఞావతరణ ద్వారా బుద్ధావతారం యొక్క ఉత్తరార్థాన్ని పూర్తిచేయమని నన్ను ఆదేశించారు. సమర్థ రామదాసుగా నాచే ఏ విధంగా 16వ శతాబ్దంలో హనుమంతుని మందిరాలు, వ్యాయామశాలలు నిర్మింపజేశారో అలాగే ఈసారి ప్రజ్ఞాపీఠాలు, జ్ఞానమందిరాలు, స్వాధ్యాయ మండలులు నిర్మింపవలసి ఉన్నది అని గురుదేవులు హిమాలయాల్లోనే ఆదేశించారు.

శాంతికుంజ్‌ను దేవాత్మ హిమాలయాల ప్రతీకగా చేయమని గురుదేవులు ఇచ్చిన ఆజ్ఞ చాలా వ్యయ ప్రయాసలతో కూడినపని. అనేకమంది సహాయపడితేనే అవుతుంది. అంతేకాక ఆధ్యాత్మిక ధృవకేంద్రం అయిన హిమాలయాలలో ఉన్న సూక్ష్మ శరీరధారులైన ఋషుల ఆత్మలను ఆకర్షించి ప్రాణప్రతిష్ఠ చేయవలసి ఉన్నది. ఇదంతా దేవతల పరంపరలో అద్భుతము. ఇదివరకు ఎక్కడా జరగని ప్రయోగం. దేవతల మందిరాలు అనేకం ఉన్నాయి. వేరువేరుగా ఒకచోట అనేకమంది దేవతల స్థాపన కూడా కొన్ని చోట్ల ఉంది. కానీ సమస్త దేవతల, ఋషుల ప్రాణప్రతిష్ఠ ఒకేసారి ఒకేచోట ప్రపంచంలో ఇంకెక్కడా

**సమయం విలువ తెలుసుకున్నవాడు ధనవంతుడు అవుతాడు**

లేదు. అంతేకాక, ఆయా ఋషుల ప్రత్యేక శక్తుల దివ్య స్పందనలను, పవిత్రతను సాధించిన సాధకులు ఇక్కడ గుర్తించగలుగుదురు. ఈ విధంగా **శాంతికుంజ్, బ్రహ్మవర్చస్, గాయత్రీతీర్థ్ ఋషులందరి శక్తులకు ప్రాతినిథ్యం వహిస్తాయి.**

శ్రీరాముడు లంకను జయించడానికి, రామరాజ్య స్థాపన కొరకు రామేశ్వరం వద్ద శివప్రతీకను స్థాపించారు. యుగ నిర్మాణం కొరకు సంఘర్షణ, నవసృజన ప్రతిమను ప్రాణ ప్రతిష్ఠ చేయమని ఆదేశం ఇవ్వడం నా సౌభాగ్యం. **శాంతికుంజ్‌లో ఐదు ప్రయాగలు, ఐదు కాశీలు, ఐదు నదులు, ఐదు సరోవరాల సహితంగా హిమాలయాలను చూడవచ్చు.** అక్కడ ఋషులందరి దివ్య స్థానాలను కూడా దర్శించవచ్చు. అద్భుతమైన దేవాలయాలకు, దుర్గమ ప్రాంతాలకు వెళ్ళి దర్శించడం చాలా కష్టంతో కూడిన పని. కానీ దాని లఘు సంస్కరణ శాంతికుంజ్‌లో చూడవచ్చు.

**జమదగ్ని పుత్రుడైన పరశురాముడు** తన గండ్ర గొడ్డలితో అనేకమంది అవినీతిపరుల శిరస్సులను ఖండించాడు. ఇది ఆలంకారిక వర్ణనే అయినా సత్యము. యమునోత్రి వద్ద తమ సాధనలో తీవ్రత తీసికొనివచ్చి ఆయన సృజనాత్మకత తెచ్చే బాధ్యత స్వీకరించారు. ఆ రోజులలో సమాజ నిర్మాణానికి అడ్డు వచ్చి అవినీతికి పాల్పడేవారి వృత్తులను ఆయన తీవ్రంగా ఖండించారు. భ్రష్టులు, దుష్టుల మానసవృత్తులను మార్చడానికి తీవ్రకృషి సల్పారు. దీనివల్లనే ఆయనకు శివుని వద్ద నుండి "పరశు" లభించింది. తన జీవిత ఉత్తరార్థంలో పరశుని వదలి పారను చేతపట్టారు. ఇది స్థూలంగా వృక్షారోపణమునకు సూక్ష్మ రచనాత్మక బీజాలను నాటడానికి ప్రతీక. శాంతికుంజ్ నుండి వ్రాసిన పుస్తకాలు పరశు కార్యాన్ని నిర్వర్తిస్తూ అనేక ఆలోచనలలో, మాన్యతలలో, భావనలలో, కార్యకలాపాలలో ఊహకందని మార్పులు తెచ్చాయి.

**భగీరథుడు** భయంకర క్షామం ఏర్పడి నీటి కొరత ఏర్పడినప్పుడు కఠోర తపస్సు చేసి స్వర్గము నుండి గంగను భూమి మీద ప్రవహించేటట్లు చేశాడు. గంగోత్రి సమీపంలో భగీరథ శిల ఉన్నది. ఆయన తపస్సు వలన అవతరించినది కనుక గంగను 'భాగీరథీ' అన్నారు. లోకమంగళకరమైన ప్రయోజనాల కొరకు ప్రచండ పురుషార్థాల వల్లనే భగీరథుడు శివుని కృపకు పాత్రుడయ్యాడు. విశ్వాసరాహిత్యం అనే దుర్భిక్షం సంక్రమించి ఉన్నది. దివ్యమైన జ్ఞానగంగను అవతరింపజేసి దీనిని నివారించడానికి శాంతికుంజ్ నుండి జ్ఞానగంగ యొక్క అవిరళ ధార ప్రవహిస్తున్నది. అందువల్ల ప్రస్తుతం సమాజంలో ఉన్న భావనాత్మక లేమి హరించబడి సద్భావం అంతటా ప్రసరింపబడుతుందనే ఆశ కలుగుతోంది.

**చరక ఋషి** కేదార్‌నాథ్ క్షేత్రంలో ఉండి అనేక మూలికలను పరిశోధించి రోగనివారణకు సంజీవని మూలికలు వెతికి గుర్తించారు. చరకుడు ఓషధులను పరిశోధన చేసి వాటి వాటి గుణగణాలను నిర్ణయించేవాడు. జీవనశక్తి పెంచే మూలికలు, మనోవికారాలను శాంతపరించే మూలికలు, గుణకర్మ స్వభావాలలో మార్పు తెచ్చే మూలికలు ఆయన పరిశోధన ఫలితములే. శాంతికుంజ్‌లో దుర్లభమైన యంత్రాల ద్వారా వనమూలికల పరీక్ష ఆయుర్వేద విజ్ఞానానికి ప్రాణం పోసిందని చెప్పాలి. తగు ఔషధాన్ని ఒకే ఒక మోతాదులో ఇచ్చి రోగ నివారణ చేసే విధానాన్ని పరిశోధన చేయుట చరక ఋషి పరంపరను తిరిగి స్థాపించడం.

**వ్యాస మహర్షి** నరనారాయణ పర్వతాల మధ్య, వసుధార జల ప్రాంత సమీపంలో ఉన్న వ్యాసగుహలలో వినాయకుని సహాయంతో పురాణాలను రచించారు. అతి ఉచ్చస్థాయిలో పనిచేయాలి అంటే ఏకాంత, శాంత, సత్వగుణ ప్రధానమైన వాతావరణం అవసరం అవుతుంది. ఈనాటి పరిస్థితులలో ప్రాచీన గ్రంథాలు లుప్తమై సత్ప్రేరణ ఇవ్వగలిగే సాహిత్యం లేక, ఎందుకు ఉపయోగపడని తుచ్ఛమైన భావనలు ప్రేరేపించే సాహిత్యం రోజురోజుకు పెరిగిపోతూ ఉంటే శాంతికుంజ్ వ్యవస్థాపకుడు 25 సంవత్సరాల పూర్వమే 4 వేదములను, 18 పురాణాలను, 108 ఉపనిషత్తులను, 6 దర్శనాలను, 24 గీతలను, ఆరణ్యకాలు, బ్రాహ్మణాల భాష్యమును అందరికి అర్థమయ్యే సులభశైలిలో రచించి అవి లుప్తం కాకుండా చూశారు. ఆధునిక సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను సూచిస్తూ, యుగానుకూల రచనలు లక్షల వ్యక్తుల జీవితాలలో చెప్పుకోతగ్గ మార్పులను తీసికొని వచ్చాయి. "ప్రజ్ఞాపురాణం" ఉపనిషత్తులలోని జీవిత సత్యాలను సర్వసులభం చేసింది. ఈ విధంగా వ్యాసమహర్షి లక్ష్యాలను శాంతికుంజ్ సాధించింది.

**పతంజలి మహర్షి** అలకానంద, మందాకినిల సంగమ స్థానంలో రుద్రప్రయాగ వద్ద యోగ విజ్ఞానం మీద అనేక

**ఖాళీగా ఉండటం కన్నా ఏదో ఒకటి చెయ్యడం మిన్న**

ప్రయోగాలు చేసి వాటిని ప్రచారం చేశారు. మానవ శరీరంలో నిక్షిప్తమైన అనేక శక్తి కేంద్రాల జాగరణ వల్ల అనంతశక్తిని సంపాదించవచ్చునని, అనేక సిద్ధులు హస్తగతం అవుతాయని నిరూపించారు. శాంతికుంజ్‌లో యోగత్రయి అయిన కాయకల్ప, ఆసన, ప్రాణాయామాల వల్ల అనేక సాధకులలో వచ్చే అనేక పరిణామాలను ఆధునిక పరికరాలతో నిర్ణయించి, శారీరిక మానసిక మార్పులు యోగ్యులైన చికిత్సకుల ద్వారా పరీక్షించబడి సాధన సత్ఫలితాలు శాస్త్రీయ పద్ధతుల ద్వారా నిరూపిత మవుతున్నాయి.

**యాజ్ఞవల్క్యుడు** "త్రియోగినారాయణ" ప్రాంతములో యజ్ఞ విద్యను అభ్యసించాడు. యజ్ఞ విధానంలో అనేక మార్పులను తీసుకొని వచ్చి మానవుల మీదనే కాక, సమస్త జీవజంతువుల మీద ప్రభావాలను పరిశీలించి ఆరోగ్యము చేకూర్చే విధానాలను, వాతావరణమును శుద్ధిచేయుట, వనస్పతులను పెంచుట, వర్షము అవసరమైనప్పుడు కురిపించుట చేశారు. హిమాలయాలలో ఉన్న ఈ దుర్గమ ప్రాంతంలో ఒక యజ్ఞకుండంలో అఖండ అగ్ని ఇప్పటికీ ఉన్నది. ఇది శివపార్వతుల వివాహంలో ఉపయోగించబడింది. యజ్ఞీయ ప్రక్రియలను వెతికి పరీక్షించి అందరికి అందజేసే బాధ్యత బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్ చేపట్టింది. యజ్ఞోపచార పద్ధతులను పరిశోధించుటకు అన్ని హంగులు ఉన్న ఒక ప్రయోగశాల "బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్" ప్రాంగణములో స్థాపితమైంది. వన మూలికలను యజ్ఞాగ్నిలో ప్రయోగించడం వలన కలిగే శారీరక, మానసిక, రోగాల నివారణ, వాతావరణ ప్రయోగించడం వలన కలిగే శారీరక, మానసిక, రోగాల నివారణ, వాతావరణ కాలుష్య నివారణ మొదలగు ఫలితాలు చాలా ఆశ్చర్యజనకంగా ఉన్నాయి.

**విశ్వామిత్రుడు గాయత్రీ మహామంత్ర ద్రష్టగా నూతనలోక స్రష్టగా గుర్తించబడుచున్నాడు. ఆయన సప్తఋషులతో కలసి తపస్సు చేసి ఆదిశక్తి గాయత్రిని సాక్షాత్కారింపచేసుకొనిన ప్రదేశమే ఈ శాంతికుంజ్, గాయత్రీతీర్థం నిర్మింపబడిన స్థలము.** గురుదేవులు నాకు దివ్య చక్షువులు ప్రసాదించి దర్శింపచేసిన స్థలములోనే ఈ శాంతికుంజ్ స్థాపన చేశాను. విశ్వామిత్రుని సృజన, సాధన, సూక్ష్మ సంస్కారాలు ఇక్కడ చాలా ఎక్కువగా ఇప్పటికీ ఉన్నాయి. ఆ ఆదిశక్తికి యుగశక్తి స్వరూపాన్నిచ్చి, 24 శక్తి ప్రతిమలను ప్రతిష్ఠించి సంపూర్ణ విశ్వానికి "వసుధైక కుటుంబకం" అనే సద్బుద్ధినిచ్చే ప్రేరణ శాంతికుంజ్ నుంచి ఇవ్వబడుచున్నది. అనేకమంది సాధకులు ఇచ్చట నివసిస్తూ గాయత్రీ అనుష్ఠానాల ఆధ్యాత్మిక క్షేత్రంలో సిద్ధిపొందుచున్నారు. శబ్దశక్తి యొక్క వైజ్ఞానిక పరిశోధన ఇక్కడ జరుగుచున్నది. ఇది విశ్వామిత్ర పరంపర పునరు జ్జీవనమే.

**జమదగ్ని** గురుకులం ఉత్తరకాశీలో ఉండేది. వానప్రస్థులకు సరిపోయే సమగ్రమైన శిక్షణ వ్యవస్థ ఉండేది. అల్పకాలీన సాధన, ప్రాయశ్చిత విధానాలు, ఇతర సంస్కారాలు చేసుకొనే వీలుండేది. శాంతికుంజ్ వద్ద కూడా లోకసేవకుల శిక్షణ, బాలబాలికలకు నైతిక శిక్షణ, యుగశిల్పి విద్యాలయంలో సమాజనిర్మాణ శిక్షణ, జమదగ్ని పరంపరను ముందుకు సాగించే ప్రయత్నమే.

**దేవర్షి నారదుడు** గుప్తకాశీలో ఉండి తపస్సు చేశారు. తన వీణానాదంతో నిరంతరము జనజాగరణ కార్యక్రమాలలో నిమగ్నులై ఉండేవారు. తన ఉపదేశాల ద్వారా ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించేవారు. శాంతికుంజ్‌లోని యుగ గాయక శిక్షణ వేలమంది పరివ్రాజకులకు శిక్షణ ఇస్తోంది. వారు జీపులలో వెళ్ళి సంగీతం ద్వారా జనజాగరణ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది నారద పరంపరకు అనుసరణ.

రామునికి "యోగవాశిష్ఠము" ఉపదేశించిన **వశిష్ఠులు** దేవ ప్రయాగలో ధర్మాన్ని, రాజనీతిని సమన్వయించారు. శాంతికుంజ్ సూత్రధారులు 1930 నుంచి 1947 వరకు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. జైళ్ళలో అనేక కష్టాలు అనుభవించారు. ఆ తర్వాత సాహిత్యాన్ని సృజించి సమాజానికి, దేశానికి నూతన మార్గము చూపారు. రాజనీతిని, ధర్మాన్ని సమన్వయించడానికి నిరంతరం ప్రయత్నించారు.

**ఆదిశంకరులు** జ్యోతిర్మఠం వద్ద తపస్సు చేసి, దేశం నలుమూలలా నాలుగు మఠాలను స్థాపించారు. విభిన్న సాంస్కృతిక ధోరణులను సమన్వయించి ధార్మిక సంస్థల ద్వారా జనజాగృతి కలుగజేయుట ఆయన లక్ష్యము. శాంతికుంజ్ ఆధ్వర్యంలో 2400 గాయత్రీ శక్తి పీఠాలు ధర్మాచరణను సమున్నతం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతేకాక, భవనాలు లేకుండా నడిపే "సంచార ప్రజ్ఞా సంస్థలు",

**సాధనములు లేమి ప్రగతికి నిరోధకం కాదు**

స్వాధ్యాయ మండలులు దేశమంతటా యుగచేతన ప్రకాశాన్ని ప్రసరింపజేస్తున్నాయి.

**పిప్పలాద ఋషి** ఋషికేశ్ సమీపంలో మనస్సు మీద ఆహారము యొక్క ప్రభావాన్ని పరిశీలించాడు. ఆయన రావిపళ్ళు భుజించి ఆత్మ సంయమనము ద్వారా ఋషిత్వం పొందారు. నేను 24 సంవత్సరములు గోసంస్కారితమైన జొన్నల నుండి రొట్టెలు తయారుచేసికొని మజ్జిగతో కలిపి తీసుకుని గాయత్రీ అనుష్ఠానం చేశాను. ఇప్పటికీ అన్నము, ఆకుకూరలే నా ఆహారము. శాంతికుంజ్‌లో కల్ప సాధనకు వచ్చే సాధకులలో అన్నము, ఆకుకూరల ప్రభావాన్ని పరిశీలిస్తున్నారు. ఋషికేశ్‌లోనే సూత, శౌనకులనే పురాణ కవుల ద్వారా జ్ఞానయజ్ఞం జరిగేది. శాంతికుంజ్ నుండి వెలువడిన ప్రజ్ఞాపురాణ కథనం ఎంత ప్రఖ్యాతమైనదంటే ప్రజలు దీనిని యుగ పురాణంగా భావిస్తున్నారు. ప్రజ్ఞా పురాణము 4 భాగాలుగా ప్రచురితమైనది. ఇంకా కొన్ని భాగాలు ప్రచురణ చేయాలి.

హరిద్వార్‌లో ఉన్న హర్-కి-పేడి వద్ద **హర్షవర్ధనుడు** సర్వమేధ యజ్ఞములో తన సంపదనంతను దానము చేసినాడు. శాంతికుంజ్ సూత్రధారుడు తన లక్షల సంపదను గాయత్రీ తపోభూమి నిర్మాణము, జన్మభూమి వద్ద విద్యాలయ నిర్మాణము కొరకు ఇచ్చాడు. తన కొరకు ఒక్క పైసా కూడా ఉంచుకొనలేదు. శాంతికుంజ్‌లో శాశ్వతముగా ఉండుటకు వచ్చిన స్వయంసేవకులు ఈ పరంపరనే పాటిస్తున్నారు.

**కణాద ఋషి** అథర్వ వేద పరిశోధన సంప్రదాయంలో తన కాలములో ఉన్న అణు విజ్ఞానానికి ఆధ్యాత్మికతలోని వైజ్ఞానిక అంశాలకు మధ్య సమన్వయం చేకూర్చాడు. ఆధునిక కాలంలో ప్రతిదానికి తర్కముతోపాటు ప్రమాణాలు కూడా కావాలి. బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ ఆధ్యాత్మిక-విజ్ఞాన సమన్వయము చేస్తున్నది. ఇచ్చట నుండి వచ్చే ఫలితాల కొరకు ప్రపంచమంతా ఎదురుచూస్తున్నది.

**బుద్ధుని** పరివ్రాజకులు దీక్షలు తీసికొని ప్రపంచ పర్యటనకు బయలుదేరినారు. శాంతికుంజ్ నుండి అన్ని దేశాలకు మన దివ్య సంస్కృతి సందేశాన్ని వినిపించుటకు అనేకులు బయలు దేరారు. భారతదేశంలోనే సుమారు లక్షమంది ప్రజ్ఞాపుత్రులు ఈ కార్యక్రమము చేపట్టారు.

**ఆర్యభట్టు** సౌరమండలంలోని గ్రహాలకు, భూమికి మధ్య శక్తిధారలు ఏవిధంగా ప్రవహిస్తున్నాయో లెక్క కట్టి వాటి ఆధారంగా భూమి వాతావరణము, ప్రాణి సముదాయము ఏవిధంగా ప్రభావితమగుచున్నది తెలిపారు. శాంతికుంజ్‌లో నెలకొల్పిన వేదశాలలో ఫలితాలను ఆధునిక యంత్రాలతో సమన్వయపరచే జ్యోతిర్విజ్ఞాన పరిశోధన కార్యక్రమం జరుగు చున్నది. దృశ్యగణిత పంచాంగం ఇచ్చట నుండి వెలువడిన ముఖ్య జ్యోతిష్య ప్రచురణము.

**చైతన్య మహాప్రభు, సంత్ జ్ఞానేశ్వర్, సమర్థగురు రామదాస్, ప్రాణనాథ మహాప్రభు, రామకృష్ణ పరమహంస మహానుభావుల ధర్మాచరణ ప్రక్రియలను శాంతికుంజ్‌లో అనుసరిస్తున్నారు.**

అన్నిటికన్నా ముఖ్యమైనదేమిటంటే అత్యంత ప్రబలమైన సంస్కారముతో నిండి ఉన్న ఈ ఆశ్రమ వాతావరణంలో వ్యక్తి తేలికగా ఆధ్యాత్మికత వైపు ప్రేరేపించబడతాడు. సూక్ష్మ శరీరము ధరించి ఉన్న ఋషుల ప్రాణమయమైన సంస్కారము వల్లనే ఇది సాధ్యమవుతుంది. తమ కార్యకలాపాలు పునరుజ్జీవన మగుట చూసి వారు ప్రసన్నులై ఆశీర్వదించుట నిశ్చయము. ఋషుల తపశ్శక్తి వల్లనే భూమిమీద దేవమానవులు ఉదయించ గలిగారు. వాల్మీకి ఆశ్రమములో లవకుశుల జననం, కణ్వాశ్రమంలో చక్రవర్తి భరతుని జననము ఇటువంటి ఉదాహరణలే. బదరీనాథ్‌లో తపస్సు చేసి రుక్మిణి ప్రద్యుమ్నుని కన్నది. అంజని-వాయుదేవులు తపస్వి పూషుని ఆశ్రమములో హనుమంతుని కన్నారు. ఈ విధంగా హిమాలయ క్షేత్రములో చేసిన సాధనలకు అనేక సత్ఫలితాలు కలిగాయి.

ప్రబల సంస్కారాలు ఉన్న క్షేత్రములో తపస్వుల సంపర్కము వల్ల అనేక లాభాలు కలుగుతాయి. స్వాతి వానచినుకు ముత్యపు చిప్పలో పడినచో ముత్యమవుతుంది. చందనవృక్షం వద్ద ఉన్న గడ్డి కూడా సుగంధపూరితమవుతుంది. చింతామణి స్పర్శ పొంది ఇనుము కూడా బంగారమవుతుంది. నేను ఏ హిమాలయ ద్వారం వద్ద నివసించుచున్నానో, ఆ హిమాలయాలలో నా గురుదేవులు సూక్ష్మశరీరంలో అనేక శతాబ్దాలుగా నివసిస్తున్నారు. నా బ్యాటరీని ఛార్జి చేయుటకు అప్పుడప్పుడు వారు పిలుస్తూనే ఉన్నారు. కొత్త పని బాధ్యతను నాపై వేసినప్పుడు దానికి తగిన శక్తి యుక్తులను ఇచ్చుటకు నన్ను తప్పనిసరిగా పిలుస్తూ వచ్చారు. ప్రతిసారీ నేను కొత్త శక్తి భాండాగారంతో తిరిగివచ్చిన అనుభూతిని పొందాను.

**బాధ్యతలను స్వీకరించని వారు పరిణితి సాధించలేరు**

నేను ప్రజ్ఞాపుత్రులను, జాగృదాత్మలను త్రేతాయుగంలో ఎలుగుబంట్లు, కోతులు, ద్వాపర యుగంలో గోపాలబాలురు వహించిన పాత్రను వహించుటకు – ఈ యుగపరివర్తన సమయంలో సామర్థ్యం పొందుటకు, శిక్షణ పొందుటకు లేక సాధన చేయుటకు శాంతికుంజ్‌కి పిలుస్తూనే ఉన్నాను. గంగ ఒడిలో, హిమాలయాల నీడలో ప్రాణశక్తి నిండి ఉన్న వాతావరణంలో అనేకమంది మహర్షుల దివ్య సంరక్షణ ఇచ్చట లభిస్తుంది. ఒక విధంగా, శాంతికుంజ్ ఒక ఆధ్యాత్మిక శానిటోరియం.

60 సంవత్సరముల నుండి వెలుగుతున్న అఖండదీపము నవకుండీ యజ్ఞశాలలో నిత్యము 2 గంటలు యజ్ఞము, నవరాత్రులలో 24 లక్షల మహా పురశ్చరణ, సాధన గాయత్రీ ఉపాసన ద్వారా నియమిత అనుష్ఠానము – వీటన్నింటివల్ల శాంతికుంజ్‌లో ఒక దివ్య వాతావరణం ఏర్పడింది.

మలయ పర్వతముపై మంచి గంధము యొక్క మధుర పరిమళము వ్యాపించి ఉన్న విధముగా సాధన చేయనప్పటికీ, సాధనలో గడిపిన పరమానందమును వ్యక్తి ఇక్కడ అనుభూతి పొందుతాడు. ఋషులు తమ సూక్ష్మ శరీరములతో శాంతికుంజ్ గాయత్రీ పీఠములో ఉపస్థితులై, తమ తమ ప్రత్యేక సంప్రదాయములకు చెందిన వివిధ కార్యకలాపములను పర్యవేక్షించుచున్నారు. కనుక ఇది పవిత్రమగు సిద్ధ పీఠము.

యుగ పరివర్తనకై ప్రత్యక్షము, పరోక్షము, దృశ్యము, అదృశ్యము అగు కృషి జరుపుట నా జీవితములోని అత్యంత ప్రధానమైన కార్యము. ఈనాడు తీవ్రమగు శ్రద్ధా సంక్షోభము వ్యాపించి ఉన్నది. ఔచిత్యము, నీతి, ప్రవర్తనలకు సంబంధించిన మూలసూత్రములను అతిక్రమించుటకు జనులు పూనుకొను చున్నారు. ఫలితముగా దుష్ప్రవర్తన, విచ్చలవిడితనం ప్రబలింది. నేడు వ్యక్తికి సుఖశాంతులు లేవు. సమాజములో స్థిరత్వము లేదు. సమస్యలు, ఉపద్రవములు, భీభత్సకాండలు నానాటికి మితిమీరుచున్నవి. ఈ అధర్మపు వరదకు అడ్డుకట్టవేయు కృషి ఎక్కడా సఫలమగుట లేదు. సామాన్య ప్రజల మనస్సులను, భావనలను సంస్కరించుటయే, ధార్మిక ప్రవృత్తుల వికాసమునకు ప్రేరణ కల్పించుటయే ఇందుకు పరిష్కారము, నిర్మాణాత్మకము, సంస్కరణశీలము అయిన కార్యము ద్వారా ప్రత్యక్షముగాను, అదృశ్యమగు ఆధ్యాత్మిక ప్రభావము ద్వారా పరోక్షముగాను ఈ కార్యము జరుగవలసి ఉన్నది. శాంతికుంజ్ ద్వారా జరుగుచున్నది ఇదియే. ఈ లక్ష్యమును సాధించుటకై కావలసిన శక్తి సమీకరించబడుచున్నది. ఇంతవరకు సాధించిన ఫలితములు ప్రోత్సాహకరముగా ఉన్నాయి. భవిష్యత్తులో సాధింపబడు ఫలితములు మున్నెన్నడు కని విని ఎరుగనట్టివి కాగలవు.

సంగ్రహముగా ఒక బ్రాహ్మణ మానసము నిండు హృదయముతో ఋషి సంప్రదాయమును అనుసరించినది. పునరుద్ధరించినది. అట్టి కార్యమును చేపట్టు వ్యక్తులు తమకు మేలు చేసికొనుటయే గాక, ఇతరుల శ్రేయస్సును పెంపొందిస్తారు.

★★★

## శబ్ద మహిమ

*స్వామి వివేకానంద సత్సంగంలో భగవన్నామం యొక్క మహిమను వివరిస్తున్నాడు. వింటున్న ఒక తార్కికుడు శబ్దాలలో ఏమిలేదని వాటిని పదే పదే ఉచ్చరించినంత మాత్రాన ఏమీ కాదని వాదించాడు. వివేకానందుడు అతని తర్కాన్ని వింటూ అతన్ని ఉద్దేశించి మూర్ఖుడా! ఛండాలుడా! అని తిట్టసాగాడు. దానికి ఆ తార్కికుడు మండిపడుతూ సన్యాసియై ఉండి ఇలా తిడుతూ నా మనస్సును గాయపరుస్తావా అంటూ రెచ్చిపోసాగాడు.*

*స్వామీజీ పకపకా నవ్వుతూ, "సోదరా! ఈ మాత్రానికే ఇంతకోపం, బాధ ఎందుకయ్యా! ఇవి కేవలం శబ్దాలు మాత్రమే. నేనేమీ నీ మీద రాళ్ళను విసరలేదుగా? అని ప్రశ్నించాడు. తార్కికుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.*

*శబ్దాలకు కోపాన్ని తెప్పించే శక్తి ఉన్నప్పుడు అవే శబ్దాలను ప్రేమతో, భావనతో పలికి వాటి ద్వారా అనుగ్రహాన్ని మాత్రం ఎందుకు పొందలేము? ఈ సత్యాన్ని అందరు గ్రహించి, మంత్ర విద్యను, శబ్ద సంపదను వినియోగించుకో గలగాలి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఇతరుల మీద ఆధారపడటం వీలయినంతగా తగ్గించుకోవాలి**

ఇచ్ఛాశక్తి

# గుప్తమనస్సులో దాగిన అనంతశక్తి

ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు భార్య దృష్టిలో మహా మూర్ఖునిగా, చెడ్డ వ్యక్తిగా, కళంకితునిగా నిలచిపోయాడు. ఈ భావన అతని గుప్త మనస్సులో నిలచిపోయి, తన మీద తనకే అసహ్యం వేసింది. అతడు భార్యని వదలి, మలి వయసులో విద్యనభ్యసించుట ప్రారంభించి, దీర్ఘకాలం అభ్యాసం చేసి తిరుగులేని సంకల్ప బలంతో సంస్కృత భాషలో మహాపండితుడై 'కాళిదాసు' పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. భారతావని మొత్తం ఆయన ప్రతిభను విద్యను గుర్తించి వేనోళ్ళ కీర్తించింది. ఆయన గుప్త మనసులో కావ్యశక్తి యొక్క బృహత్ భాండారం దాగి ఉన్నది.

ఒక దారిదోపిడి దొంగ ఉండేవాడు. అతని జీవితం, సంపాదన కొరకు యాత్రికులను దోచుకోవటం, అడ్డు తగిలితే దుడ్డు కర్రలతో హత్య చేయుటంతో సాగిపోతూ ఉండేది. ఒక రోజు అతని చేతికి ఒక ముని చిక్కాడు. ఆయన్ని దోచుకొని, చంపాలనుకొన్న మీదట, ఆ ముని శాంత భావంతో అతనితో ఇలా అన్నాడు "నీవు ఎవరి పోషణ కొరకు ఇంతమందిని లూటీ చేస్తూ, పాపాన్ని కొండలాగా మోస్తూ భరిస్తున్నావు? నీ సంపాదన మీద జీవిస్తున్న నీ కుటుంబ సభ్యులు నీ పాపంలో కూడా భాగం పంచుకుంటారా? వెళ్ళు వెళ్ళి నీ కుటుంబ సభ్యులను నీవు పొందే పాపంలో భాగం పంచుకుంటారా? అని అడుగు" అనగా ఆ దొంగ ఇంటికి వెళ్ళి అడుగగా, వారు చెప్పిన జవాబు విని నిరుత్తరుడయ్యాడు. "మేము నీ మీద ఆధారపడి ఉన్నాము. మమ్మ పోషించే బాధ్యత నీదే అటువంటప్పుడు నీవు చేసే పనిద్వారా వచ్చు పాపపుణ్యాలతో మాకు సంబంధం లేదు." అతనికి జ్ఞానోదయమై "మహర్షి వాల్మీకి" గా మారిపోయాడు. ఆయనలోని గుప్త మానసిక శక్తులు తలుపులు ఒక్కసారిగా తెరవబడ్డాయి. ఆయన తన జ్ఞానంతో ప్రపంచానికి ఒక ఆదికావ్యం అందించి, కాల ప్రవాహంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

ఈ విధంగా ఎంతోమంది మహాపురుషులుగా మారగలిగారు. ఏదో ఒక మానసిక దెబ్బతో లేక అకస్మాత్తుగా తగిలిన ఎదురు దెబ్బ కారణంగా తమలోని గుప్త మనసులో, నిద్రావస్థలో ఉన్న గుప్తశక్తుల జ్ఞానం కలిగి, వారి జీవిత పుటలు తిరగబడి, వారి గుణాలతో ప్రపంచంలో ఎన్నో చమత్కారాలను చేసి ఆశ్చర్యపరచగలిగారు.

మీలో కూడా ఎన్నో అసాధారణ గుప్త శక్తులుగా మనస్సు, శరీరం, ఆత్మ వంటి దివ్యశక్తుల ఖజాన దాగి ఉన్నది. దురదృష్టమేమనగా, మీరు మిమ్ము సాధారణ ప్రాణిమాత్రంగానే నమ్ముతున్నారు. మీరెప్పుడూ ఆలోచించి ఉండరు. మీలో దివ్యమైన, ఆశ్చర్యజనకమైన గుప్తశక్తులు దాగి ఉన్నాయి అని నమ్మండి, నిజంగానే మీరు గొప్ప శక్తులతో నిండి ఉన్న విలువైన ఖజాన వంటివారు.

గుఱ్ఱానికి తన శారీరిక శక్తి యొక్క జ్ఞానం ఉండి ఉంటే, అది మనకు వాహనంగా ఉండేదే కాదు, ఏనుగు తన శారీరిక శక్తితో ప్రపంచాన్నే తన వశంలో తెచ్చుకొని ఉండేది. అలాగే సింహం, పులి, చిరుత, భల్లూకం, దున్న, ఎద్దు, కంచరగాడిద మొదలైన పశువులకు తమలోని శక్తుల గురించి తెలిసి ఉంటే మాత్రం, అవన్నీ మనలను పరిపాలిస్తూ ఉండేవి. ఈ జంతువులు అన్నీ మనకొరకు పెద్ద-పెద్ద బరువులు మోస్తూ, గొప్ప గొప్ప పనులు చేస్తూ మానవులు చేయజాలని ఎన్నో పనులు చేస్తున్నాయి. ఒకవేళ అవి అన్నీ తమలోని శక్తులను తెలుసుకొని, మానవులకు విరుద్ధంగా నిలబడితే మటుకు, తప్పకుండా అవి మనలను వాహనాలుగా వాడుకొని, మన చేత వాటి పనులను చేయించగలిగేవే. మన మీద సవారి చేయగలిగేవి.

ఏవిధంగానైతే మనకు ఉపయోగపడే జంతువులకు తమ శక్తుల గురించి జ్ఞానం లేదో ఆ విధంగానే మీలోగల శక్తుల గురించి మీకు తెలియుట లేదు. మనమంతా శక్తి హీనులమై, కారు చీకటిలో దారితెలియక తిరుగాడుతున్నాము. వికలాంగుల వలె పడి ఉన్నాము. ఒకవేళ మనలోని దివ్యశక్తుల గురించి జ్ఞానం కలిగి ఉంటే మాత్రం ఈ దుఃఖం, భయం, చింత,

**పిల్లలను వ్యకిత్వపరంగా తీర్చిదిద్దాలి**

ఆపద, శోకం, ద్వేషం మొదలైన దుష్ట మనోవికారాలు మనను ఏ మాత్రం బాధించగలిగేవి కాదు. మన ఆరోగ్యం, మనస్సు, జీవితం మీద వాటి చెడు ప్రభావం పడేదే కాదు. బాధపడ వలసినది ఏమంటే మనం ఇటువంటి దుష్ట వికారాలకు చాలా తేలికగా వశమై మన సర్వనాశనాన్ని మనమే చేచేతులా చేసుకొంటున్నాము. మనం మన భాగ్యాన్ని చెడ్డదిగా భావిస్తున్నందున, మనకు ఈ లోకమంతా మసకబారినట్లుగానే కనిపిస్తూ ఉంది. జీవనం మొత్తం భారమైపోయింది.

అన్నిటికి మించి దౌర్భాగ్యమేమంటే, మనం ఎప్పుడైనా భగవంతుని మీద నమ్మకం ఉంచుకోగలిగామా? ఒకసారి ప్రారబ్ధాన్ని నమ్ముతాము, మరొకసారి పురుషార్థం - పురుషార్థమని గొంతులు చించుకొంటున్నాము. మనం ఎన్నడూ స్థిరంగా ఉండజాలము, మనసు ఎప్పుడూ ఇలాగే డోలాయమాన స్థితిలో ఊగిసలాడుతూ ఉంటుంది. మనం పూజ, పునస్కారాలు చేస్తాం. కానీ అంతలోనే చిత్తం స్థిరం కానందున, ధనం, సంపద లేక సిద్ధి లభించకపోతే విశ్వాసాన్ని పోగొట్టుకొని లేచిపోతాము. వీటన్నింటిని 'ఒట్టి బూటకాలుగా' అనుకొంటాము. మన బలహీనతేమంటే మనమీద మనకే విశ్వాసం లేకపోవటం వలన విలాసవంతమైన జీవితం గడుపుతున్న వారిని చూసి వారంతా ఎంతో అదృష్టవంతులని భావిస్తాము. కాని వారికి ఉన్న బాధలు వారికి ఉంటాయి అది గ్రహించము.

చాలామంది వద్ద గొప్ప సంపద ఉన్నందున వారంతా సుఖంగా జీవిస్తున్నారని, అంత వైభవం ఉన్నదని, గొప్పదనం ఉన్నదని, అధికారమున్నదని, వారి మీద భగవంతుని కృప ఉన్నదని మీరనుకోవచ్చు. మరి మా మీద ఈశ్వరునకు దయ ఎందుకు లేదు? మా వద్ద ఐశ్వర్యంతో కూడిన సాధన-సంపత్తులు లేవు. అవి లేనందున మాకు బాధగా ఉన్నది. కానీ వారి వద్ద అన్ని రకాల సాధన-సంపత్తులున్నందున వారు సుఖంగా ఉంటున్నారు.

ఇదంతా మీ భ్రమ మాత్రమే. ఈశ్వరునకు దీనిలో ఎటువంటి పక్షపాతం లేదు. ఈశ్వరీయ శక్తులు, విపుల బలాలు, మానసిక, శారీరక ఆత్మిక సంపదల ఏ అంశం వారిలో ఉందో, అదే వాస్తవంలో మీలో కూడా ఉన్నది. ఒకటి బాగా గుర్తుంచుకోండి. నిరంతర శ్రమతో, లక్ష్యసిద్ధితో మన భాగ్యం పండుతుంది. ప్రజల యొక్క నిరంతర ఇచ్ఛాసాధన నుండే దేశ ప్రగతి ఉంటుంది. ఇచ్ఛ అనేది ఒక ప్రబల శక్తి, అది తన మార్గాన్ని తానే నిర్మించుకోగలదు. వాస్తవంలో ప్రారబ్ధం లేక అదృష్టం అనేవి ఎలాంటివి లేవని గుర్తించాలి.

ఎక్కడ కార్య-కారణాల ఘనిష్ఠ సంబంధముంటుందో అక్కడ ప్రారబ్ధం లేక అదృష్టం అని అనుకొనుట మూర్ఖత్వం గాక మరేమిటి? ఎవరికి ఆలోచించే విధానం తెలియదో, ఎవరికి ప్రతి సంఘటన వెనుక ఉన్న అసలైన కారణం తెలియదో, ఎవరి జీవనం సదా చంచలంగా ఊగిసలాడుతూ ఉంటుందో అటువంటి వారు తాము కల్పించుకొన్న భూత-ప్రేత, చెడు గ్రహాలకు బానిసలుగానే ఉండిపోతారు.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 57 (3.2) నుండి*
*అనువాదం : జి. చెన్నకేశవరావు*

## ఉపేక్ష

*మహాభారత యుద్ధాన్ని గురించిన ఆహ్వానాన్ని అందుకొని మహాయోధులు, రాజాధిరాజులు, దూరతీరాల నుండి తమ తమ మిత్రుల యొక్క, ఆప్తుల యొక్క పక్షాన యుద్ధం చేయడానికి రావటం మొదలు పెట్టారు. శల్యుడు పాండవులకు మేనమామ కావడం వలన అతడు ఎలాగూ తమ పక్షాన్నే ఉండి పోరాడుతాడని పాండవులు భావించి అతనికి ప్రత్యేకంగా ఆహ్వానాన్ని పంపలేదు. ఈ అవకాశాన్ని అదనుగా చూసుకొని దుర్యోధనుడు శల్యుడు పయనించి వచ్చే దారిపొడుగునా వివిధ సౌకర్యాలను సమకూర్చాడు. అవన్నీ పాండవులు కల్పించినవేనని భావించి శల్యుడు ఆ సౌకర్యాలను స్వీకరించాడు. తరువాత యదార్థం తెలిసి, తాను ఎవరి సౌకర్యాలనైతే అనుభవించాడో వారి పక్షాన ఉండి పోరాడటమే ధర్మమని నిశ్చయించు కున్నాడు. పాండవులు మన 'మేనమామే లే' అనే ఉపేక్షను చూపి ఉండకపోతే అతని అసాధారణ సారథ్యం పోగొట్టుకునే పరిస్థితి వచ్చేది కాదు.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**పిల్లలకు ఏ పరిస్థితిని అయినా ఎదుర్కొనగలిగే మనోధైర్యాన్ని ఇవ్వాలి**

వసంత పంచమి ప్రత్యేకం

# పరమపూజ్య గురుదేవుల స్మృతులు

వసంతపు గాలులు తాకగానే మనస్సు పరమపూజ్య గురుదేవుల స్మృతులతో ఓలలాడుతుంది. గురుదేవులతో కలిసి గడిపిన అనేక వసంతాలు గుర్తుకొస్తున్నాయి. ఆ వసంత స్వరాలన్నీ యథాతథంగా ఉన్నాయి. విలక్షణమైన ఆ వసంతపు రంగులు వెలిసిపోలేదు, చెదిరిపోలేదు. కాలంతో ఇవి చెదిరి పోలేవు, చెదిరిపోవు కూడా. మహాకాలుని వెలుగు, గుర్తింపు కాలంతో చెదరగలవా, వెలిసిపోగలవా? వారి సాన్నిధ్యంలో, స్పర్శతో, వసంతపు ప్రేరణలు పెల్లుబికేవి. వసంతం లాగానే వారు కూడా నిరంతరం వాతావరణాన్ని సంవేదనలతోను ఆసక్తితోను, సాహసోపేత సంకల్పాలతో నింపుతుండేవారు. ఈ యుగం ఆయన్ని మహామానవుడు అంటుంది, సాధువు, ముని, సాధకుడు, సిద్ధ పురుషుడు అనుకుంటోంది.

ఎవరు నమ్మినా నమ్మకపోయినా, ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా, ఎవరి సాయుజ్యం కోసం, ఎవరి సామీప్యంతో మనుషులు మహామానవులవుతారో, అదే వారు అని భావించాం. ఎవరిని పొందడానికి, ఎవరి తత్వం తెలుసుకోవడానికి మనుషులు మునులు, సాధకులవుతారో, అదే వారు. వారిని పొంది, వారిని అనుసరించి, తత్వజ్ఞానులుగా, సిద్ధులుగా అనుభూతి చెందుతారు. ఏ సత్యాన్ని వేదాలు స్తుతిస్తాయో, దాని సాకార స్వరూపమే వారు. ఆ వేదమూర్తి ముఖం నుండి వెలువడే ప్రతి వాక్యం మంత్రోచ్చారణలాగా ఉండేది. కాలం మారింది, ఏళ్ళు గడిచిపోయాయి, కాని సాధకుల మనస్సులలో వారు ఉచ్చరించిన మహామంత్రాల మనన ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది.

అలాంటి ఒక మంత్రానుభూతి సాధకులతో పంచుకోవాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. వసంత ఋతువు ప్రారంభం కాబోయే రోజులవి. 1989 ముగియబోతోంది. పరమపూజ్య గురుదేవులు ఈ భూమి మీద ఇక ఎక్కువ రోజులు ఉండనని సూచించారు. వారి భావచైతన్యంలో అనురాగం మరియు వైరాగ్యాల మహాసాగరాలు తొణికేవి. దేహంతో లేకపోయినా, వారితోనే ఉంటానని అందరితోను, వారి దగ్గరున్న, చాలా దూరాల్లో ఉన్న శిష్యులను, పిల్లలను పిలిచి పిలిచి చెప్పారు. నా వారిని నేనెప్పుడు విడిపోనని ఆశ్వాసన నిచ్చారు. జన్మజన్మల సహచరులు జన్మ జన్మాంతారాలకు సహచరులుగానే ఉంటారు. ఈ మాటలు చెప్పేటప్పుడు వారి కళ్ళు చెమ్మగిల్లేవి, గొంతు అంగలార్చేది.

ఆ క్షణాలింకా గుర్తున్నాయి. కళ్ళు మూసుకుంటే మనసులో ఆ దృశ్యాలే తిరగాడుతుంటాయి. వారి గదిలోని సోఫాలో గురుదేవులు, గౌరవర్ణపు తపోదీప్త ముఖమండలం, తెల్లటి పంచె, సామాన్యమైన ఖాదీ కుర్తా వేసుకుని మనోనేత్రాలకు కనిపిస్తారు. వారి సంభాషణలు ఒకోసారి మండుతున్న అగ్ని గోళాల్లాగా ఉంటే, ఒకోసారి సంవేదన నిండిన చల్లటి చిరుజల్లులలాగా ఉండేవి. వారితో గడిపిన క్షణాలు నిజంగా చాలా ప్రత్యేకంగా ఉండేవి. వారిలో ప్రేమ– కోపం; కారుణ్యం– కఠోరత్వం, అనురాగం– వైరాగ్యం అన్నీ కలిసి కనిపించేవి.

ఆ రోజుల్లో జరిగిన గోష్ఠుల్లో ఒక రోజు ఉదయం, "ఆధ్యాత్మిక జీవన మార్గంలో ముందుకు కొనసాగడం, కొనసాగుతూనే ఉండడం చాలా ధైర్యవంతుల పని. మాటలు చాలా చెప్తారు, కాని చేయవలసిన సమయం వచ్చినప్పుడు ఏవో సాకులు చెప్పి నాటకాలాడుతుంటారు." అని చెప్పి ఆగారు. ఈ మధ్యలో వారి ముఖం గంభీరంగా మారింది, తీక్షణమైన స్వరంలో చెప్పుకొచ్చారు, "భగవంతుడు నీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాడు, కాని నీ అహం ఆయన్ని లోపలికి రానిస్తేగా!" అగ్ని కణాల్లాంటి ఆయన మాటల్లో, ఈ క్షణం కూడా వారి తపన యొక్క అనుభూతి కలుగుతోంది, కానీ వేళ్ళు కలాన్ని పట్టుకుని తన ఆరాధ్యుని కథ చెప్తోంది. ఈ మాట పూర్తవ్వగానే వారి ముఖంలో భావాలు మారిపోయాయి. వారి అంతస్సులోని కరుణ కళ్ళనీళ్ళులా కారసాగాయి. కరుణ నిండిన గొంతుతో చెప్పసాగారు, "మీరంతా నా పిల్లలు. నేను మీ అందరిని చాలా చాలా ప్రేమిస్తాను. మీలో ఎవరి మానవ జన్మ కూడా అనవసరంగా నాశనమవ్వడం నాకిష్టం లేదు. నేను చేరుకున్న చోటికి మీరంతా చేరుకోవాలని కోరుకుంటున్నది.

**విశ్వాసమే భగవంతుడు**

కొన్ని జన్మలగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ నిలిచిపోకూడదు, ఏ ఒక్కరూ తప్పిపోకూడదు.

ఆయన మాటల్లో పొంగే అంతర్వేదన ఒక మహాసాగరం, దాన్ని మామూలు మాటల కడవలో నింపడం సాధ్యం కానే కాదు. దానిని అనుభూతి చెందడమే వీలవుతుంది. ఆ రోజు ఆ దృశ్యాన్ని చూసిన కళ్ళకు మాటలు రావు. మాట్లాడగలిగే వాక్కు ఆ క్షణం మూగబోయింది. ఆ రోజుల్లో ఆయన పనులన్నిటిని మునుపటికంటే చాలా త్వరగా చక్కబెట్టడం మొదలుపెట్టారు. యదార్థం ఏమిటి అనేది చూసేవాళ్ళ మనస్సుకు అర్థం కాకపోయినా సూక్ష్మంగా మాత్రం ప్రత్యేక స్పందనలు కలిగేవి. అప్పటి వారి భావ భంగిమలు మరువ లేనివి.

మనసు మంత్రాన్ని మననం చేస్తున్నట్టు, అప్పటి ఒక సంవాదం ఇప్పటికీ నెమరువేసుకుంటాం. 1989 డిసెంబరు నెల మధ్యాహ్నం 3 గంటల ప్రాంతం: పరమపూజ్య గురుదేవులు వారి గది వెనక వాకిట్లో నవారు మంచంపై నడుం వాల్చారు. వారి ముందు పరిచిన చాప మీద కొంతమంది కూర్చున్నారు. 21వ శతాబ్దంలో, అంటే ఇప్పుడు అఖండజ్యోతిలో ప్రచురించ వలసిన విషయాల గురించి చర్చిస్తున్నారు. ఆ చర్చ మధ్యలోనే ఆధ్యాత్మిక విషయాల ప్రసంగం మొదలైంది.

వెంటనే గంభీరంగా మారిపోయారు. అప్పటి వరకు నడుం వాల్చి మాట్లాడుతున్న వారు ఠక్కున్న లేచి పచార్లు చేయడం మొదలుపెట్టారు. అక్కడున్నవారు ఒక్క సారిగా అప్రమత్తంగా వినసాగారు, కాని ఆయన తమలో తామే మునిగిపోయారు. ఐదు, ఆరు నిమిషాలు పచార్లు చేసి మళ్ళీ కూర్చుని తమ కుడి చేతితో తమ ఎడమ చేతిని పట్టుకుని మాట్లాడారు, "మాయ అంటే ఏంటో తెలుసా? భ్రమ ఎక్కడ్నుండి పుడుతుందో తెలుసుకుంటారా? వాసనలు ఎక్కడ నివసిస్తాయో తెలుసుకుంటావా? అయితే విను! అన్నీ ఈ పావు మిల్లీమీటరు చర్మం గొప్పతనం. ఇదే మాయ, ఇదే భ్రమల నిలయం, ఇందులోనే వాసనల విషం ఉన్నది."

ఆ క్షణంలో ప్రగాఢ వైరాగ్యం ఆయన ముఖంలో వెలిసింది, మాటల్లో చెప్పనలది కాదు. ఆగకుండా చెప్తూనే ఉన్నారు, "మాయ వంచించాలి అనుకున్నప్పుడు, చైతన్యాన్ని వాసనల విషం కాటేయాలనుకున్నప్పుడు, భ్రమ ఆలోచనలను పక్కదోవపట్టించాలనుకున్నప్పుడు, అప్పుడు ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ముందు మిమ్మల్ని మీరు, మీ శరీరం యొక్క ఈ పావు మిల్లీ మీటరు చర్మాన్ని ఒలుచుకుని చూడండి, మీరు ఎలా కనిపిస్తున్నారో అనుభవించండి. మాయ అంతా క్షణంలో పటాపంచలవుతుంది. మీ ముందున్న వ్యక్తిని గురించి కూడా ఇదే విధంగా ఊహించుకోండి, వాసనలన్నీ వెన్నుచూపుతాయి. ఆలోచన, చైతన్యాల నిర్మలత్వం తిరిగొస్తుంది." వారి మాటలు ఇప్పటికీ చెవుల్లో మారుమ్రోగుతున్నాయనే అనిపిస్తుంది. ఈ మాటల్ని ఒక మహామంత్రంలాగా ఎప్పటికీ మననం చేసుకుంటూనే ఉండాలి. ఇలా చేస్తున్నవాళ్ళు, చేసేవాళ్ళు, సాధనతో సిద్ధిని పొందే మార్గం నుండి ఎప్పటికీ తప్పుకోరు. వారికి తమ అంతఃచైతన్యంలో వసంతపు వెలుగులు వెదజల్లే పరమపూజ్య గురుదేవుల భావదర్శనం తప్పక లభిస్తుంది.

– *అఖండజ్యోతి, ఫిబ్రవరి 2008*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## తలుపులు తెరవండి

*ఏసుక్రీస్తు ప్రజలతో "నాయనలారా! అతిశీతలమైన జలాన్ని తెచ్చి మీకు మరల మరల దాహం వేయక శాశ్వతంగా తృప్తి కలిగేటట్లుగా మీ దాహాన్ని నేను తీరుస్తాను. కానీ ఈ శీతల జలాన్ని నేను ఎక్కడో బయట నుండి తీసుకొని వస్తానని భావించకండి. ఈ జలాన్ని ఉద్భవింప జేసే మీలో ఉన్న స్థానానికి మీరు బిగించిన తలుపులను నేను తెరుస్తాను అంతే. మీరు నాకు ఆ అవకాశాన్ని ఇవ్వడానికి ముందుకు రండి. ఒక్కసారి ఆ తలుపు తెరవనిస్తే చాలు. ఆ పవిత్ర ప్రవాహం మరుక్షణం మీకు అందుబాటులో ఉంటుంది." "మీలో దాగి ఉన్న పరమాత్మను గుర్తించి ఆయన కోరికననుసరించి, జీవించటం ప్రారంభించిన మరు క్షణం నుండి మీకు శత్రువు అనేవాడే ఉండదు. ఆ స్థితిని పొందటానికి అర్హతలేని వాడంటూలేదు. మీరందరు సమర్థులే" అని బోధిస్తూ ఉండేవాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఏదైనా సరే మన నమ్మకాన్ని బట్టే ఉంటుంది**

సమాజ నిర్మాణం

# వివాహములలో దుబారా ఆపండి

మన దేశములో ఉన్న దురాచారములు, ఆచార-వ్యవహారములు, మూఢనమ్మకములలో ఆర్థిక, సామాజిక మరియు నైతికపరమైన దృష్టితో చూసినప్పుడు అత్యంత హానికరమైనది ఏది? దీనికి సమాధానమును వెతుకుతున్నప్పుడు సహజముగానే వివాహములలో వృథాగా అయ్యే ఖర్చు వైపు మన దృష్టి సారించబడుతుంది. ఈ రీతిగా ఎన్నెన్నో దురాచారములు సమాజమును డొల్లగా మార్చి వేస్తున్నాయి, అయితే వీటన్నింటిలోకి హానికరమైనవి వివాహాలలో కనబడే దురాచారములు.

ఆర్థికపరముగా పెళ్ళిళ్ళల్లో కనబడే దురాచారములను గురించి విశ్లేషణ చేసినప్పుడు మంగళమయమైన ఈ సందర్భములో ఏ కుటుంబానికైనా వృథాగా ఖర్చు చేసే పరిస్థితులే అధికముగా తలెత్తుతాయి అని కనిపిస్తుంది. జీవన నిర్వహణకు డబ్బే సర్వస్వము కాదు అన్నది తప్పకుండా ఒక ఆదర్శవంతమైన అభిప్రాయమే. అయితే ఈ ధనానికే విలువనిచ్చే ఈ యుగములో కూడా వ్యక్తి, కుటుంబము, సమాజము మరియు దేశముల జీవన వ్యవస్థకు ఆధారము అనివార్య రూపములో డబ్బుతోనే జోడింపబడి ఉన్నది అన్న తథ్యమును తిరస్కరించలేము. మెరుగైన ఆర్థిక పరిస్థితులుంటే కనుక జీవన నిర్వహణ, అభివృద్ధిల వ్యవస్థ సముచిత రీతిలో పూర్తవుతూనే ఉంటుంది. కానీ తప్పటడుగులు వేయటము చేత ఆ వ్యవస్థ పాడయితే సమస్యలు ఎదురవుతాయి. అసాధారణమైన మహోన్నత ఆదర్శపురుషులు సంక్లిష్ట పరిస్థితులలో కూడా తమ ఆదర్శములను అంటిపెట్టుకునే ఉంటారు. తమ మానసిక స్థితిని దృఢముగా ఉంచుకుంటారు. కానీ సామాన్యవ్యక్తులు ఇలా ఉండలేరు. ఆర్థికంగా స్థిరపడి ఉండటమనేది వారి సంతులనమైన జీవితానికి అనివార్యమై ఉంటుంది. నేటి వైవాహిక ఆచార-వ్యవహారములలో ఈ ఆధారపు పునాది ఒకరకముగా బీటలువారుతున్నది. అపవ్యయము కారణముగా దీర్ఘకాలము కొనసాగే దారిద్ర్యంగా పరిణమిస్తుంది. కాలక్రమములో క్రమక్రమముగా వ్యక్తుల యొక్క దారిద్ర్యము సమాజమును, దేశమును బలహీనపరుస్తుంది.

ప్రస్తుతం భారతదేశ జనాభా 100 కోట్లు దాటింది. కోట్లాది కుటుంబాలలో ప్రతి సంవత్సరము లక్షలాది వివాహములు జరుగుతూనే ఉంటాయి. ఇరు పక్షములవారు తమ స్థాయిని మించే పెళ్ళి ఖర్చులు పెడుతున్నారు. కొందరు కోట్లాది రూపాయలను నీళ్ళవలె ఖర్చుపెడుతున్నారు. అలంకరణకు, మేళగాళ్ళకు, ఇచ్చిపుచ్చుకునే రీతిరివాజులకు, పూజా ద్రవ్యములకు, కానుకలకు, బహుమతులకు అయ్యే ఖర్చు లక్షలు దాటుతున్నది. వివాహమనే హోళీమంటల్లో విపుల ధనరాశిని ఆహుతిచేస్తున్నారు.

వివాహము అనేది రెండు ఆత్మలు ఏకమయ్యే పునీతమైన, పవిత్రమైన సందర్భము అన్నది సునిశ్చిత అంశము. ఈ కర్మకాండ మొత్తమంతా ధార్మికవిధి ఆధారముగా సమాజ వాతావరణములో తనకున్న ఆత్మీయబంధుజనుల సమక్షములో నిరాడంబరముగా జరుపుకొనుట ఉచితము, ఆవశ్యకము కూడా. వాతావరణమంతా కూడా అపరిమితమైన ధార్మిక, ఆధ్యాత్మిక భావనలతో నిండి ఉండేటట్లు చూడుటయే శ్రేయస్కరం. అయితే ధన దురుపయోగమనే దురాచార ప్రదర్శన వివాహవ్యవస్థ గౌరవమును దిగజారుస్తుంది. ఇది అన్ని విధాలా హానికరమైనదే. వివాహమనే ధార్మిక కర్మకాండతో రెండు ఆత్మలు ఏకమై సామాజికమైన, అలాగే జీవన లక్ష్యమును ప్రాప్తింప జేసుకొనుటకు కటిబద్ధమౌతాయి. దానికొరకు ఆడంబర ప్రదర్శన చేయవలసిన అవసరము లేదు.

ఇతర దేశములలో కూడా వివాహములు జరుగుతుంటాయి. అయితే అవి సామాన్యమైన రీతిలోనే పూర్తవుతాయి. ఒక చిన్న సమావేశములో అమలులో ఉన్న కర్మకాండలను అనుసరించి 10, 15 మంది ఆత్మీయుల సమక్షములో

**మనలో తగినంత శక్తి ఉన్నదని గ్రహించడమే విజయానికి తొలిమెట్టు**

వధూవరులు ప్రతిజ్ఞలను చేసి దాంపత్యజీవితములోకి అడుగు పెడతారు. నిరాడంబర వాతావరణములో సామాన్యశైలిలో జరిగే పెళ్ళి ఇటు తల్లిదండ్రులకు కానీ అటు నూతన వధూవరులకు గానీ ఆర్థికపరమైన భారమును నెత్తిన మోపదు, డబ్బు వృథాగా ఖర్చవ్వదు. మన దేశములో పరిస్థితి భిన్నమైనది. పెళ్ళిలో అంతులేని ధనమును వెచ్చించడము అనేది ఇక్కడ ప్రతిష్ఠకు సంబంధించిన విషయముగా భావిస్తారు. తమ ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేనప్పటికి ఎంతోమంది వ్యక్తులు అప్పుచేసి, విలువైన వస్తువులను తాకట్టుపెట్టి లేదా ఉన్నవాటిని అమ్మి పెళ్ళిళ్ళలో ఖర్చు చేస్తున్నారు. ఈ పద్ధతిని ఆపివేయ వలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

స్వాతంత్ర్యము వచ్చి 70 సంవత్సరములు దాటింది. అనేకానేక కార్యక్రమములు దేశములో అమలుచేసినప్పటికీ ప్రతివ్యక్తి జీవననిర్వహణకు ఆవశ్యకమైన సాధనాలను సమకూర్చగలిగే పరిస్థితి ఏర్పడలేదు. ఇంకా ఎంతోమంది నిరుపేదలున్నారు. వారంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే. వారికి ఒక్కపూట ఒకరొట్టె దొరకటమే కష్టముగా ఉంది. లక్షల సంఖ్యలో విద్యలేనివారున్నారు. అవిద్య కారణముగా వారు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు, మరి అలాంటి స్థితిలో వివాహాలలో కోట్లాది రూపాయలను ఆహుతి చెయ్యటము సబబేనా? వివేకసమ్మతమేనా? ప్రతి సంవత్సరము వివాహము లలో అయ్యే ఖర్చు మన దేశ వార్షిక బడ్జెట్‌ను మించి ఉన్నది. ఇలా వృథా అయ్యే డబ్బును జమచేసి దానిని చిరు–ఉద్యోగాల పథకము క్రింద వ్యయము చేస్తే కొద్ది సంవత్సరములలోనే దేశములో నిరుద్యోగమనే సమస్య తుడిచిపెట్టుకుపోతుంది.

పెళ్ళిళ్ళలో పెట్టే దుబారాఖర్చును ఒకవేళ వ్యక్తిగతమైన ప్రయోజనాలలో వెచ్చిస్తే ఆదాయము వచ్చే ఒక వసతిని ఏర్పరచుకొనవచ్చును. **ఆడ–మగ పెళ్ళివారు దుబారా చేసే డబ్బును నూతనదంపతుల పేరుమీద బ్యాంక్‌లో జమచేస్తే అది కొద్ది సంవత్సరములలోనే అధిక మొత్తముగా చేతికంది వారి అవసరములను తీరుస్తుంది.** అంతేకాకుండా జమచేసిన డబ్బును క్రొత్త జంట తమకు ఆదాయము వచ్చే దిశలో వెచ్చిస్తే వారి జీవితము ఒక గాడిన పడుతుంది. అసలు మొత్తమును తియ్యకుండా వడ్డీమీద వచ్చే డబ్బుతో జీవితమును సాగించ వచ్చును. అసలు మొత్తము తరతరాలవారి అవసరమును తీరుస్తుంటుంది.

ఇప్పటివరకు వివాహమనే ఉన్మాదములో దుబారాగా ఖర్చయ్యే డబ్బును గురించి విశ్లేషణ చెయ్యటము జరిగినది. ఇక ఇప్పుడు అపవ్యయమయ్యే డబ్బు వలన సామాజిక, నైతిక పరముగా జరిగే కీడును, హానిని గురించి చిట్టావిప్పి నిజాలు తెలుసుకుంటే కనుక 'ఈ దురాచారము భారత సమాజమును నిర్వీర్యము చేయుటలో పెద్ద పాత్రనే పోషించినది' అని తెలుస్తుంది. ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తారు. అనేక మందికి ఖర్చుపెట్టగలిగే ఆర్థికపరిస్థితి ఉండదు. పైగా లోలోపల ఈ దురాచారమును ఎదిరించే మనోస్థితి ఉండదు. ధనార్జనకు అనీతి, అధర్మములే వారి ముందున్న మార్గములు. ఉద్యోగస్థులలో లంచగొండితనం పెచ్చరిల్లటానికి ఒక కారణము ఇటువంటి ఖర్చులే.

వివాహాది శుభకార్యములలో పెట్టే దుబారాఖర్చు అన్న ఒకే ఒక్క పెద్ద కారణము చేత భారతదేశములోని సమాజము లేమి, దారిద్ర్యములనే రోగముల బారినపడి విలవిలా కొట్టుకుంటున్నది. ఇది కేవలము వ్యక్తిపరమైన దారిద్ర్యమును, దీనత్వమును కలుగ చేయటమే కాదు, సమాజము అనైతికత్వము, భ్రష్టాచారము, అవ్యవస్థల పాలవుతున్నది. దీనిని సామూహికముగా విరోధించవలసిన సమయము ఆసన్నమైనది. అవగాహన కల్పించినప్పటికీ దుబారా ఖర్చు ఆగని చోట్లకు స్వయముగా మనము వెళ్ళకుండా ఉండటమే కాదు, మన దగ్గరివారిని కూడా వెళ్ళకుండా నిరోధించాలి. అపవ్యయము అన్నది ప్రతిష్ఠను పెంచదు, అది అప్రతిష్ఠకు మారుపేరు అన్న జ్ఞానమును కేవలము కొద్దిమందిలో కలిగించినంత మాత్రమున లోక ప్రవాహమును దారి మళ్ళించుట సాధ్యము కాదు. అయితే సమాజమును నిర్వీర్యము గావించే ఈ దురాచారమును అందరు వ్యతిరేకించి నచో దానిని దూరముగా పారద్రోలుట అసంభవము కాదు.

*– అఖండజ్యోతి, జనవరి 1981*

*అనువాదం: శ్రీమతి లక్ష్మిరాజగోపాలు*

**మనుష్యులు తామెలా ఉన్నామని నమ్ముతారో అలాగే పరిణమిస్తారు**

రంగుల విజ్ఞానం

# మనస్సును ఆహ్లాదపరచే రంగుల ప్రపంచము

రంగులలో అపారమైన ఆకర్షణ ఉంటుంది. అవి సహజముగానే మన మనస్సును తమవైపు ఆకర్షించుకుంటాయి. ప్రకృతిలో అణువణువునా రంగులు వెదజల్లబడి ఉంటాయి. నీలాకాశములో వ్యాపించే ఇంద్రధనుస్సు మనస్సును పరవశింప చేస్తుంది. శ్రావణమాసంలో నేలమీద పరచుకున్నట్లుండే ఆకుపచ్చని తివాచిలాంటి గడ్డి ఎవరో చిత్రకారుడు చిత్రించిన అద్భుతమైన దృశ్యంలాగా అనిపిస్తుంది. స్వచ్ఛమైన ధవళ కాంతితో వెండిలాగా మెరిసిపోయే హిమాలయశిఖరాలు, వాటి నుండి పాలవలె తెల్లని నురగలతో క్రిందకు దుమికే జలపాతాలు మనస్సును ఆహ్లాదపరచకుండా ఉండవు. ప్రకృతిలోని ఈ రంగులు ఎంత మనోహరమైనవి, ఎంత విలక్షణమైనవి! **మనోహరమైన ఈ రంగుల కాంతి మన కళ్ళను తృప్తిపరచటమే కాదు, ఆరోగ్యముపైనా, మనస్సుపైనాకూడా తమ ప్రభావాన్ని చూపిస్తుంది.**

ఆకర్షణకు కేంద్రబిందువైన ఈ రంగులు ఏమిటి? ప్రతివారు తమదైన శైలిలో వీనిని నిర్వచిస్తుంటారు. మనస్తత్వ శాస్త్రజ్ఞులు వీనిని మనస్సును ప్రభావితము చేసేవానిగా పేర్కొంటే, శాస్త్రజ్ఞులు అసలు వీటియొక్క ఉనికినే వ్యతిరేకిస్తూ, 'వాస్తవానికి అసలు 'రంగు' అనే ప్రత్యేకమైన పదార్థమేమీ లేదు' అని చెప్తుంటారు. ప్రకాశతరంగముల యొక్క పరిమాణంలో హెచ్చుతగ్గుల వల్ల అవి మన కళ్ళకు రంగులుగా కనపడుతున్నాయని వారి వాదన. ఏది ఏమైనా రంగులనేవి ఏడు రకాలుగా ఉంటాయి. వాటిలో ఎరుపు, ఆకుపచ్చ, నీలము ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చు.

ఏ పదార్థమైనా ఈ సప్తవర్ణాలలోని రంగులను పీల్చుకొనగా మిగిలిన రంగు ఏదైతే ఉంటుందో అదే ఆ పదార్థము యొక్క రంగుగా కనబడుతుంది అని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఆకుపచ్చరంగును శోషింపజేసుకొనలేక దానిని పరావర్తనము చేస్తుంది కాబట్టి అది ఆకుపచ్చరంగుగా మనకు కనిపిస్తుంది. అదేవిధంగా నీలంరంగు నీలమును, ఎరుపురంగు ఎరుపును పరావర్తనము చెందిస్తాయి. తెలుపురంగు అన్ని రంగులను ఒక్కసారే పరావర్తనము చెందింపజేస్తుంది. అలాగే నలుపురంగు అన్ని రంగులను తనలో అవశోషింపజేసుకుంటుంది. ఆకాశము నీలం రంగులో ఉంటుంది, సముద్రము నీలము రంగులోను, ఆకుపచ్చ రంగులోను కూడా కనిపించటానికి వెనుక ఇదే మూలసిద్ధాంతము పనిచేస్తుంటుంది.

చిత్రకారుడు తన కుంచెతో రెండు విభిన్న రంగులను మిశ్రితము చేసి ఒక క్రొత్త రంగుకు జన్మనిచ్చినట్లుగా, ప్రకృతి కూడా మూలరంగులను విభిన్న రీతులతో సమ్మిశ్రితము చేసి విచిత్రమైన క్రొత్త క్రొత్త రంగులను అద్భుతముగా సృష్టిస్తుంది. పృథ్వి పంచతత్వములతో నిర్మితమైనది కాబట్టి ఈ పంచ తత్వాలకు తమదైన విశిష్టరంగులున్నాయి. పృథ్వీతత్వము పసుపురంగు, జలతత్వము తెలుపు, అగ్ని ఎరుపురంగు, వాయువు. ఆకుపచ్చ, ఆకాశతత్వమునకు నీలిరంగు ఏ తత్వాన్ని ధ్యానం చేసినట్లయితే ఆ రంగు మెరుస్తూ కనిపిస్తుంది. తీవ్రమైన ధ్యానస్థితిలో ఈ రంగులను చూడగలము.

ఈ విరాట్ ప్రపంచములో ఉన్న రంగులన్నీ, మానవ శరీరములోని పంచకోశములు, షట్చక్రములలో కూడా ఉన్నాయి. మానవ శరీరములో ఉన్న షట్చక్రములు, బ్రహ్మనాడీ మార్గములో అవస్థితమై ఉన్నాయి. ఈ చక్రగ్రంథులలో ఉన్న విశిష్టతత్వములకు అనుగుణముగా ఈ చక్రముల రంగులు కూడా చాలా అద్భుతమైన రీతిలో ఉంటాయి. ఏ గ్రంథి ఏ తత్వము యొక్క ప్రాధాన్యత కలిగి ఉంటుందో, ఆ రంగులోనే దృగ్గోచరమవుతుంది. ఈవిధంగా మూలాధారచక్రము ఎరుపు రంగులోను, స్వాధిష్ఠానము సింధూరవర్ణములోను, మణిపూరక చక్రము నీలిరంగులోను ఉంటాయి. ఇక అనాహతచక్రము యొక్క రంగు అరుణం, విశుద్ధిచక్రము రంగు ధూమ్రవర్ణము, ఆజ్ఞాచక్రము శ్వేతవర్ణములోను ఉంటాయి.

భౌతిక, ఆంతరిక జగత్తులు రెండింటిలోను రంగులయొక్క అపూర్వ దర్శనమును మనము తిలకించగలము. భౌతిక జగత్తులో సూర్యుడిని రంగుల ఉద్భవస్థానంగా భావించవచ్చు. సౌరకుటుంబములోని వివిధగ్రహ, ఉపగ్రహాలకు కూడా వేర్వేరు రంగులున్నాయి. చంద్రుడు తెల్లని రంగులో ఉంటే, మంగళ

**ఒక పని చేయలేమని నమ్మితే ఆ పని నిజంగానే అసాధ్యమవుతుంది**

గ్రహము ఎరుపురంగులో, బుధుడు ఆకుపచ్చరంగులో ప్రకాశిస్తుంటారు. సప్తవర్ణ శోభితమైన ఈ ప్రపంచము యొక్క సుందరరూపమును కన్నుల ద్వారానే చూడగలము. అయితే ఇది నూటికి నూరుపాళ్ళు సత్యముకాదు. మనోనేత్రం ద్వారా కూడా భగవంతుని ఐశ్వర్యవిభూతులను దర్శించగలము. కావలసినదల్లా ఆంతరిక దృష్టిని వికసింపజేసుకొనగలగటమే. ఈ సందర్భముగా అంధురాలైన ఒక రష్యన్ మహిళ 'ఓంకార మంత్రము ఒక వైజ్ఞానిక అన్వేషణ' అనే పుస్తకములో రంగులను స్పృశించటముతోనే వాటివలన ఉత్పన్నమయ్యే భావాలను అనుభూతి చెందగలుగుతున్నానని ప్రతిపాదించినది. రంగును స్పృశించిన కొద్దిసేపటి తరువాత ఆమె ఆ రంగు ఏమిటో గుర్తించి చెప్పగలిగేది. ఎరుపురంగును తాకినప్పుడు ఆమెకు వేడిగా అనిపించేది, ఆకుపచ్చరంగును తాకినప్పుడు సంతోషమును అనుభూతి చెందగలుగుతున్నానని చెప్పేది. నీలిరంగును తాకుతూనే 'వ్యాపకత్వమును' ఆమె అనుభూతి చెందగలిగేది. ఈవిధంగా రంగుల విషయమై తన అనుభూతిని వివరిస్తూ 'భావనలను వికసింపజేసుకుని కేవలము కన్నులద్వారా చూడకుండానే, రంగులను గుర్తించడము సాధ్యమే!' అని ఆమె ప్రతిపాదించినది. బహుశా ఇది సాధ్యమే కాబోలు. అందుచేతనే సూరదాసు మహాకవి తన ఆలోచనలను మరింత వికసింప జేసుకొని బాలకృష్ణుని సుందరరూపురేఖా విలాసాలను వర్ణించ గలిగాడు.

ప్రతిఒక్క రంగుకు తనదైన ప్రత్యేకత, విశేషతలు ఉంటాయి. ఎరుపురంగులో వేడిమి, ఉష్ణత, ఉత్తేజన, కాఠిన్యం, తేజస్సు, ప్రభావశీలత, కాంతి, స్ఫూర్తి మొదలైన గుణములతో పాటు ఈర్ష్యా-ద్వేషాలు, కాముకత్వము కూడా ఇమిడి ఉన్నాయి. నీలంరంగులో ఆలోచన, బుద్ధిసూక్ష్మత, విస్తారము, సాత్వికత, ప్రేరణ మొదలైన లక్షణాలుంటాయి. మానవాళిని అంతటినీ ఆకర్షించి సమ్మోహితులను గావించగలిగిన శ్రీకృష్ణభగవానుని రూపము నీలంగా ఉండేదని భావించబడేది. నీలిరంగులో వ్యాపకత్వము, విస్తారము అధికంగా ఉండటము వల్ల ఆ రంగు వేసిన ఇల్లు చాలా విశాలంగా అనిపిస్తుంది. అదే ఎరుపురంగు వేసిన గదిని గమనిస్తే ఇరుకుగా ఉన్నట్లు అనుభూతి చెందుతాము. చంచలత్వం, బుద్ధిచాపల్యం, కల్పన, స్వప్నశీలత, నొప్పి, మూర్ఖత్వం, వినోదం, అభివృద్ధితత్వం మొదలైనవన్నీ ఆకుపచ్చరంగులో ఉండే ప్రత్యేక లక్షణములు. పసుపురంగుకు క్షమ, ఔన్నత్యము, గంభీరత, స్థిరత్వము, వైభవం మొదలైన లక్షణములు కలవు. పృథ్వీతత్వమునకు పసుపురంగు ఉండటము వల్ల ఇందులో ఉత్పాదకశక్తి ఉంటుంది. భూదేవి యొక్క ఓర్పు, స్థిరత్వము కూడా ఈ రంగు యొక్క ప్రత్యేకతలే. శాంతి, రసికత్వము, కోమలత్వము-తెలుపురంగు యొక్క ప్రత్యేకతలు. నీరు తెల్లగా ఉండటము వల్లనే శాంతి, కోమలత్వము, తృప్తికి చిహ్నంగా భావించబడుతున్నది.

రంగులకు ఉన్న ఈ ప్రభావము యొక్క ఆధారముతోనే ఈనాడు 'రంగులతో చికిత్స' ఆవిర్భవించినది. పాశ్చాత్య దేశాలలో ఇది కొంతవరకు జనాకర్షకమైనదికూడా! మన దేశములో కూడా ఇప్పుడిప్పుడే ఇది ప్రాచుర్యములోకి వస్తున్నది. దీనిలో భాగంగా వ్యాధులకు చికిత్స చేయటానికి గాను కొన్ని విశిష్టమైన రంగులను, కొన్ని రంగుల మిశ్రమాలను ప్రయోగించి చూడటము జరుగుతున్నది. రంగులయొక్క ప్రత్యేకతలను అనుసరించి, రోగులను చూడటము, పరీక్షించడం జరుగుతున్నది. అందులో కొంతవరకు సాఫల్యమును సాధించడమైనది కూడా!

ఎరుపురంగు వేడిమికి సంకేతము, కాబట్టి ఉదాసీనత, నిరాశ వంటి మనోవ్యాధుల చికిత్సకు ఉపయోగించబడుతుంది. గాయము, నొప్పి తగిలినప్పుడు ఈ రంగును ఉపయోగించడము లాభదాయకము. యౌవన సంక్రమణ రోగాలకు కూడా ఇది ప్రభావవంతమైన చికిత్సనందిస్తుంది. నీటితో నింపిన ఎరుపు సీసాను రెండురోజులపాటు ఎండలో ఉంచి, ఆ నీటిని త్రాగినట్లయితే రక్తమును కూడా తారుమారు చేయవచ్చునంటే దీనియొక్క వేడిమి ఎంత అధికంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. నారింజపండురంగు కూడా ఉష్ణప్రకృతికి సంబంధించినదే. వివిధరకాలైన నొప్పులకు చికిత్స చేయడంలో దీనిని ఉపయోగిస్తారు. ఎరుపురంగు ప్రభావము హృదయము మీద అధికంగా ఉంటుంది. దీనివల్ల మానసిక ధైర్యము పెరిగి, దౌర్బల్యం తొలగిపోతుంది. ఆందోళన, ఉదాసీనత, ఉన్మాదము మొదలైన మానసిక వికారములను తొలగించటానికి ఈ రంగును ప్రయోగిస్తారు. ఆకుపచ్చరంగు దృష్టిని వృద్ధిచేస్తుంది. దీనివల్ల కళ్ళకు మంచి విశ్రాంతి లభిస్తుంది. ఇది శాంతిని, సుఖమును ప్రసాదిస్తుంది. గాయాలు, వ్రణాలు మొదలైనవాటికి ఇది 'మలాము పట్టీ' వలె పనిచేస్తుంది. విరేచనాలకు ఇది దివ్యౌషధము.

**ఆత్మ విశ్వాసం అద్భుత ప్రేరణ ఇస్తుంది**

నీలంరంగు నొప్పి, దురదలను తగ్గిస్తుందని నిపుణుల అభిప్రాయము. పొట్టకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేయటానికి ఆకాశపురంగు ఉపయోగించబడుతుంది. అజీర్ణంతో బాధపడే వ్యక్తులు ఈ రంగును ఉపయోగించడము ద్వారా జీర్ణవ్యవస్థ కొంతవరకు మెరుగుపడుతుంది. క్షయవ్యాధి చికిత్సలో కూడా ఇది మంచి లాభదాయకమైన ఫలితాలను ఇస్తుంది. వంగపండురంగు ఆయాసము, వాపులు, నిద్రలేమి మొదలైన వ్యాధుల చికిత్సకు అధికంగా ఉపయోగపడుతుంది.

ఈ ప్రకారముగా రంగుల ద్వారా శారీరక, మానసిక రోగాల నివారణలో తగినంత సహాయము లభిస్తున్నది. అయితే జీవితంలో ధ్యానసాధనలు అలవరచుకొనగలిగితే ఈ రంగుల ప్రాముఖ్యత ఇంకా వృద్ధిచెందుతుంది. సాధన అనే రంగు ద్వారా కాంతులీనే జీవితమే సార్థక్యమైనది, సఫలమైనది. సాధువులు, సన్యాసులు, మహాపురుషులైనవారి జీవితాలలో భగవద్భక్తి అనే రంగు ఇనుమడించడము వల్ల వారికి సర్వేసర్వత్రా ఆ భగవంతుని రూపమే కనపడుతుంటుంది. మీరాబాయి కృష్ణుని రంగు రూపురేఖలలో ఎంతగా మిళితమైపోయినదంటే, ఆమెకు ఆ నీలమేఘశ్యాముని రంగు ఒక్కటే కనపడుతూ, అన్ని రంగులు ఆ రంగులానే కనపడుతుండేవి. మనంకూడా మనల్ని మనము మనకు ఇష్టమైన ఎప్పటికి మాసిపోని రంగులో అమర్చుకోవాలి. అటువంటి అద్భుతమైన రంగు శ్రేష్ఠమైనది, దాని ఆకర్షణ అపారమైనది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2002*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## నాలుక అదుపు తప్పితే కష్ట-నష్టాలే

*ఒక ముసలి బాటసారి పగలంతా నడిచి సాయంకాలానికి ఒక ఊరు చేరుకొని ఆ రాత్రి గడిపేందుకు స్థలం వెదుకుతున్నాడు. ఒక మహిళకు దయకలిగి తమ పశువుల కొట్టంలోని చెట్టు క్రింద ఉండటానికి స్థానం చూపింది. ముదుసలి ఆనందించి విశ్రాంతిగా మంచి నిద్రపోయాడు.*

*బడలిక తీరి ఉదయమే బయలుదేరే ముందు కాస్త కిచిడీ వండుకొని తిని బయలుదేరితే బాగా ఉంటుందనుకొని అందుకు కావలసిన కట్టెలు సేకరించుకొని, ఆ ఇంటి ఇల్లాలు నడిగి ఒక పాత్రను తీసుకొని అందులో కిచిడీని తయారుచేసుకోవటంలో నిమగ్నమయ్యాడు. ఇంటి ఇల్లాలు తన పని పాటలలో నిమ్నగమైంది. అంతలో ఆ ముసలిబాటసారి ఆమెను ఒక ప్రశ్న వేశాడు. ఈ పశువులశాల గుమ్మం చాలా ఇరుకుగా వెడల్పు తక్కువగా ఉంది కదా, ఎదురుగా కనిపిస్తున్న మీ పెద్ద గేదె మరణిస్తే దాన్ని బయటకు తీసుకురావడం ఇబ్బంది  కాదా?" అని అన్నాడు. ఈ మాట విన్న ఆమెకు చాలా చెడుగా అనిపించింది. కొంచెము బాధనిపించినా కొద్ది సేపటిలో వెళ్ళే ఈయనతో నోరు కలపటమెందుకని మౌనం వహించింది.*

*పొయ్యి మీద కిచిడి సగం మాత్రమే ఉడికింది. ఇంతలో ఆవిడ ఏదో పని మీద అటుగా వచ్చింది. అది గమనించిన ఆ బాటసారి ఆమెతో "నీ చేతికున్న గాజులు బంగారపువి ఎంతో విలువైనవిగా ఉన్నాయి కదా. రేపు నీవు విధవగా మారితే వాటిని తీయటానికి చాలా కష్టం అవగలదు. అందుచేత వాటిని విరగగొట్టవలసి వస్తుందనుకొంటాను" అని అన్నాడు. ఈ మాటలతో ఇంటి ఇల్లాలికి సహనం నశించి విపరీతమైన కోపం వచ్చి, పొయ్యి మీదున్న సగం ఉడికిన కిచిడీని బాటసారి మీద గుమ్మరించి, పాత్ర లాక్కొని పొయ్యి ఆర్పివేసి, అతని మెడమీద చేయివేసి ఇంటి నుండి బయటకు గెంటివేసింది. ముసలి బాటసారి వస్త్రాలన్నీ కిచిడీతో తడిసిపోయి బొట్లుబొట్లుగా కారటం మొదలైంది. అలాగే అతడు ముందుకు నడుస్తూ పోతున్నాడు. దారిలో ఎదురైన కొంతమంది ఇతని వాలకం చూసి, బట్టల మీద ఉన్న కిచిడీ మరకలు, వాటి మీద మూగుతున్న ఈగలను చూసి ఇదంతా ఏమిటని? అన్నారు. అందుకు ఈ ముసలి బాటసారి జరిగినదంతా వారికి చెప్తూ ఇలా అన్నాడు. "నా నోరు అదుపు తప్పిన కారణంగా ఇటువంటి దశ నాకు దాపురించింది" అని చెప్తూ సాగిపోయాడు.*

*– అఖండజ్యోతి, జనవరి 1984*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**యుద్ధంలో గెలవడానికి కావలసినది ఆయుధాలు కాదు, ఆత్మబలం**

## కలర్ ఇంజనీరింగ్-3

# ఆలోచనల శక్తి

ఆలోచనల శక్తి ఒక ఆధ్యాత్మిక శక్తి. ఇంతాకన్నా గొప్ప శక్తి మనిషి దగ్గర ఇంకొకటి లేదు. మనిషి ఎలా ఉన్నా, అతని జీవితం ఎలా ఉన్నా దానికి కారణం అతని ఆలోచనలే. మనిషి ఏవిధంగా ఆలోచిస్తాడో అలాగే తయారవుతాడు. మనిషి ఏమి చేసినా దానికి మెయిన్ స్ప్రింగ్ అతని ఆలోచనలే. మనిషి ఎలా ఆలోచిస్తాడో దానికి అనుగుణంగా అతని పరిస్థితులు, వాతావరణం ఏర్పడతాయి. మనిషి ఆలోచించే విధానాన్ని బట్టి అతని స్నేహితులు, తోడు నీడా ఉంటాయి. మనిషి ఆరోగ్యంగా ఉన్నా, అనారోగ్యంగా ఉన్నా; సంతోషంగా ఉన్నా లేక బాధలలో ఉన్నా; ధనవంతుడా లేక లేమిలో ఉన్నాడా; విజయాలు వరిస్తున్నాయా లేక ఓటమి పాలయ్యాడా; అతనిని ఇతరులు ప్రేమిస్తున్నారా లేక ద్వేషిస్తున్నారా అనేది అతని ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది.

మనిషి చేసే ఆలోచనల బట్టి అతను శీలవంతుడా లేక శీలహీనుడా అనేది నిర్ధారించబడుతుంది. అతని ఆలోచనలు అతని భవిష్యత్తును మార్చివేయగలవు (changes fate) లేదా అధః పాతాళానికి తోసివేయగలవు. నిజానికి ఆలోచనల శక్తికి అంతులేదు. ఎందుకంటే అది అధ్యాత్మిక శక్తి. ఈ శక్తితోనే అతను భగవంతుని దగ్గరకు చేరగలడు, జీవన పోరాటంలో ఓటమి నుండి బయటపడగలడు, ఎంతో ఎత్తుకు ఎదగగలడు. గొప్ప గొప్ప ఆవిష్కరణలు ఎవరో ఒకరి ఆలోచనలతోనే ప్రారంభమైనాయి. ఈ శక్తితో పుట్టుకతో వచ్చిన లోపాలను, పెరిగిన వాతావరణంలోని లోపాలను అధిగమించవచ్చు.

తన ఆలోచనలతో మనిషి తనను తాను ఆశీర్వదించు కోవచ్చు లేదా శపించుకోవచ్చు. అతని ఆలోచనలచే, అతని చేతలచే అతను జీవితంలో గెలుస్తాడో, ఓడిపోతాడా; ఆరోగ్యంగా ఉంటాడా లేక రోగాల పాలవుతాడా; ఆనందం-విషాదం; ఐశ్వర్యం-లేమి అనేవి నిర్ధారించబడుతాయి. జీవితంలో సుఖ సంతోషాలు లేకపోతే దానికి కారణం అతని తప్పుడు ఆలోచనలు, అపసవ్యమైన ఆలోచనలే తప్ప అతని బాధలకు ఇతరులు బాధ్యులు కారు. అనేకసార్లు మన సమస్యలకు ఇతరులు కారణంవలె కనుపించవచ్చు. కానీ లోతుగా పరిశీలించగలిగితే **ఎవరి పరిస్థితికి వారే కారణం** అని స్పష్టంగా అర్థమవుతుంది.

ఈ ప్రపంచమంతా ప్రకృతి నియమానుసారమే నడుస్తుంది. మనిషి ఈ ప్రకృతి నియమాలను అర్థం చేసుకుని, తనకు అన్వయించుకోగలిగితే ఇంకా అతనికి అడ్డు ఏముంటుంది? కానీ మనిషి ప్రకృతి నియమాలను మరచిపోయాడు. ప్రపంచాన్ని ఏమి మార్చక్కరలేదు. మనం మారితే చాలు. (మనం మారితే - యుగం మారుతుంది) మన జీవితంలోని ఒడిదుడుకులకు కారణం మనలోనే ఉన్నది. **మన జీవితంలో మార్పు రావాలనుకుంటే ముందు మన ఆలోచనా విధానాలను మార్చుకోవాలి.** ఆలోచనలు మారితే పరిస్థితులు మారుతాయనే గురుదేవులు చెప్తుంటారు.

ఆలోచనలు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని, మన ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తాయనటానికి ఏమన్నా ఋజువు ఉన్నదా? కొంచెం గమనిస్తే చాలా ఋజువులు కనిపిస్తాయి. నకారాత్మకమైన (negative) ఉదాహరణలు అనేకం దొరుకుతాయి. చిన్న పిల్లలకు దిష్టి తగిలిందనే మాట తరచు వింటుంటాము. అంటే ఆ పిల్లవాడి గురించో / పిల్ల గురించో నకారాత్మకమైన ఆలోచనలు ఆ పిల్లలపై పడటం, వారు ఏడుస్తుండటం గమనించే ఉంటారు. దీనికి ఉపాయంగా ఉప్పు తియ్యటం అనే పద్ధతి కూడా చూసే ఉంటారు.

ఇంకొక ఉదాహరణ. ఎక్కడికో ముఖ్యమైన పని మీద వెళ్తుంటాము. టిక్కెట్లు రిజర్వు చేసుకుంటాము. కానీ బయలు దేరేటప్పుడు ఆ టిక్కెట్టు కనిపించకపోతే? ఆ కంగారుతో ఆ భయంతో లెట్రిన్ కూడా వెళ్ళడం చూసే ఉంటారు. భయం కూడా ఒక ఆలోచనే.

ఒక పెద్ద వ్యాపారి ఉన్నారు. అతని ఆఫీసుపై ఇన్‌కంట్యాక్స్ వాళ్ళు రైడ్ (ride) చేశారు. వీళ్ళకు ఏదో దొరికింది. ఎలా ఉంటుంది అతని మానసిక పరిస్థితి. అన్నం తింటాడా? నిద్రపోతాడా?

**కష్టపడకుండా ఏదీ రాదు**

ఈనాడు బి.పి. ఎక్కువ ఎందుకు అవుతుంది అంటే టెన్షన్ వల్ల అంటారు. టెన్షన్ కూడా ఒక ఆలోచనే. ఎవరో మనకు ఇష్టమైన రసగుల్లా ఏదో తింటున్నాడు. కొంతమందికి ఆ దృశ్యం చూస్తే నోటిలో లాలాజలం ఊరుతుంది. నోట్లో ఏదైన పదార్థం పెట్టుకొని తింటున్నప్పుడు లాలాజలం ఊరాలి. కానీ నోట్లో పెట్టుకోకపోయినా, ఆ వస్తువు చూసినప్పుడు లాలాజలం ఎందుకు ఊరుతుంది? అది ఆలోచనల ప్రభావమేనని గుర్తించాలి. ఇలా అనేకచోట్ల ఆలోచనల ప్రభావాన్ని గమనించవచ్చు.

ఇంతకు మనస్సు ఎక్కడ ఉన్నది? మనస్సును చూడగలమా? లేదనే సమాధానం వస్తుంది. కానీ అది కనిపించకపోయినా మనకందరికి తెలిసినదే. మనస్సంటే ఆలోచనల సమూహం. మనస్సు మన శరీరంలో ఉన్నదా అడిగితే లేదనే చెప్పాలి. ఒక ఉదాహరణ తీసుకోవచ్చు. ఒక స్కూలులో ఏదో ఒక క్లాసు జరుగుతున్నది. టెన్త్ క్లాసు అనుకుందాం. ఎక్కడో ఏదో పెద్ద క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నది. ఒక కుర్రవాడు క్లాసులో ఉన్నాడు కానీ టీచరు చెప్పింది వినడం లేదు. వాడి దృష్టి క్రికెట్ మ్యాచ్ మీద ఉన్నది. అలాంటి పరిస్థితిని ఇంగ్లీషులో Body present, Mind absent అంటారు. వాడి శరీరం అక్కడే ఉన్నది కానీ మనస్సు అక్కడ లేదు. అంటే మన ఆలోచనలు ఎక్కడ ఉంటే మనస్సు అక్కడ ఉన్నట్లేనని శరీరం వేరు మనస్సు వేరు అని గుర్తించవచ్చు.

మరి ఈ కంటికి కనిపించని మనస్సులో రెండు భాగాలు ఉంటాయని సైకాలజిస్టులు చెప్తుంటారు. ఒకటి చేతన మనస్సు అంటే మనకు తెలిసిన మనస్సు, దీనిని కాన్షస్ మైండ్ (conscious mind) అని ఇంగ్లీషులో అంటారు. రెండో భాగాన్ని అచేతన మనస్సు అంటారు. దీనిని గురించి మనకు తెలియదు. దీనిని సబ్‌కాన్షస్ మైండ్ (sub conscious mind) అని ఇంగ్లీషు భాషలో అంటారు. దీనిలో కూడా ఆలోచనలే ఉంటాయని అంటారు. కానీ దానిని గురించిన అవగాహన మామూలుగా రాదు. మనకు తెలిసిన మనస్సు (conscious mind) పుస్తకాల ద్వారా, వినడం ద్వారా, గమనించడం ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటుంది, చివరకు ఒక నిర్ధారణకు వస్తుంది. అలా నిర్ధారించినప్పుడు ఆ ఆలోచన అచేతన మనస్సు (sub conscious mind) లోనికి వెళ్తుందని చెప్తారు. సబ్ కాన్షస్‌మైండ్ (sub conscious mind) అచేతన మనస్సు అతి ముఖ్యమైనది. ఇదే జ్ఞాపక శక్తికి కేంద్రం. దీని తెలివితేటలు పరమ అద్భుతం. మానవ శరీరంలో జరిగే లక్షలాది సంక్లిష్టమైన పనులు సునాయాసంగా చేస్తుంది. మన శరీరంలో ఆటోమేటిక్‌గా జరిగే గుండె కొట్టుకోవడం, రక్త ప్రసరణ, 24 గంటలు నిరంతరం పనిచేసే ఊపిరితిత్తులవంటి అనేకానేక పనులు నిర్విఘ్నంగా జరగటానికి కారణం ఈ అచేతన మనస్సే.

ఈ అచేతన మనస్సు (మనకు తెలియని మనస్సు (sub conscious mind) ఎంత శక్తివంతమైనదైనా, ఎంతటి శక్తి ఉన్నా దానికి స్వయంగా ఏది మంచి, ఏది చెడు అని ఆలోచించే శక్తి లేదు. అది గుడ్డిగా, దానిలోనికి వచ్చిన ఆలోచనలకు స్పందిస్తుంది. అంటే సజెషన్ (suggestion) మీద పని చేస్తుంది. అంటే ఒక విషయం గురించి పదే పదే ఆలోచిస్తుంటే, ఆ ఆ ఆలోచన అచేతన మనస్సులోకి వెళ్తుంది. అలా వెళ్ళిన ఆలోచనను వ్యక్తీకరించే పని, సాకారం చేసే పని అచేతన మనస్సు పూర్తి చేస్తుంది. అందువల్ల పదే పదే దుష్ట ఆలోచనలు చేస్తుంటే దుష్టకర్మలు సహజంగానే జరుగుతాయి. దుష్ట ఆలోచనలు చేసే ఒక బందిపోటు ఆలోచనలు మార్చుకున్నప్పుడు వాల్మీకి అయ్యాడు. పరమ క్రూరుడు అంగుళీమాలుడు ఆలోచనలు మారడంతోనే అతి పుణ్యాత్ముడు అయ్యాడు.

దీనికి తల్లక్రిందులుగా శక్తిహీనమైన, అనుమానంతో నిండిన, భయంతో కూడిన ఆలోచనలు చేస్తుంటే పరిస్థితులు తల్లక్రిందులవుతాయి. అనుమానం పెనుభూతం అనే మాట వినే ఉంటారు. ఖర్చుల గురించి ఆలోచిస్తుంటే ఖర్చులు ఎక్కువవుతాయి. సమస్యల గురించి ఆలోచిస్తుంటే సమస్యలు ఎక్కువవుతాయి. "యద్భావం తద్భవతి" అని మన వాళ్ళు ఒక మాటలో చెప్పేశారు. ఎవరైతే నకారాత్మక ఆలోచనలు చేస్తుంటారో వారు కష్టాలపాలవుతారు.

నకారాత్మకమైన ఆలోచనలు చేసేందుకు ఎటువంటి ప్రయత్నం అవసరం లేదు. సకారాత్మకమైన, సృజనాత్మకమైన ఆలోచనలు చేయాలంటే పెద్ద ప్రయత్నం అవసరమవుతుంది, ఒక పెద్ద కొండ ఎక్కే ప్రయత్నం అవసరమవుతుంది.

అందువల్ల పరిస్థితులను సానుకూలంగా మార్చుకోవాలను

**కష్టపడకుండా వచ్చింది ఏదీ నిలవదు**

కుంటే ఆలోచనలు మార్చుకోవాలి, పదే పదే అనుకోవాలి (affirmations) ఉన్నదంతా అనుకోవడంలోనే ఉన్నది. అందువల్ల సమస్యలను గురించి ఆలోచించకుండా సమస్యలకు పరిష్కారం గురించి ఆలోచించాలి; ఖర్చుల గురించి ఆలోచించ కుండా ధనసంపాదన గురించి ఆలోచనలు చెయ్యాలి; అనారోగ్యం గురించి ఆలోచించకుండా ఆరోగ్యం గురించి ఆలోచించాలి. ఊరికే ఆలోచిస్తూ కూర్చోమని చెప్పడం లేదు. తగు ప్రయత్నం చేయాలి, సాధించుకోవాలి.

అందువలన ఎవరి ప్రయత్నం వారిదే. ఎవరి సాఫల్యం వారిదే. ఎవరికి ఎవరు కాంపిటీషన్ కాదు. కాంపిటీషన్ (పోటి) లాగా కనిపించినా, ఎవరి ఆలోచన బలంగా ఉన్నదో వారే నెగ్గుతారు.

### తెలియక చేస్తున్న పొరపాట్లు

ఎవరు కావాలని నకారాత్మకమైన ఆలోచనలు చెయ్యరు. మంచిగా జరగాలనే భావిస్తుంటారు. కానీ ఈ సిద్ధాంతం తెలియకపోవడం వలన నకారాత్మకంగా ఆలోచిస్తుంటారు. నకారాత్మకమైన ఆలోచనలు ఇబ్బందులు, బాధలు కలిగిస్తాయనే అవగాహన లేదు. మనం చెప్పినా ఆం అనుకుంటే అయిపోతుందా? అని అంటుంటారు.

అపవిత్రమైన ఆలోచనలు, కోపం, ద్వేషం, కసి, అసూయ. ఇతరుల తప్పుల గురించి ఆలోచించడం, భయాలు, రోగాలు, చావులు ఇలాంటి ఆలోచనలు చాలా ప్రమాదకరం. అవి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, పరిస్థితులను తారుమారు చేస్తాయి. ఇలాంటి ఆలోచనలు నాడీ మండలాన్ని రోగగ్రస్తం చేస్తాయి. ఉత్సాహం నీరుకారిపోతుంది. అందువలన తప్పుడు నిర్ణయాలు తీసుకోవచ్చు.

అందువలన మనం చేస్తున్న ఆలోచనలపై దృష్టి ఉంచాలి. ఆలోచనలను మనం కావలసిన విధంగా మార్చుకోవాలి. ఆలోచనలను అదుపు చేసేందుకు యోగ విజ్ఞానంలో అనేక పద్ధతులు చెప్పబడ్డాయి. అన్నింటికన్నా ముఖ్యమైనది, మనం మన ఆలోచనలు మార్చుకోవాలనే సంకల్పం, తగిన ప్రయత్నం.

(సశేషం)

– ముక్కామల రత్నాకర్
*మొబైల్: 94405 20865*

---

## సత్పురుషులు

*ఒక మహారాజు మంత్రియైన భద్రజిత్‌ని పదవీచ్యుతుడిని చేస్తాడు. ఈ శిక్ష వల్ల అతనికి పశ్చాత్తాపం కలిగి దుఃఖిస్తాడని, ప్రజాభిమానం పదవి కోల్పోయి ఎందుకు పనికిరానివాడుగా జీవిస్తాడని రాజు ఆశించాడు. కానీ ఆదర్శమూర్తియైన భద్రజిత్, లోక కల్యాణాన్ని కోరుకొనే వ్యక్తికి పదవికంటే పవిత్రమైన భావాలే ముఖ్యమని నిరూపిస్తాడు. పదవిలో ఉన్నప్పటికంటే ప్రజాభిమానం, ప్రజాసహకారంతో లోకసేవలో నిమగ్నుడై సుఖ సంతోషాలతో జీవించసాగాడు. మంత్రి దుస్థితిని కళ్ళారా చూడాలని కోరి, మారువేషంలో వచ్చిన రాజు భద్రజిత్తుని చూసి ఆశ్చర్యచకితుడవుతాడు. భద్రజిత్తు ప్రభువుకి వినమ్రతతో నమస్కరించి "రాజా! మీరు పదవి నుండి తొలగించి నాకు ఉపకారమే చేశారు. కర్మాచరణ, వ్యవహార నిష్ఠ, పదవికంటే చాలా గొప్పవని తెలిసికొనే అవకాశం నాకు ఈ విధంగా లభింపచేశారు. ప్రజలకు నాకు మధ్య ఈనాడు భయం, హోదా కాక ప్రేమ, స్నేహం పొంగి ప్రవహిస్తున్నాయి. పదవి, ప్రతిష్ఠ, హోదా మొదలైన అడ్డుగోడలు పూర్తిగా తొలగిపోయాయి. ఈనాడు మా మధ్యనున్న అనుబంధం, ఆత్మీయత పదవిలో కొనసాగేటప్పుడు ఎక్కడ ఉన్నాయి? కాబట్టి మీకు నా ధన్యవాదాలు" అని పలుకుతాడు. సత్పురుషులు పదవుల ద్వారా కాక, తమ దైవీప్రవృత్తుల ద్వారా మాత్రమే గౌరవించబడాలని కోరుకుంటారనే సత్యాన్ని రాజు అవగతం చేసుకొని మహాపురుషుడైన మంత్రికి ప్రతి నమస్కారం చేస్తాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

---

**కానుకను ఇచ్చిన విషయం మరచిపోతేనే ఆ కానుకను పూర్తిగా ఇచ్చినట్లు**


పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగపరివర్తనలో మన బాధ్యత - 4

*'ప్రస్తుతము జరుగుతున్న చారిత్రాత్మకమైన యుగపరివర్తన సమయములో మనమందరము కలిసి మహత్వపూర్ణమైన బాధ్యతలను నిర్వర్తించవలసి ఉన్నది' అని పూజ్యగురుదేవులు ఉద్బోధించినట్లు మనము గత సంచికలో చదువుకున్నాము. 'సాధుసన్యాసుల సంప్రదాయమునకు చెందిన మనము ముందుగా అల్పమైన కోరికలను త్యాగము చెయ్యాలి. అసలైన ఆధ్యాత్మికత అనేది మీ కోరికలను తీర్చుకొనుటలో కాదు, మీ నిజాయితీ, మీ దృష్టికోణమును మార్చుకునే విధానములో ఉన్నది. మన జీవితములో శాశ్వతమైన పరివర్తనను తెచ్చుకోవాలని ఆశిస్తే కేవలము క్రియాకలాపాలతో సరిపోదు. అంతరంగమును సంస్కరించుకొనటం, శ్రద్ధను పెంచుకొనటం, దృష్టికోణములో మార్పుతెచ్చుకొనటం... మొదలైన అంశముల మీద దృష్టినుంచాలి. ఇదే సమగ్రమైన సాధనావిధానము. దీనివలన మానవుడి జీవితములో స్పష్టమైన మార్పులు దృష్టిగోచర మవుతాయి. వాటినే సిద్ధులు అని అంటాము' అని చెప్తూ పరమపూజ్యగురుదేవులు ఒక నిజమైన సాధకుని యొక్క ఆధ్యాత్మికవేత్త యొక్క క్రియాకలాపములు ఏవిధముగా ఉండాలో తెలియజేస్తున్నారు. రండి! వారు ఇవ్వబోయే దివ్యసందేశమును హృదయంగమము చేసుకుందాము!*

### సాధన యొక్క ప్రథమ చరణము - సంయమనము లేదా నియంత్రణ

మీరు ఇక్కడినుండి వెళ్ళేలోపల మీ నాలుకపైన నియంత్రణ సాధించుకోవాలనేది నా కోరిక. అస్వాద వ్రతమును పూర్తిగా పాటించలేకపోయినా కనీసము వారానికి ఒక రోజైనా చేయండి. ఉప్పు, పంచదారల యొక్క రుచినుండి ఒక్కరోజు మిమ్మల్ని మీరు నియంత్రించుకోండి. దీనితోపాటు సాధ్యమైనంతవరకు బ్రహ్మచర్యమును పాటించండి. శరీరముపైన నియంత్రణ సాధించినట్లయితే తద్వారా లభించే శక్తి మీకు భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. మీ కంటిచూపు మందగించకుండా, నుదుటిమీద కాంతి తరిగి పోకుండా, జ్ఞాపకశక్తి చురుకుగా ఉండటానికి సహాయ పడుతుంది.



అందుచేత ఇంద్రియములపైన ముఖ్యముగా కామేంద్రియము పైన సంయమనమును సాధించండి. తద్వారా మీకు శారీరక, మానసిక ఆరోగ్యము లభిస్తుంది. ఇక్కడినుండి వెళ్ళేముందు మీరు జీవితంలోకి ఒక క్రొత్తతరహా దృష్టికోణమును తీసుకువెళ్తే బాగుంటుంది. యజమాని అనే హోదాను ఇక్కడ వదిలేసి, 'నేను ఒక ట్రస్టీ (trustee)' అనే ఆలోచనతో వెళ్ళండి. 'ట్రస్టీ (trustee)' గా ఉండటానికి స్థిరమైన నిర్ణయము తీసుకొని వెళ్ళటమంటే, మేము మా గురుదేవుల వద్దకు వెళ్ళి సమర్పణ, శరణాగతి, విసర్జన చేసివచ్చినట్లే; మీరు కూడా తయారుకాగలరు అని మేము అర్థము చేసుకుంటాము. సమర్పణ అంటే 'నేను యజమానిని' అనే భావమును నశింపజేసుకొని, 'నేను కేవలము ఒక ట్రస్టీ (ధర్మకర్త) మాత్రమే' అన్న ఆలోచనతో పని చెయ్యటము. ట్రస్టీ (ధర్మకర్త) గా ఉండటమంటే మీ భార్యబిడ్డల యోగ క్షేమములను చూసుకుంటూ, ధన సంపదలను కాపాడుతూ జీవించడము. అలా కాకుండా మీరు యజమానిగా ఉండాలని కోరుకుంటే 'సర్పము'గా మారిపోతారు. లోభియైన ముదుసలి మరణించిన పిదప పాముగా జన్మించి, కుండమీద పడగ ఎత్తి ఎవరైనా వస్తే కాటు వెయ్యటానికి సిద్ధముగా కూర్చుంటుంది. తాను తినదు, ఇతరులను తిననివ్వదు. అభాగ్యుడైన 'యజమాని' పరిస్థితికూడా ఇంతే. అందుచేత ట్రస్టీ (ధర్మకర్త)గా జీవించినట్లయితే మీ యొక్క ప్రతి వస్తువును స్వేచ్ఛగా

**తెలివితేటలు ఎవరి సొత్తు కాదు**

ఉపయోగించుకొనవచ్చు. 'యజమాని' గా జీవించినట్లయితే డబ్బును కూడబెట్టడముతో పాటు అహంకారము కూడా ఉత్పన్నమవు తుంది. దాచిపెట్టిన సంపదను సరియైన వ్యక్తి కాకుండా అర్హతలేనివాడు అనుభవిస్తే కలిగే హానిలో యజమాని కూడా భాగస్వామికాక తప్పదు. కాబట్టి ప్రతి వస్తువును 'ట్రస్టీ' హోదాలో ఉపయోగించు కొనడము మంచిది.

## యజమానిగా కాక ధర్మకర్తగా వ్యవహరించండి

**రెండవ అంశము:** మనోనిగ్రహము. మనస్సును నిగ్రహములో ఉంచుకొనటానికి యజమాని హోదాను వదిలేసి, 'ట్రస్టీ'గా తయారుకండి. అప్పుడు సమస్త క్రియాకలాపము లలో మార్పువస్తుంది. తోటమాలి తన అవసరముల కన్నా ముందర తోటలోని మొక్కల అవసరములను గమనించి, వాటికి ప్రాముఖ్యతనిచ్చి పనిచేస్తాడు. అలాగే మీరుకూడా మీ కుటుంబములోని భార్యాపిల్లల అవసరములను గుర్తించి వారికి సుఖసంతోషములను సమకూర్చేందుకే శ్రమించే తత్వమును పెంపొందించుకొనగలరు. పిల్లలను యోగ్యులుగా తయారు చేయగలరు. వినోబాగారి తల్లి తన ముగ్గురు బిడ్డలు-వినోబ, బాలకోవ, బిఢోవాలను చక్కని వాతావరణములో పెంచి తీర్చిదిద్దింది. అది ఎలాంటి వాతావరణమంటే, అక్కడ పెరిగిన ఏ పిల్లలైనా వినోబాగారివలెనే ఉన్నతమైన వ్యక్తిత్వముతో వృద్ధి చెందేవారు. మీరుకూడా మీ ఇంటి వాతావరణమును మార్చి వేయండి. అందుకుగాను ముందర మిమ్మల్ని మీరు సంస్కరించు కొనవలసి ఉంటుంది. ఊరికే బోధించడము ద్వారా ఎలాంటి మార్పురాదు. పిల్లలు మీ బోధనలను, సూచనలను వినటానికి ఇష్టపడరు. మీ క్రియాకలాపాలు, ఆలోచనలు, తరంగాలు ఇంటి వాతావరణము అంతటా వ్యాపించి ఉంటాయి. పిల్లలు వాటిని గ్రహించి, తదను గుణముగా తమను తాము మార్చుకొనడము ఆరంభిస్తారు.

మీరు సిగిరెట్ త్రాగుతూ, పిల్లలకు 'సిగిరెట్ త్రాగటము తప్పు' అని బోధిస్తే వారు వింటారా? ముందర మీరు సంయమనమును అలవర్చుకోండి. సదాచారములను పాటించండి. మీ తల్లిదండ్రులకు సేవ చెయ్యండి. ఒక ఆదర్శమూర్తిగా తయారవండి. ఫలితముగా పిల్లలుకూడా మిమ్మల్ని అనుకరించడము ప్రారంభిస్తారు. సద్గుణములే అసలైన సంపద అని, మనము సంపదగా భావించే ఇళ్ళు, పొలములు, వస్తుసామగ్రి మొదలైనవన్నీ పైపై మెరుగులే అని వారికి తెలియజెప్పండి. ఈ పైపై మెరుగులు మనలో అహంకారమును, గర్వమును ఉత్పన్నము చేస్తాయి. మన పొరుగువారితో శత్రుత్వమును తెచ్చిపెడతాయి, ఈర్ష్యా ద్వేషములను రేకెత్తిస్తాయి.

గుణకర్మ స్వభావములుగా చెప్పబడేవే అసలైన సంపదలు. మీరు వీటిని అభివృద్ధిచేసుకొనటం ప్రారంభించండి. భార్యా బిడ్డలందరు అభివృద్ధిపథములోకి పయనించే విధముగా ప్రయత్నము చెయ్యండి. కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి పథములోకి పయనించడము మానవునికి గౌరవమర్యాదలను చేకూర్చిపెడు తుంది. మీరు పొదుపరిగా ఉంటూ, మీ కుటుంబసభ్యులకు కూడా పొదుపు చెయ్యటము అలవాటు చెయ్యండి. విలాసాలకు ఖర్చుచేసే డబ్బును, జ్ఞానమును పెంపొందించుకొనటానికి వెచ్చించండి. ఆరోగ్యమునకు తప్పనిసరిగా ఎంతో డబ్బు కావాలి, విలాసాల కోసము ఎందుకు ఖర్చుపెట్టడము? కోకాకోలాలు త్రాగటానికి బదులు 'మజ్జిగ' త్రాగండి.

## సరళమైన జీవితము - ఉన్నత ఆలోచనలతో కూడిన జీవనవిధానము

'సాదాజీవితము-ఉన్నతమైన ఆలోచనలు' అనే జీవనవిధానమును ప్రారంభించండి. దీనినే యోగాభ్యాసముగా భావించండి. యోగమంటే 24 గంటలు మనిషి తనను తాను నియమాలతో కూడిన ఒక చక్రములో బంధించుకొని పని చెయ్యటమే! అందులో పొదుపు-సహకారము అనే రెండు అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి. ఇంటిలో ఒకే ఒక్క వ్యక్తి ఆజ్ఞలు జారీచేస్తూ పెత్తనము చలాయించకూడదు. ఇంటిలోని వారందరు కలిసిమెలిసి ప్రేమతో ఒకరినొకరు గౌరవించుకుంటూ జీవితము సాగించాలి. మనము ఈ శరీరమునకు 'ట్రస్టీ' అయినట్లయితే మన కుటుంబమునకు, మన వీధికీ కూడా 'ట్రస్టీ' కాగలము. 'ట్రస్టీ' అయిన వ్యక్తి చెయ్యవలసిన పనులెన్నో ఉంటాయి.

ఇక్కడినుండి వెళ్ళేముందు మీరు కనీసము ఈ ఒక్క విషయమును గురించి ఆలోచించండి. మీ జీవితములో ఆఖరు దినములను సన్యాసిగా, వానప్రస్థాశ్రమములో గడపటానికి నిర్ణయించుకోండి. ఇంట్లోనే పుట్టి హేయమైన బ్రతుకు గడిపి ఇంట్లోనే మరణించే బల్లి, ఎలుకవంటి జీవితాలను మీరు

ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యం కోల్పోకూడదు

కోరుకొనవద్దు. చెట్టుకు పండిన పండు కొమ్మనుండి విడివడి, ఎక్కడో మరోచోట తిరిగి వృక్షముగా మొలకెత్తటానికి జారిపడుతుంది. లేదా కనీసము ఎవరో ఒక రోగికి తినటానికైనా ఉపయోగపడుతుంది. మేఘము సముద్రములో పుడుతుంది, కానీ ఎక్కడో సుదూరముగా పొలములోనో, కొండలపైనో వర్షిస్తుంది, సస్యశ్యామలం చేస్తుంది. అలాగే మీరు కూడా భావిజీవితమును లోకహితము కోసం, పరమార్థముకోసం భారతీయధర్మ సంస్కృతి సంప్రదాయములను పరిరక్షించడము కోసము వెచ్చిస్తామని ప్రతిజ్ఞ చెయ్యండి. ఈ అవకాశము మరలా వస్తుందో, రాదో! 'ఇక సంతానము చాలు' అని హృదయ పూర్వకముగా ఇప్పుడే నిర్ణయించుకోండి.

మీరు పిల్లలను సక్రమముగా పెంచాలని భావిస్తే వారి భవిష్యత్తును చక్కని ఆధ్యాత్మికమార్గములో నడిపించాలనుకుంటే ఇప్పటినుండే మీరుకూడా మారవలసి ఉంటుంది. మీ అబ్బాయి మెట్రిక్‌లో ఉత్తీర్ణుడై, పై చదువులు చదవాలని కోరుకుంటున్నాడు. అది మీ శక్తికి మించిన పని. ఎవరివద్దనైనా అప్పుతెచ్చి ఇస్తాను, జాగ్రత్తగా చదువు ముగించుకొని, ఉద్యోగములో చేరి, ఆ అప్పును నీవే తీర్చుకోవాలి' అని ఆ బాధ్యతను అతడిమీదనే పెట్టండి. పిల్లవాడు చెడుదారులు పట్టకుండా చదువుకొని సంపాదనాపరుడవుతాడు.

## దృష్టికోణమును మార్చుకొనడమే ఆధ్యాత్మికత

మీరు ఆధ్యాత్మికవేత్త కావాలన్నా, శాంతిని పొందుతూ, భారతీయ ధర్మ సంస్కృతి సంప్రదాయములను పరిరక్షించాలన్నా, జీవితపు ఆఖరుదశలో భగవంతుడిని స్మరించాలన్నా మీ దృష్టి కోణమును మార్చుకొనితీరాలి. భగవంతుడిని పూజించడమంటే మాలను చేతపట్టి త్రిప్పటము కాదు. **మీ జీవితములో పనిచేసే విధానాలను, వాటి స్వరూపమును మార్చుకోవటమే 'పూజ!'** లోకహితం కోసం, దేశం కోసం, ధర్మసంస్కృతుల కోసం పని చెయ్యటానికైనా సిద్ధముగా ఉండగలగాలి. ఈవిధముగా దృష్టి కోణమును మార్చుకున్నట్లయితే మీరు ఆధ్యాత్మిక జీవనానికి అర్హులుకాగలరు, జీవితపు చరమాంకములో మీ ఆకాంక్ష నెరవేరగలదు.

పిల్లలకు సంపదనివ్వటానికి బదులు వారిని స్వావలంబులుగా తయారుచెయ్యండి. వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడగలిగే విధముగా తీర్చిదిద్దండి. ఇక్కడినుండి బయలు దేరేముందే మీ ఆలోచనలు, దృష్టికోణము, క్రియాకలాపములు భావి జీవితమును గురించి ఒక క్రొత్తరూపురేఖలు వీటన్నింటికి సంబంధించి మీ అంతరంగములో మార్పుచేర్పులు చేసుకొని వెళ్ళండి. ఖచ్చితముగా మీ జీవితానికి పునరుద్ధరణ జరిగి తీరుతుంది. ఇది చాలా ప్రత్యేకమైన సమయము, మీరు ప్రత్యేకమైన వ్యక్తులు. మీరు చెయ్యవలసిన విశేషమైన పనులెన్నో ఉన్నాయి. వాటిని నెరవేర్చటానికి మీరు ధైర్యము చెయ్యగలిగితే ఏమి చెయ్యగలరో ఒకసారి మీగురించి మీరు ఆలోచించి నిర్ణయించుకోండి.

## రండి! కలిసి ముందుకు సాగుదాము!

మీరు-మేము కలిసి పనిచేస్తే చాలు బాగుంటుంది. ధనాత్మక, ఋణాత్మక తీగెలు రెండూ కలిస్తే ఒక ఉధృతమైన విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. మీవద్ద లేని వస్తువులు కొన్ని మావద్ద, మావద్ద లేని కొన్ని మీ చెంత ఉన్నాయి. మన మిరువురము కలిసి పనిచెయ్యటము వల్ల అన్నింటినీ తగిన రీతిలో ఉపయోగించుకొనవచ్చు. చాణక్యుడు-చంద్రగుప్తుడు, సమర్థరామదాసు-శివాజీ కలిసి జతగా పనిచెయ్యడము వలన ఎన్నో అద్భుతాలను సాధించగలిగారు. వాళ్ళు చరిత్రనే మార్చి వెయ్యగలిగారు. ఇచ్చటినుండి వెళ్ళిన తరువాత మీకు చెప్పబడిన అంశములలో అర్థమైనవాటిని హృదయంగమము చేసుకొని, మనస్ఫూర్తిగా స్వీకరించి జీవితమును తదను గుణముగా తీర్చిదిద్దుకొనగలరు. మీరు-మేము కలిసి ఒక జోడీగా తయారవగలము. ఫలితముగా మీ జీవితము మా జీవితము కూడా చరితార్థము కాగలదు.

(సమాప్తము)

*- అఖండజ్యోతి, జూన్ 2013*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

### రాజనీతిలో కూడా నిజాయితి

*ఒకసారి వ్రజమోహన్ వ్యాస్, మదన మోహన మాలవ్యా రాజనీతిని గురించి చర్చించుకుంటున్నారు. వ్రజ మోహన్ మాఘ మహాకవి "తన అభివృద్ధి, శత్రు వినాశనమే రాజనీతి" అని ఒకే ఒక వాక్యంలో చెప్పాడన్నారు. దానికి మాలవ్యా ముఖంపై చిరునవ్వు మటుమాయమైంది. "ఛీ! ఇది దుష్ట రాజనీతి. తనతోపాటు ఇతరుల శ్రేయస్సును కూడా కోరుకునేదే నిజమైన రాజనీతి" అని అన్నారు.*

**తప్పు చేస్తే సరిదిద్దుకోవాలి తప్ప బాధపడుతూ కూర్చోకూడదు**

నా వారితో నా మాట

# ఇప్పుడు జరగాలి - లేకపోతే మరి ఎప్పటికీ జరగదు



మనం కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాం. 21వ శతాబ్దంలో 13 అడుగులు వేసి 2014లో పధ్నాలుగవ అడుగు వేశాము. గత కొన్నేళ్ళుగా మన అంతఃచైతన్యంలో దైవాసుర సంగ్రామం కొనసాగుతోంది. ఒక్కోసారి ఒక్కో పక్షానికి బలం చేకూరినప్పటికీ, ఇప్పటికీ ఒక నిర్ణయానికీ రాలేదు. కానీ మనం ఇప్పుడు, 'కోరిక', 'శ్రద్ధ' అనే రెండింటిలో ఏదో ఒక దాన్ని ఎన్నుకుని తీరాలి. మనలో రెండు బలమైన తత్వాలు ఉన్నాయని అందరం అనుభూతి చెందాం. ఒకటి దైవత్వం, మరొకటి అసురత్వం. సృష్టి ఆది నుండే చీకటి-వెలుగు, పతనం-అభివృద్ధి, దుఃఖం-సుఖం అన్నీ ఉన్నాయి. వీటిలో ఒక దానితో పోరాడుతూ మరో దాన్ని చేజిక్కించుకునే ప్రయత్నంలోనే చైతన్యం తీక్షణంగా, క్రియాశీలంగా మారుతుంది.

ప్రగతి పథంలో లక్ష్యాన్ని చేరడానికి ఈ రెండు అడుగుల ఆసరా తీసుకోక తప్పదు. జడం-చైతన్యం, చీకటి-వెలుగు, దైత్యులు-దేవతలు, ఈ ద్వంద్వాలను సృష్టించడం వెనక విధాత ఉద్దేశం ఏమైనప్పటికీ, నిజం మాత్రం ఇదే. ఉపనిషత్తుల కాలంలో ఋషులు ఉన్నతి-అవనతి, ఈ రెండు మార్గాల గురించి చర్చించారు. రెండు మార్గాలు ఇప్పుడు మన ముందున్నాయి. ఎన్నుకునే స్వాతంత్రం కూడా మనకే ఉన్నది. స్వేచ్ఛ ఉంది కాబట్టే మనిషి తన భాగ్యానికి తానే నిర్మాత అయ్యాడు. మనిషి యొక్క తర్క సామర్థ్యాన్ని బట్టి అతని తెలివిని అంచనా వేస్తారు, కానీ నిజానికి అతని ముందుచూపే తెలివికి ప్రమాణం. క్షణిక ప్రలోభాలన్నీ నాశనానికే దారితీస్తాయి. తపో దారి ఎంత వేదనను కలిగించినా, చివరికి స్థిరమైన సుఖశాంతులను మిగులుస్తుంది.

ముందుచూపు లేకపోవడం వల్ల పక్షి ఎలా వలలో ఇరుక్కుంటుందో, చేప గొంతులో ఎర ఎలా గుచ్చుకుంటుందో దీపంలోకి దూకే పురుగుల సంగతి అందరికీ తెలుసు. అయినా క్షణిక సుఖాలకోసం మనుషులు తమ ధనాన్ని, ఆరోగ్యాన్ని, పరువును, ఆనందాన్ని, భవిష్యత్తును పాడు చేసుకుంటుంటారు. గొప్ప ఉద్దేశాలు నెరవేరడానికి తపస్సు, త్యాగమార్గాలే సరైనవని ఎందుకు అర్థంకాదు. మొదట్లో కష్టం, నష్టం కనిపించినా చివరికి సంతోషం, ప్రగతి తప్పక చేజిక్కుతాయి. రైతులు, శ్రామికులు, వర్తకులు, శిల్ప కళాకారులు అందరు ఇలానే ఆలోచించి ఉజ్వల భవితను అందుకుంటారు. ముందు చూపున్న మహామానవులు ఈ పద్ధతినే పాటించి సౌభాగ్యాన్ని పొందారు. అయితే ఇందుకు ప్రచండ సాహసం, దృఢ సంకల్పం కావాలి.

ఇది లేకుండా ఏదీ జరగదు. మిన్నునంటే చెట్టుగా ఎదగాలి అంటే విత్తనం ముందు కరిగిపోవాలి. మట్టిలో కరిగి పోయే ధైర్యం చేయలేని విత్తనం, అందులో నష్టాన్ని మాత్రమే చూసి, రవ్వంతైనా వికసించదు. కానీ, సాహసంతో కరిగిపోయే విత్తనం యొక్క వేళ్ళను భూమాత తన వడిలో చేర్చుకుని పోషిస్తుంది. దాని కృషిని గుర్తించి ఆకాశం వర్షిస్తుంది. రెండే మార్గాలున్నాయి. ఉన్నతి - అవనతి, స్వార్థం - పరమార్థం. దేన్ని ఎన్నుకోవాలి అనే అయోమయమే మనలో కొనసాగే దైవాసుర సంగ్రామం. నిర్ణయం తీసుకునేంత వరకు మనసుకు విశ్రాంతి ఉండదు.

ఈ దైవాసుర సంగ్రామం అంత తేలికగా ముగిసేది కాదు. సామాన్య బుద్ధిని ఉపయోగించితే ముగిసే ప్రసక్తే లేదు. ఎందుకంటే ఇరు పక్షాలు బలమైనవే, ఏదీ దేనికీ తీసిపోదు. అందుకే ఈ యుద్ధం ఏళ్ళ తరబడి కొనసాగుతోంది. ఒక సారి ఒకటి గెలిస్తే, మరోసారి ఇంకోటి గెలుస్తుంది. గెలుపు సంగతి పక్కనబెడితే, ఈ యుద్ధం అంతమయ్యేది మాత్రం దైవం అవతరించినప్పుడే. ఇప్పుడు మన జీవితాల్లో కూడా ఇలాంటిది జరిగి తీరాలి. ఋతుంభర ప్రజ్ఞ, వివేకము, గొప్ప ఉద్దేశాల కోసం ధైర్యంగా, దృఢంగా తీసుకున్న సంకల్పాల ఆధారంగానే అంతర్మథనం అంతమవుతుందని చెప్పే కథలు మన పురాణాల్లో చాలా ఉన్నాయి. మన లోపల భగవంతుడు

**అంతా ఒకరి ఇష్టం ప్రకారమే జరగటమనేది కష్టమే**

అవతరించే వరకు ద్వంద్వం, అశాంతి ఉద్భవిస్తూనే ఉంటాయి. సుఖశాంతులు ఒక్కక్షణమైనా అనుభవించలేం.

సక్రియులు, సజీవులు, అందరు ప్రస్తుతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. జడత్వపు చీకట్లలో ముసుగుతన్ని నిద్రపోతున్నవారికి చెప్పడానికి ఏమీ లేదు. కాస్తంత సుఖభోగాలు అనుభవిస్తే అంతరాత్మ దాహం తీరదు. ఈ అయోమయపు కుచక్రంలో ఇరుక్కునుంటే సమయం, శ్రమ అన్నీ వృధా అవుతూనే ఉంటాయి. గొప్ప నిర్ణయం తీసుకునేంత వరకు గొప్ప సమయం ఆసన్నమవదని ఇన్నేళ్ళ నుంచి చూస్తూనే ఉన్నాం. ఇప్పటి వరకు జరగకపోతేనేం, ఇక ముందు జరగాలి. ఈ కొత్త సంవత్సరంలో జరుగుతుంది. నిజానికి అయోమయాన్ని నిర్మూలించడానికే కొత్త సంవత్సరం వస్తోంది. జీవితం అనే గొప్ప సంపదని పరిపూర్ణంగా ఉపయోగించుకోవడం వీలవుతుంది. ఇప్పటివరకు పట్టిన తప్పుదోవ చాలు, భ్రమలో ఇరుక్కుంది చాలు, ఇకనైనా స్థిరపడదాం. ఆ విధాత ఏది సాధించడానికి మనకు మానవ జన్మనిచ్చాడో, అందుకు తగిన మార్గంలో నడవడానికి అంతర్మథనం, ఆరాటం, దిగులు అన్నీ పూర్తిగా తొలగిపోవాలి. దేవ కుటుంబంలో సభ్యులమై, నిష్ఠావంతులైన కార్యకర్తలుగా పేరుతెచ్చుకుంది అందుకే.

ప్రత్యక్షంగా కనిపించి, తక్షణ సుఖాలనిచ్చేవి ముఖ్యమైనవని మనలోని దైత్యపక్షం నిరూపించడానికి ప్రయత్నిస్తుంది. బంధుమిత్రులు కూడా ఇలాగే ప్రోత్సహిస్తారు. శరీరం, ఇంద్రియాలు సుఖపడితే తప్పేముంది? పనితోపాటు వినోదాలు, విలాసాలలో తప్పేముంది? భవిష్యత్తు గురించి ఆలోచించడం అనవసరం అంటారు. కంటికి కనిపించేదాన్ని వదిలి ఎప్పటి గురించో ఆలోచించడం వృథా అంటారు. అలా నమ్మేవాళ్ళు లోభమోహాల్లో చిక్కుకున్నట్టే. వాసన, తృష్ణల ఆధారంగా చేసే వారి పనులు అహంకారాన్ని జీవితానికి కేంద్రంగా చేస్తాయి. చుట్టుపక్కల వాతావరణం కూడా మనసు మీద అందుకు అనుకూలమైన ప్రభావాన్నే కలిగిస్తాయి.

విధాత మనిషికి ఒక గొప్ప ఉద్దేశ్యం కొరకు జీవితాన్ని ఇచ్చాడని లోపల ఉన్న దైవతత్వం చెప్తుంటుంది. సృష్టిలో మరే ప్రాణికీ దక్కని అవకాశం మనకి దక్కింది. ఈ ప్రపంచ ఉద్యానవనాన్ని మరింత శోభాయమానంగా చేసి, భగవంతుని పనులలో చేయూతను ఇవ్వడానికి మనిషికి జీవితమనే సంపదను ఇచ్చారు. ఈ మార్గంలో నడిస్తేనే మనసు, పరిస్థితులు దివ్యంగా మారగలవు. బంధనాల నుండి ముక్తిని, పూర్ణత్వాన్ని పొంది జీవిత లక్ష్యాన్ని చేరుకోగలం. ఆత్మ సంతోషం, ఆత్మ శాంతి అనే విజయానికి ఇది అవసరం అంటుంది దైవతత్వం. జిహ్వా చాపల్యం, లైంగిక అశ్లీలత కొంత సేపటివరకే ఆహ్లాదాన్ని ఇస్తాయి. కాని చివరికి మిగిలేదల్లా జీర్ణకోశ రోగాలు, శరీరంలో డొల్ల. ఈ విలాసాలు, భోగాలన్నీ పక్కవారికి తమ గొప్పలు చూపించుకోవడానికేగా. ఎంత డాబు ప్రదర్శించినా అవతలి వారి నమ్మకాన్ని మాత్రం పొందలేరు.

మానవ జన్మని జీవన సాధన కోసమే వినియోగించాలని వివేకం, బుద్ధి నిరంతరం తెలియచెప్తుంటాయి. కస్తూరిని వెతకడానికి పరిగెత్తే మృగం అలిసిపోతుంది, దిగులు పడుతుంది. ఆ సుగంధం తన నాభి నుండే వస్తుందని తెలుసుకున్న తరువాతే స్థిమితపడుతుంది. కోరికల వెంట పడితేనే అలసట, దిగులు. వాటి నిజస్వరూపం తెలుసుకున్నాకే స్థిమితంగా ఉండగలం. ఆంతరిక ఉత్కృష్టతను బట్టే సుఖ శాంతులు, నిజమైన సమృద్ధి, అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇది తెలుసుకున్న తరువాత భోగవాంఛలు అనుభవించాలనే లాలస చల్లారిపోతుంది. లేకపోతే అగ్నిలో ఆజ్యం పోసినట్టు పెరుగుతుంది.

అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులు, గాయత్రి పరివార్ సభ్యులు, యుగనిర్మాణ యోజనలో నిష్ఠావంతులైన కార్యకర్తలు స్వయంగా తమ లోపల దైవాసుర సంగ్రామాన్ని చాలాకాలంగా అనుభవిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఈ ఘర్షణ ఇంకా ప్రచండంగా మారింది. కాస్త ఆత్మ సమీక్ష చేసుకుంటే ఈ నిజం తెలుస్తుంది. బాహ్య జీవితంలో గొడవలు, ద్వేషాలు, ఇరకాటాలు ఎలా పీడిస్తాయి, కష్టపెడతాయో అందరికీ తెలుసు. కానీ ఆంతరిక ద్వంద్వం, మథనాన్ని అనుభవించేవారు ఇవి మరింత బాధాకరమైనవని తెలుసుకునే ఉంటారు. గురువు, పరమాత్మల ఎడల భక్తి కలిగినవారు, ఖచ్చితంగా ఈ సత్యాన్ని తెలుసుకోగలరు.

ఒక వైపు ఈశ్వరుడు తన ఒడిలో కూర్చోపెట్టుకుని గుండెలకి హత్తుకుంటాను అని పిలుస్తున్నాడు. మరో వైపు లోభమోహాలు చేతులకి, కాళ్ళకి బేడీలు వేస్తానంటున్నాయి.

**జీవితం యొక్క సారం ఒడిదుడుకులలోనే ఉన్నది**

స్వార్థం, అహంకారం నడుం బిగించి కూర్చున్నాయి. వెనక్కి వెళ్ళిపోదామా? ఉన్నచోటనే ఉందామా? ముందుకు సాగుదామా? ఏమీ అర్థం కావట్లేదు. కానీ ఈ ప్రశ్నకి ఈ రోజే, ఇప్పుడే జవాబు కావాలి. ఉపేక్షించేంత సమయం లేదు. ఇంతకు ముందువలె అయోమయంలోనే ఉంటే జీవితం నాశనం కాగలదు. గడిచిపోయినదాన్ని వదిలేసి, మిగిలిన సమయం, జీవితం వృధా అవకుండా సక్రమమైన జీవనక్రమం కొనసాగిస్తే ఉజ్వల భవిష్యత్తును పొందగలం. ఇక కొన్ని రోజులే మిగిలి ఉన్నా, భవసాగరాన్ని దాటగలం, ఇతరులను మన నావలో కూర్చోపెట్టుకుని దాటించగలం.

మనలోని గురునిష్ఠ, ఈశ్వరనిష్ఠ నిరూపించుకునే అవకాశం ఇదే. మన అంతర్ చైతన్యంలో పరమేశ్వరుడి క్రీడను ఆహ్వానిద్దాం, దైవత్వాన్ని సమర్థిద్దాం. వివేకంతో నిర్ణయం తీసుకుందాం. మనము, మనవారు దేవమానవుల స్థాయి జీవితాన్నే గడపాలని నిర్ణయించుకుందాం. కొత్త సంవత్సరంలో ఇలా నిర్ణయించు కుంటే సరిపోదు. సంకల్పాన్ని కార్యాన్వితం చేయగల ఉత్సాహం కూడా ఉండాలి. వ్యక్తిగత జీవితంలో ఈ ఉల్లాస భరితమైన ఉత్సాహం కలగడానినే మహాకాలుని అవతరణ అంటారు.

ఈ కొత్త సంవత్సరంలోని తొలి పగలే దీనికి సరైన ముహూర్తం. వివేకంతో, సాహసంతో భగవంతుడిని ఆహ్వానించి దైవాసుర సంగ్రామాన్ని నివారించగలిగితే, ఈ దైవ కుటుంబం లోని అసంఖ్య ప్రతిభా సంపన్నులు మహాకాలుని చరణాల యందు ఎంతో అంత, భావపూర్వకమైన ఆత్మాహుతిని సమర్పించగలరు. బాధ, పతనాల అగాధంలో కూరుకుపోతున్న మానవత్వం ఆర్తితో వేడుకునేది దీనికోసమే. మహాకాలుడు కోరింది ఇదే. ఇందుకోసం మన యుగనిర్మాణ యోజనలోని ప్రతి ఒక్క కార్యకర్త అసాధారణ భూమికను నిర్వహించగలరు. రాహు కేతువుల్లాగా అంతర్ జ్యోతికి గ్రహణం పట్టించగల లోభ మోహాల నుండి ముక్తిని పొందడమే ఇప్పుడు కావలసినది.

అంతర్ చైతన్యంలో జరిగే దైవాసుర సంగ్రామంలో దేవతా పక్షాన్ని సమర్థించేవారే, దేవమానవుల్లాగా యుగ పరివర్తన మహావేళ తమ విశేష భూమికను నిర్వహించగలరు. ఈ విషయంలో మన పరిజనులు మరింత లోతుగా ఆలోచించి, ప్రచండ సాహసాన్ని కనబరచాలి. ఎవరు, ఏ విధంగా, ఎంత సమర్పించుకోగలరో, సమయం, శ్రమ, ధనం, ప్రతిభలతో మరింత కృషి చేసి వీలైనంత ఎక్కువగా సమర్పించడం మొదలుపెట్టాలి. ఇన్నేళ్ళు చేసిన కృషికి అనేక రెట్లు కృషి ఇప్పుడు చేయాలి. వచ్చే వసంత పంచమి ఈ నవ జాగరణకు పిలుపును ఇస్తోందని గుర్తుపెట్టుకోండి. పిలుపు వినడం, స్వీకరించడమే మన గురుభక్తికి, ఈశ్వర భక్తికి గీటురాయి.

*– అఖండజ్యోతి జనవరి 2014*
*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్*

## ప్రార్థన

*కన్ఫ్యూసియస్ అను పేరుగల ప్రసిద్ధ తత్వజ్ఞాని చైనాలో ఉండేవాడు. ఆయన శిష్యులు ఒకరోజు ఆయనను ఇలా అడిగారు – "గురుదేవా! ఎవరి ప్రార్థనలు సత్యంతో కూడి ఉంటాయి?" జవాబుగా "లించీ ఇట్టి సాధకుడే. ఇతని ప్రార్థనలను భగవంతుడు వింటాడు" అన్నాడు. దీనితో కన్ఫ్యూసియస్ శిష్యులలో, లించీని కలవాలనే ఉత్సాహంతో బయలుదేరి అతని గ్రామానికి వెళ్ళారు. లించీ ఒక సాధారణ రైతు. రోజంతా ఆయన చెంత గడిపి అతడు చేసేడి విశేష ప్రార్థనను విని, దానిని వ్రాసికొని దానిని అభ్యసించాలని ఎంతో ఆతృతగా ఎదురు చూడసాగారు కన్ఫ్యూసియస్ శిష్యులు. లించీ ఉదయానే తన పొలానికి వెళ్ళి ఆకాశం వంక చూస్తూ "హే ప్రభూ! నాకు ఈ జీవితాన్ని ప్రసాదించావు, ధన్యవాదాలు!" అని ప్రార్థిస్తూ తన పనిలో నిమగ్నమైపోయాడు. తదుపరి రోజంతా మరే ఇతర ప్రార్థన చేయలేదు. దీనితో కన్ఫ్యూసియస్ శిష్యులు నిరాశ చెంది వెనుదిరిగిపోయి తమ గురుదేవులతో "గురుదేవా! మీ మెప్పును పొందిన లించీ ఒకే ఒక్క వాక్యానికి మించి ప్రార్థన చేయలేదు" అన్నారు. దీనికి ఆయన నవ్వి "బిడ్డలారా! ఎవరి జీవితం ఒక ప్రార్థనలా రూపుదిద్దుకుంటుందో వారు ప్రత్యేకంగా ఆడంబరంగా వేరే ప్రార్థన చేయనవసరం లేదు. అట్టి ప్రార్థన వారి అంతఃకరణ నుండి వెలువడి, నేరుగా అది పరమాత్ముని చేరుతుంది.*

*– అఖండజ్యోతి, జూన్ 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**అందరు మీకు కావలసిన విధంగా ఉండాలని అనుకోకండి**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## అమలాపురంలో

**03.12.2013** రాజోలు మండలం తాటిపాక గ్రామంలో సాయిలక్ష్మీ గోశాల యందు సామూహిక దీపయజ్ఞం శ్రీమతి నాగమణి, ఎ.సూర్యకుమారిగార్ల ఆధ్వర్యంలో జరిగింది. 60 మంది పరిజనులు పాల్గొన్నారు. అందరు ప్రతిరోజు గాయత్రీ జపం చేయుటకు, వారం వారం దీపయజ్ఞం చేయుటకు సంకల్పం తీసుకున్నారు.

**05.12.2013** అమలాపురం శ్రీరామలింగేశ్వర ఆలయంలో సామూహిక దీపయజ్ఞం శ్రీమతి నాగమణి, జయశ్రీ, సీతా కుమారిగార్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరిజనులలో 37 మంది నిత్యం గాయత్రీ జపం చేయుటకు, వారం వారం దీపయజ్ఞం నిర్వహించుటకు సంకల్పించారు.

**21.12.2013 నుండి 23.12.2013 వరకు** అనపర్తి గ్రామంలో మూడు రోజుల జీవనదేవత – సాధన – ఆరాధన పై సాధన శిబిరం శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీమతి నాగమణి, గాయత్రిగార్లు నిర్వహించారు. సుమారు 30 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంకా రెండు ఏక కుండీ యజ్ఞములు, రెండు జన్మదిన సంస్కారములు, ఒక అక్షరాభ్యాస సంస్కారం నిర్వహించబడినవి.

## మన్నెగూడెంలో

కరీంనగర్ జిల్లా మేడిపల్లి మండలం, మన్నెగూడెం గ్రామంలో 2013 నవంబరు 9, 10 తేదీలలో 251 దీపములతో దీపయజ్ఞం, 12 కుండముల గాయత్రీ మహాయజ్ఞము వేములవాడ వేదగాయత్రీ ప్రజ్ఞాపీఠం వారి ఆధ్వర్యంలో డా॥ పులి సత్యన్నారాయణ, శ్రీ రేగుంటశ్రీధర్, శ్రీ గుంటక భూమానంద గార్లు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీ ఆడెం గంగారాం, గ్రామసర్పంచి శ్రీ గౌరు భూమయ్య, మాజీసర్పంచి శ్రీ వైరంకొండ సత్యన్నారాయణగార్లు సహాయ సహకారములను అందించారు. 300 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సామూహిక గాయత్రీమంత్ర దీక్ష ఇవ్వబడింది. రూ.2000/-ల గురుదేవుల సాహిత్యం విక్రయించబడింది.

## నారాకోడూరులో

2013 డిసెంబరు 14 నుండి 18 వరకు గాయత్రీ శక్తిపీఠము, నారాకోడూరు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యకర్తల ఐదు రోజుల మౌనజప సాధనా శిబిరం శాంతికుంజ్, హరిద్వార్ వారి సారథ్యంలో గాయత్రీ చేతనాకేంద్రం నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి గాయత్రీ పరివార్ క్రియాశీల కార్యకర్తలు 70 మంది వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

14వ తేది ఉదయం 10 గంటల నుండి శిబిరం ప్రారంభమైనది. ఈ క్రింది దినసరి సమయసారిణిని అనుసరించి కార్యక్రమాలు నిర్వహించారు.

| | |
|---|---|
| ఉ॥ 5.00 – 5.10 వరకు | ఆత్మబోధ |
| ఉ॥ 6.00 – 6.45 వరకు | ప్రాణాయామం, యోగా |
| ఉ॥ 7.00 – 7.30 వరకు | 3 శరీరాల ధ్యానం |
| ఉ॥ 7.40 – 8.40 వరకు | యజ్ఞం |
| ఉ॥ 8.40 – 9.30 వరకు | ఉపాహారం |
| ఉ॥ 9.30 – 10.30 వరకు | మౌనసాధన జపం |
| ఉ॥ 10.45 – 12.00 వరకు | సంగీతం–ప్రవచనం |
| మ॥ 2.00 – 3.00 వరకు | మౌనసాధన |
| మ॥ 3.00 – సా.4.00 వరకు | స్వాధ్యాయం |
| సా॥ 4.00 – 4.30 వరకు | టీ విరామం |
| సా॥ 4.30 – 5.00 వరకు | శ్రమదానం |
| సా॥ 5.00 – 5.30 వరకు | వ్యక్తిగత సలహాలు |
| సా॥ 6.00 – 6.20 వరకు | నాదయోగం |
| సా॥ 6.30 – రా 7.15 వరకు | ప్రశ్నోత్తరి |
| రా॥ 7.15 – 8.15 వరకు | భోజనము |
| రా॥ 8.15 – 9.00 వరకు | తత్వబోధ |
| రా॥ 9.00 నుండి | విశ్రాంతి |

14వ తేది మధ్యాహ్నం దక్షిణ భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు ఆదరణీయ శ్రీ గౌర్‌జీ మరియు శ్రీ

**నమ్మకం ఉన్నవాడికి విగ్రహంలో సర్వాంతర్యామి కనిపిస్తాడు**

అశ్విని సుబ్బారావుగార్లు పూజ్యగురుదేవుల జప ధ్యానముల గురించి వివరించారు.

15వ తేది నుండి 17వ తేది వరకు ఈ క్రింద ఉదహరించిన పరమపూజ్య గురుదేవుల విరచిత పుస్తకములపై వివరణనిస్తూ శ్రీ గౌర్‌జీ మరియు శ్రీ అశ్విని సుబ్బారావు గార్లు వివరణ అందించుట జరిగింది.

ఈ క్రింది పుస్తకములను స్వాధ్యాయానికై వినియోగించారు 1) జీవనదేవత సాధన-బంగారు సూత్రాలు 2) యుగనిర్మాణ సత్సంకల్పాలు 3) పరమపూజ్య గురుదేవులు తమ అంగ అవయవములు అయిన కార్యకర్తల నుండి ఆశించేది.

కార్యకర్తలు తమ బాధ్యతల గుర్తెరిగి, పూజ్య గురుదేవుల మార్గనిర్దేశానుసారం, స్వాధ్యాయ సత్సంగాలను నిర్వహిస్తూ, నిత్యమననం గావిస్తూ ముందుకు సాగాలి అని ఉద్బోధించారు. ప్రశ్నోత్తరి కార్యక్రమంలో సాధకుని ప్రశ్నకు జవాబుగా శ్రీగౌర్‌జీ ఈ రీతిలో సమాధానమిచ్చారు

**ప్రశ్న:** జపము, ధ్యానానికి కూర్చొన్న కొద్దిసేపటికే నిద్ర వస్తున్నది? కారణమేమి? దీనిని అధిగమించుటెట్లు?

**జవాబు:** దీనికి అనేక కారణాలు ఉంటాయి. క్రితము రాత్రి నిద్ర లేమి ఒక కారణం. రెండవది ఆహార స్వీకరణపై తగినంత నియంత్రణ లేకుండుట. మూడవది జపధ్యానముల పట్ల తగినంత శ్రద్ధాసక్తులు లేకుండుట. వీనిపట్ల కావలసిన తత్పరత ఉండాలి. అప్పుడే జపధ్యానములు చేయుటలోని మాధుర్యాన్ని సాధకుడు అనుభవంలోనికి తెచ్చుకోగలడు. ఇరువురి ప్రేమికుల మధ్య ఉండవలసిన ఆత్మీయ ప్రేమలాంటిది. సాధకునికి, భగవంతునికి మధ్య నెలకొనుట తప్పనిసరి. ఇదిలేని వేళ అది ఒక భౌతిక కర్మకాండగానే మిగిలిపోతుంది. అంతః కరణలో పరివర్తన రాజాలదు.

ప్రస్తుతం అనేకానేక మందిరాలు, దేవీ-దేవతలు, అనేక గురువులు, అనేక రకాల పూజలు వ్యాప్తిలో ఉన్నాయి. దీనివలన దైవం యొక్క లేక భగవంతుని అసలు రూపం మరుగునపడి బాహ్యరూపాలకు, ఆడంబరాలు, పూజలకు, కర్మకాండలకు ప్రాధాన్యత సంతరించుకొని, జ్ఞానం మరుగున పడి, అజ్ఞానం రాజ్యమేలుచున్నది. దీనివలన మనిషిలో రావలసిన హృదయ పరివర్తన, వివేకం, ప్రజ్ఞ జాగృతమగుట లేదు, నిష్కామ ప్రేమ ఉదయించుట లేదు. దీనితో కోపం, ఈర్ష్య, అసూయ కనుమరుగవుటకు బదులు వ్యాప్తి చెందుతున్నాయి.

మానవ మనస్సు కోతివలె చంచలమైనది. దీనిని అనుక్షణం స్వాధ్యాయ, సత్సంగాల ద్వారా, సన్మార్గంలోనికి తేవాలి. సాధన లేని జీవితం అశాంతితో కూడి ఉంటుంది. నిత్యసాధన తప్పనిసరి.

పై రీతిలో సమయసారిణి ప్రకారము, 15 నుండి 17 వరకు కార్యక్రమాలు జరిగాయి. కార్యకర్తలలో నూతన ఉత్సాహాన్ని నింపుతూ, వారి కర్తవ్యాలను, బాధ్యతలను గుర్తు చేస్తూ పూజ్య గురుదేవుల అంగ అవయవాలుగా కార్యకర్తలు, ఏ రీతిలో మసలుకొనవలసినది తెలియజేస్తూ తగిన మార్గనిర్దేశనం చేయుట జరిగింది.

శిక్షణా కాలమందు యోగా తరగతులను ఆసన ప్రాణయామాలను శ్రీ తోషన్ (శాంతికుంజ్) నిర్వహించారు. నిత్య గాయత్రీ హోమాన్ని శ్రీ ఉమేష్‌శర్మగారు నిర్వహించి మెళకువలను గుర్తుచేశారు.

హిందీ ప్రసంగాలను శ్రీమతి ప్రశాంతిశర్మ (శాంతికుంజ్) తర్జుమా చేసి శిబిర సఫలతకు తోడ్పాటునందించారు.

ఈ శిబిర సత్ఫలితాలను అంచనావేసి రానున్న కాలములో మరిన్ని శిక్షణా శిబిరాలను నారాకోడూరులో నిర్వహించాలనే సూచనలు రాగా, శ్రీ గౌర్‌జీ మరియు శ్రీ అశ్విని సుబ్బారావు గారు తమ ఆమోద ముద్రను తెలిపారు.

## సత్యము - అసత్యము

*మనుష్యుని నీడ మనుష్యునితో ఇట్లన్నది "నీవు ఎదుగూ బొదుగు లేకుండా అలాగే ఉన్నావు. చూడు! నేను నీకన్న ఎన్ని రెట్లు ఎదిగానో! దీనికి మనుష్యుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు. "సత్యానికి మరియు అసత్యానికి మధ్య ఇదే విధమైన అంతరం ఉన్నది. సత్యము ఎల్లవేళలా స్థిరంగా ఉంటుంది. కాని అసత్యం కపటం మరియు వంచనలను ఆధారంగా చేసుకొని నిలకడగా ఉండదు. ఇదే ఛాయా-పురుషుల మధ్యగల తేడా.*

*- అఖండజ్యోతి, డిసెంబరు 2013*

*అనువాదం: ఎ.వేణుగోపాలరెడ్డి*

**మన బలాలను, బలహీనతలను బేరీజు వేసుకోవాలి**